ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
కడప
fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-9-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 226 పేజీలు: 10+4 వెల: 6.50

భారీ ఎన్‌కౌంటర్: మావోయిస్టు అగ్రనేత సహా ముగ్గురు హతం 2లో
సుంకాలు పెంచితే అమెరికాపై ప్రతిచర్య: చైనా 5లో

# యూరియాతో కేన్సర్



## రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేయండి
## విజన్ డాక్యుమెంటే భగవద్గీత, ఖురాన్, బైబిల్
## సరైన వ్యక్తి సరైన చోట ఉండేలా నియామకాలు
## 2029కి రూ.29లక్షల జిఎస్డీపి లక్ష్యం
## తలసరి ఆదాయం రూ.4.67లక్షలు పైనే
### రెండురోజుల కలెక్టర్ల సదస్సు ప్రారంభ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ-2047 స్వర్ణాంధ్ర విజన్ అధికారులందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. భారత్ అభివృద్ధికి తోడుగా ఆంధ్రప్రదేశ్‌ను కూడా అగ్రస్థానానికి నిలిపేందుకు పాలనా యంత్రాంగం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు బ్యూరోక్రాటిక్‌గా కాకుండా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుని పాలసీలు అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే సేవలన్నింటిలోనూ సంతృప్తి స్థాయే కొలమానం అవుతుందని తేల్చిచెప్పారు.కలెక్టర్లు, అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఆఫీసులో కూర్చొని పేపర్ మీద చూస్తే అంతా చక్కగా ఉంటుంది..సవ్యంగానే కన్పిస్తుంది. క్షేత్ర స్థాయిలో పర్యటించాలి. వాస్తవాలు గ్రహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభం అయింది. తొలి రోజున వివిధ అంశాలపై చర్చించారు. జిల్లాల్లో ప్రగతి, సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించడంతో పాటు... కేటగిరీల వారీగా శాఖలపై సీఎం సమీక్షించారు. లాజిస్టిక్స్, ఇన్ఫ్రా, స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై చర్చించారు. సూపర్ సిక్స్, పీ4 అమలు వంటి అంశాల అమలు ఏ విధంగా జరుగుతున్నాయోననే అంశాన్ని కలెక్టర్లకు వివరించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని, అలాగే జీఎస్డీపీ గ్రోత్ వంటి అంశాలపై సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'కొత్తగా నియమితులైన కలెక్టర్లకు ప్రజలు, కేబినెట్ తరపున శుభాభినందనలు. కలెక్టర్లు తమను తాము నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధాని, సీఎం తర్వాత కలెక్టర్లే అత్యంత కీలకమైన వ్యక్తులు. జిల్లా రూపు రేఖల్ని మార్చటంలో వారిదే ప్రధాన బాధ్యత. ప్రభుత్వం రూపొందించిన విధానాలను సక్రమంగా అమలు చేసేది కలెక్టర్లే. సీఎస్, డీజీపీల నుంచి క్షేత్ర స్థాయి వరకూ సరైన వ్యక్తి సరైన చోట ఉండాలనే లక్ష్యంతో నియమాకాలు చేశాం. అన్ని కోణాల్లో ఆలోచించి ఎమ్మెల్యేల అభ్యర్థుల ఎంపిక, కేబినెట్ కూర్పు చేశాం. అదే తరహాలో సమర్థులైన వారి కోసం కలెక్టర్ల పోస్టింగులు చేపట్టాం. దీనికి అనుగు

>>2




## వక్ఫ్ సవరణలపై
# పూర్తి స్టే ఇవ్వలేం
● కొన్ని నిబంధనలకే వర్తింపు ● ఐదేళ్లు ఇస్లామ్‌ను అనుసరించాలనే నిబంధన సహా స్టేలో పలు అంశాలు ● వక్ఫ్ మండళ్లలో ముస్లిమేతరుల సంఖ్య 3కు తగ్గింపు: సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** దేశవ్యాప్త ఆందోళనలకు కారణమైన వక్ఫ్ చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాజ్యాంగబద్ధత ఉన్నందున మొత్తం చట్టంపై స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే వక్ఫ్ చట్టంలోని పలు నిబంధనల అమలుపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. కనీసం ఐదేళ్లుగా ఇస్లామ్ మతాన్ని అనుసరిస్తున్న వారు మాత్రమే వక్ఫ్‌ను రూపొందించగలరనే నిబంధన కూడా స్టే ఇచ్చిన జాబితాలో ఉంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈమేరకు సోమవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్ చట్టంలోని అన్ని సెక్షన్లను సవాలు చేస్తూ దాఖలైన ప్రాథమిక అభియోగాలపై తాము

>>2



పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్
రూ.10లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపిన ప్రభుత్వం
క్షేత్రస్థాయిలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

# ప్రతి మంగళవారం 'ఇండస్ట్రీ డే'

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ ఎస్ గ్రీవెన్స్ డే లాగానే ప్రతి మంగళవారం ఇండస్ట్రీడే కార్యక్రమం నిర్వహించాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్. యువరాజ్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించి ఆయన సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర జీఎస్డీపీలో 44 శాతం వాటా పారిశ్రామిక రంగమే అందిస్తోందన్నారు. జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలతో జిల్లా కలెక్టర్లు స్వయంగా సంప్రదింపులు జరిపి క్షేత్ర స్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ విషయంలో జిల్లా కలెక్టర్లు సంక్లిష్టంగా కాకుండా కొంత సరళీకృతంగా పనిచేయాలన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేవి ఎంఎస్ఎంఈలేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జూన్ 2024నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.10,06,799 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 122ప్రాజెక్టులకుప్రభుత్వం అనుమతులిచ్చిందని వెల్లడించారు.

# లిక్కర్ స్కాంలో మరో అనుబంధ ఛార్జిషీటు
### చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్, నవీన్ కృష్ణ ప్రమేయంపై అభియోగాలు దాఖలు

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో మరో అనుబంధ అభియోగపత్రాన్ని సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేశారు. ముడుపుల రవాణాలో కీలకంగా వ్యవహరించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని మిత్రుడు వెంకటేశ్‌నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ ప్రమేయంపై ఛార్జ్‌షీట్‌లో పొందుపరిచినట్లు సమాచారం. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు రెండో అనుబంధ అభియోగపత్రాన్ని సిట్ దాఖలు చేసింది. జగన్‌కు అత్యంత సన్నిహితుడు మద్యం కేసులో 38వ నిందితుడిగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, 34వ నిందితుడిగా ఉన్న అతని స్నేహితుడు వెంకటేశ్‌నాయుడు, 35వ నిందితుడిగా ఉన్న చెవిరెడ్డి ప్రధాన అనుచరుడు బాలాజీకుమార్ యాదవ్, 36వ నింది తుడిగా ఉన్న వ్యక్తిగత సహాయకుడు నవీన్‌కృష్ణల ప్రమేయం, పాత్రపై దర్యాప్తులో వెల్లడైన అంశాల్ని తాజా అభియోగపత్రంలో పూర్తి వివరాలతో పొందుపరిచినట్లు సమాచారం.మద్యం సరఫరా కంపెనీల నుంచి తీసుకున్న ముడుపుల సొమ్ములో కొంత మొత్తాన్ని గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులకు చేరవేయడంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి కర్త, కర్మ, క్రియగా వ్యవహరించినట్లు సిట్ దర్యాప్తులో తేల్చింది. ముడుపుల సొమ్ము తరలింపు, కలెక్షన్ పాయింట్‌లకు చేరవేయడంలో చెవిరెడ్డి సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడు కీలకంగా ఉన్నట్లు, బాలాజీ, నవీన్‌కృష్ణలు వారికి సహకరించినట్లు సిట్ గుర్తించింది. దీని కోసం తుడా వాహనాలు వినియోగించినట్లు తేల్చింది. ఈ సమాచారంతో పాటు ఆ నిధులు ఎవరెవరికి చేర్చారో ఈ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం. కాల్ డీటెయిల్ రికార్డులు, సెల్ టవర్ లొకేషన్లు, టవర్ డంప్‌లు, డివైస్ యాక్టివిటీ, టోల్ ప్లాజాల దగ్గర వాహనాల కదలికల సమాచారం, ఫోరెన్సిక్ నివేదికల్ని ఈ అభియోగపత్రంతో పాటు కోర్టుకు సమర్పించినట్లు తెలుస్తోంది. మద్యం ముడుపుల ద్వారా కొల్లగొట్టిన నల్లధనంలో కొంత మొత్తాన్ని వైట్‌లోకి మార్చుకునేందుకు చెవిరెడ్డి తన బినామీల పేరిట పలుడొల్ల కంపెనీలు ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున భూముల లావాదేవీల నిర్వహించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. తిరుపతి జిల్లా

>>2

## మహిళా సాధికారతతోనే
# దేశ పురోభివృద్ధి
### సదస్సు తీర్మానాలు కొత్త ఆత్మవిశ్వాసానికి శ్రీకారం
### మహిళలకు డిజిటల్ విద్యను ప్రోత్సహించాలి
### జాతీయ మహిళా సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సోమవారం మహిళా సదస్సులో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**తిరుపతిరూరల్,సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** మహిళా సాధికారతతోనే దేశ పురోభివృద్ధి సుసాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తొలి మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేసారు. మహిళా సాధికారత సదస్సులో చేసిన తీర్మానాలు కొత్త ఆత్మ విశ్వసానికి శ్రీకారం చుట్టాయన్నారు. మహిళల సమాన హక్కులు, రాజకీయాలలో మరింత ప్రాతినిధ్యం విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో అవకాశాలు, సురక్షిత సమాజ నిర్మాణం, ఇవన్నీ కేవలం నినాదాలు కావని, మనం సాధించాల్సిన లక్ష్యాలని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో మహిళా సాధికారతకు పునాది వేసిన దార్శనికులు అల్లూరి సీతారామరాజు అని, ఆ దారిలో ముందుకు బలపరిచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని తెలిపారు. మహిళా శక్తి మనకు ప్రగతిశక్తి అని, ఆ శక్తిని సద్వినియోగం చేసుకున్న దిశలో వినియోగించకలిగితే మన దేశం మరింత బలపడుతుందన్నారు. ఈ సదస్సులో తీసుకున్న ఆలోచనలు, తీర్మానాలు కేవలం కాగితాలలోనే కాకుండా ప్రజల జీవితాలలో మార్పులు తీసుకురావటానికి ఉపయోగపడాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా మనం కేవలం హాజరుకావడం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించే మార్గాలను కనుగొని, వాటటిని అమలు చేయడమే ప్రధాన బాధ్యత ఉండాలన్నారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశం కావాలంటే మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో సమగ్ర భాగస్వామ్యం కలిగి ఉండాలన్నారు. చంద్రయాన్-3లో మహిళా శాస్త్రవేత్తల విజయాలు, ఎన్‌డిఎలో 17 మహిళా కెడెట్స్ తొలిసారిగా పట్టభద్రులుగా అవతరించడం, చెనాబ్ వంతేన ప్రాజెక్టు ప్రొఫెసర్ జి.మాధవీలత 17వ సంవత్సరాల కృషి అని గుర్తు చేసారు. మహిళా సాధికారతపై శాసనసభ కమిటీ స్థాపన

>>2




## గజపతినగరంలో రోడ్డెక్కిన రైతులు
### యూరియా కోసం ఆందోళన
### పోలీసులు రంగప్రవేశం

**గజపతినగరం (విజయనగరం జిల్లా), సెప్టెంబరు 15 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లాలోని గజపతినగరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. యూరియా తమకు కావలసిన వారికి మాత్రమే అందజేస్తున్నారన్న ఆరోపణల నడుమ రైతులు ఆందోళనకు దిగారు. అప్పటివరకు యూరియా కోసం అధికారులు అందజేసిన స్లిప్పులతో భారీగా క్యూ కట్టిన రైతులు, ఒక్కసారిగా కట్లు తెంచుకు వచ్చి ఆగ్రహంతో కార్యాలయంలో ప్రవేశించి అధికారులతో తీవ్ర వాగ్వివాదంకు దిగారు. అనంతరం జాతీయ రహదారి రోడ్డుపై అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడం

>>2

## కొత్త ఆరోగ్య బీమా
# అదనంగా 185 వైద్యసేవలు



### ప్రభుత్వాసుపత్రుల ద్వారా మొత్తం 324 అదనపు సేవలు
### 3257కు పెరిగిన మొత్తం సేవలు
### 197 సేవలకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చెల్లింపులు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన మిశ్రమ(హైబ్రిడ్) విధానంలో అందరికీ ఆరోగ్య బీమా పథకం అమల్లో ప్రభుత్వాసుపత్రుల పాత్రను పెంచారు. ఈ దిశగా 155 రకాల వైద్యసేవలను ప్రభుత్వాసుపత్రులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. దీంతో ప్రభుత్వాసుపత్రులకు ప్రస్తుతం రిజర్వ్ చేసిన 169 రకాల సేవలతో నూతన విధానంలో మొత్తం 324 రకాల వైద్యసేవలను ప్రభుత్వాసుపత్రుల ద్వారా ప్రజలకు లభిస్తాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్లుల సదస్సులో ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం డా.యన్.టి.ఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా అందించబడుతూ అత్యంత అరుదుగా లబ్ధిదారులు వాడుకుంటున్న 197 రకాల వైద్యసేవలకు ట్రస్టు ద్వారా ఉచితంగా సేవలందించబడతాయి. ప్రస్తుతం డా.యన్.టి.ఆర్ వైద్యసేవ కింద లబ్ధిదారులకు ఉచితంగా అందించబడుతున్న వైద్యసేవలు, కొత్త మిశ్రమ(హైబ్రిడ్) విధానం కింద వాటిని క్రమబద్ధీకరించిన వైనాన్ని వైద్యారోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ సమీక్షించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రజలకు అందించబడే వైద్యసేవలను పెంచిచూపటానికి, చికిత్సలో సారూప్యతతో పాటు ఒకేరకం ప్యాకేజీ విలువ కలిగిన పలురకాల వైద్యసేవలను విడివిడిగా చూపటంతో మొత్తం సేవల సంఖ్య 3,257 కు పెరిగినట్లు అధికారులు వివరించారు. అటువంటి సారూప్యత కలిగిన సేవలను వివిధ విస్తృత కేటగిరీలుగా వర్గీకరించటంతో సేవల సంఖ్య 186 మేరకు తగ్గినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రులకు కేటాయించిన 324 సేవలు, అరుదుగా వాడుకోబడుతున్న 197 సేవలు మినహాయించగా మిగిలిన 2,736 సేవలను 2,550 సేవలుగా క్రమబద్ధీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ 2,550 సేవలకు నూతన పథకం అమలుకు ఎంపిక కానున్న ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఈ రీతిన ప్రస్తుతం ప్రజలకు అందించబడుతున్న 3,257 వైద్య సేవలను నూతన బీమా పథకంలో లబ్ధిదారులకు అందిస్తామని మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.ఆరోగ్య శ్రీ పథకంలో అందించబడిన వైద్యసేవల సంఖ్యను ఎక్కువగా చేసి చూపటానికి గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని వైద్యులు మంత్రికి వివరించారు. డెంగీ,టైఫాయిడ్ మరియు పారాటైఫాయిడ్ జ్వరాల చికిత్స విధానం మరియు ప్యాకేజీ విలువలు ఒకటే అయినా గత ప్రభుత్వం వాటిని విడివిడిగా చూపించింది. దీనికి బదులుగా వాటిని జ్వరాలు అన్న కేటగిరీలో చేర్చడం జరిగింది.

>>2

### విజయవాడలో
# పెరుగుతున్న డయేరియా
### 350 దాటిన బాధితులు

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాత వార్తప్రతినిధి:** విజయవాడ లోని కొత్త రాజరాజేశ్వరీపేటలో డయేరియా కేసులు పెరుగుతుండటం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. గత కొన్ని రోజులు నుంచి ఈ వ్యాధి కేసులు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం భాధితుల సంఖ్య 350 దాటింది. అయితే,గత రాత్రి మరో 15 మంది డయేరియా లక్షణాలతో ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తుంది. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో,వారిని వెంటనే ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో డయేరియాతో భాధపడుతున్న రోగులు ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. న్యూ రాజరాజేశ్వరీపేటలో కొత్తగా డయేరియా కేసులు నమోదయ్యాయి. డయేరియా భాధితులు నివాసం ఉండే ప్రాంతం

>>2

# మెగా డిఎస్సీ తుది జాబితా
### భర్తీగాని 406 ఖాళీలు
### సెకండ్ లిస్ట్ ఉండదన్న అధికారులు

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితాను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఎంపికైన వారి వివరాలను మెగా డిఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంపిక జాబితాను జిల్లా కలెక్టర్,జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంచనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్సీ ప్రకటనను ఏప్రిల్ 20న విడుదల చేసింది. 3,36,300 మంది అభ్యర్థులు 5,77,675 ధరఖాస్తులను సమర్పించారు. జూన్ 6 నుంచి జులై 2 వరకు రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. జులై 5న ప్రాథమిక కీ, ఆగస్టు 1న తుది కీ విడుదల చేశారు. టెట్‌కు 20% వెయిటేజీ ఇచ్చారు. ఏడు విడతలుగా అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలనను అధికారులు పూర్తి చేశారు.ఎంతో పారదర్శకంగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను కేవలం 150రోజుల్లో పూర్తిచేసి, సెలెక్టెడ్ అభ్యర్థుల తుది జాబితాను నేను జారీ చేయడం జరిగిందని రాష్ట్ర పాఠశాల విద్య శాఖ కార్యదర్శి కోన శశిధర్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర

>>2



సోమవారం తిరుమలకు విచ్చేసిన గవర్నర్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్

# శ్రీవారి సేవకు గవర్నర్ జస్టిస్ నజీర్

**తిరుమల,సెప్టెంబరు 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిపర్యటన ముగించుకుని సోమవారం సాయంత్రం రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ తిరుమలకు చేరుకున్నారు. రచన విశ్రాంతి భవనం వద్ద టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

# మహిళా సాధికారతతోనే దేశ పురోభివృద్ధి

>> మహిళా సాధికారతపై శాసనసభ కమిటీ స్థాపన 1987లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభమైందని భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి తెలిపారు. 1997లో మహిళా సాధికారతపై పార్లమెంటరీ కమిటీ సృష్టిపైన, కీలకమైన లక్ష్యంతో ఉనికిలోకి వచ్చిందన్నారు. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ద్వారా భారతదేశం యొక్క డిజిటల్ పరివర్తన కోసం కృషి చేస్తామని, ఆర్థిక వ్యవస్థ, పాలన, ఉపాధిని పునఃనిర్మించటానికి ఈ చొరవలను భాగస్వామ్యం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నామని పురందేశ్వరి తెలిపారు. అన్ని వయస్సుల మహిళలకు డిజిటల్ విద్యను ప్రోత్సహించడం ద్వారా డిజిటల్ అంతరాన్ని తగ్గించి, డిజిటల్ ప్రదేశంలో సమానత్వం వైపు ముందుకు వెళ్లేలా చేస్తామన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మహిళలలో గణితంను ప్రోత్సహించడానికి, సైబర్ నేరాలు , మోసాలు గురించి మహిళలలో అవగాహన కల్పిస్తామన్నారు. సమాజంలో ముఖ్య పాత్రధారులు మహిళలే అని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఉపనిషత్తులు, పురాణాలు, మైత్రేయి గార్గి వంటి ప్రాచీన తత్వజ్ఞానుల శిక్షణ ఆధారంగా మహిళా సాధికారతపై ఇచ్చిన ప్రసంగాలను ప్రశంసించారు. లోకసభ స్పీకర్ ఓం బిర్లా రిమార్కులపై అభినందనలతో భారతలో లింగ సమానతా ర్యాంక్, మెరుగుదల అవసరం ఉందన్నారు. 1997 ఏప్రిల్ 29న 11వ లోకసభలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత కమిటీ దేశంలో మహిళా సాధికారత ఇక ప్రధాన మైలురాయిగా నిలిచిందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

# లిక్కర్ స్కాంలో మరో అనుబంధ ఛార్జిషీటు

>> గూడూరు సమీపంలో 6 కోట్ల రూపాయలు నగదు రూపంలో చెల్లించి 260 ఎకరాల భూమి కొనుగోలు చేసి రెండు నెలల్లోనే దాన్ని 26 కోట్లకు విక్రయించి, ఆ సొమ్ముతో వైట్‌గా మార్చుకున్నట్లు సిట్ గుర్తించింది. తిరువానూరులో ఆలయ ప్రధాన అర్చకుడి భార్య పేరిట ఉన్న 2.93 ఎకరాల భూమిని నల్లధనంతో కొనుగోలు చేసేందుకు 8 బినామీ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు తేలింది. మద్యం ముడుపుల సొత్తుతో టాంజానియాలో ఇనుప ఖనిజ కర్మాగారం నిర్మాణానికి చెవిరెడ్డి యత్నించినట్లు తేలింది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడు ఈ ఏడాది జనవరిలో ఆ దేశానికి వెళ్లినట్లు సిట్ గుర్తించింది. తాడేపల్లి ప్యాలెస్ సమీపంలో ఏర్పాటు చేసుకున్న మద్యం ముడుపుల డెన్‌కు హ్యాండ్లర్‌గా వ్యవహరించిన ప్రజోష్ ప్రకాశ్‌తో చెవిరెడ్డి భేటీ అయినట్లు సిట్‌కు ఆధారాలు లభ్యమయ్యాయి. గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరుపతిలో చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ 8 కోట్ల 94 లక్షల మద్యం ముడుపుల సొమ్ముతో చెవిరెడ్డికి ఉన్న సంబంధాల గుట్టును సిట్ రట్టు చేసింది. ఈ వివరాలన్నీ సమగ్రంగా తాజా అభియోగపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం. ఈ కేసులో సిట్ జులై 19న ప్రధాన అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఆగస్టు 11న మొదటి అనుబంధ అభియోగపత్రం వేసింది. నేడు రెండో అనుబంధ అభియోగపత్రాన్ని వేసింది. ఇవాళ వేసిన దానితో కలిపి మొత్తం మూడు అభియోగపత్రాలు వేసినట్లైంది. మనీ ట్రయల్ వివరాలు ఇందులో పొందుపరిచినట్లు సమాచారం. ఈ కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. 31వ నిందితుడిగా ధనుంజయరెడ్డి, 32వ నిందితుడిగా కృష్ణమోహన్‌రెడ్డి, 33వ నిందితుడిగా బాలాజీ గోవిందప్ప, 30వ నిందితుడిగా ఉన్న పైలా దిలీప్ బెయిల్‌పై బయటకొచ్చారు. ప్రస్తుతం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడు సహా మొత్తం 8 మంది జైల్లో ఉన్నారు. వీరిలో నలుగురిపై సిట్ తాజాగా అభియోగపత్రం వేసింది. ఇప్పటికే ఈ కేసులో సిట్ రెండు చార్జీషీట్‌లను దాఖలు చేసింది.

# కొత్త ఆరోగ్య బీమాలో అదనంగా 185 వైద్యసేవలు

>> అదే రీతిన గుండెకు సంబంధించిన రైట్ హార్ట్ కేథటరైజేషన్, లెఫ్ట్ హార్ట్ కేథటరైజేషను (స్టెంట్ వేయడం) ఒకే కేటగిరీ కింద నూతన బీమా పథకంలో చేపడతారు. ఈ విధంగా సారూప్యత కలిగిన 319 రకాల వైద్యసేవలను 133 రకాలుగా వర్గీకరించారు. ఉన్నత వైద్యుల బృందం క్షుణ్ణంగా అధ్యయనం చేసి నూతన వర్గీకరణను సూచించింది. వివిధ ప్రభుత్వాసుపత్రులల్లో ఏర్పాటు చేయబడిన మౌలిక సదుపాయాలు, అందుబాటులో ఉన్న వైద్యసిబ్బందిని దృష్టిలో పెట్టుకుని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునే దిశగా 155 రకాల వైద్యసేవలను అదనంగా నూతన పథకం క్రింద ప్రభుత్వాసుపత్రులకు కేటాయించడం జరిగింది. ఎక్కువ సంఖ్యలో జరిగే గర్భాశయ తొలగింపు, ఎపెండిక్స్ తొలగింపు, ఇ.యన్.టి సేవలను ఈ కేటగిరీలో చేర్చారు. అత్యంత అరుదుగా అవలంబించే థైమస్ గ్లాండ్ తొలగింపు, చిన్నప్రేగు మొదటి భాగం (డియోడినమ్) తొలగింపు వంటి 197 రకాల వైద్యసేవలక డా.యన్.టి.ఆర్ ట్రస్టు ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన మిశ్రమ విధానంలో అందరికీ ఆరోగ్య బీమా పథకం కింద రాష్ట్రంలో 1.63 కోట్ల లబ్ధిదారుల కుటుంబాలకు సంవత్సరానికి రూ.2.5లక్షల మేరకు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా కల్పిస్తారు. ఇందులో మొదటిసారిగా పేదరిక రేఖ(Poverty line)కు పైనవున్న 20 లక్షల ఏ.పి.యల్ కుటుంబాలకు కూడా ఆరోగ్య బీమా లభిస్తుంది. ఉద్యోగస్తులకు, పాత్రికేయులకు ప్రత్యేక ఆరోగ్యసేవల పథకాలు అమల్లో ఉన్నాయి. ప్రస్తుతం డా.యన్.టి.ఆర్ వైద్యసేవ కింద ఉచితంగా వైద్యం పొందుతున్న 1.43కోట్ల కుటుంబాలకు రూ.2.5 లక్షలు దాటి రూ.25 లక్షల వరకు అయ్యే ఖర్చును డా.ఎన్‌టి.ఆర్.వైద్య ట్రస్టు ద్వారా ప్రభుత్వమే భరిస్తుంది.

# మన డ్వాక్రా సంఘాలు దేశంలోనే నం-1

## రుణాల ఎగవేత 0.02శాతమే, రాష్ట్రంలో 875 మిల్లెట్ కేఫ్‌ల ఏర్పాటు: సెర్ప్ కార్యదర్శి వి.కరుణ వెల్లడి

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలు, పొదుపు సంఘాలు బ్యాంకుల్లో రూ.20,739 కోట్లు పొదుపు చేశారని, ఇందులో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని సెర్ప్ కార్యదర్శి వి. కరుణ తెలిపారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె సెర్ప్ కార్యకలాపాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. డ్వాక్రా సంఘాలు రుణాలు పొందేలా జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని కోరారు. డ్వాక్రా సంఘాల్లో రుణాల ఎగవేత శాతం కేవలం 0.02 శాతం మాత్రమే ఉందని, కాబట్టి ఈ సంఘాలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు సైతం వెనుకాడటం లేదని, బ్యాంకర్లు ఎంతో సంతోషంగా రుణాలు ముందుకు వస్తున్నారన్నారు. ఇటీవలే డ్వాక్రా సంఘాల కోసమే ప్రత్యేకంగా స్టేట్ లెవల్ బ్యాంకర్ల సమావేశం నిర్వహించామన్నారు. ప్రస్తుతం రూ.40,424 కోట్లతో స్త్రీనిధి, ఉన్నతి బ్యాంకు లింకేజీ కల్పించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, మొత్తం 8.32 లక్షల డ్వాక్రా సంఘాలున్నాయని వెల్లడించారు. పొదుపు సంఘాలు తీసుకుంటున్న రుణాల్లో 74 శాతం సంపద సృష్టి, 13 శాతం ఉత్పాదక రుణాలు, 13 శాతం వినియోగం కొరకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాల పనితీరుపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ విషయంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ పనితీరు ఆదర్శప్రాయంగా ఉందన్నారు. ఏడాది యువతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మూడు నాలుగు సంఘాల్లో కనీసం ఒక యువతి అయినా సభ్యురాలుగా ఉండేలా చూస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని పొదుపు సంఘాల్లోని మహిళలు ఎక్కువగా పాడి పరిశ్రమ పట్ల ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తున్నారని చెప్పారు. 6,84,876 పాడి జీవాల కొరకు రుణాలు కావాలని కోరుతున్నారని, ఈ రుణాల విలువ రూ.8,989 కోట్లు ఉందన్నారు. వీటిలో ఇప్పటికే 3,39,820 మందికి రూ.4,415 కోట్లు రుణాలు అందించామన్నారు. మిగిలిన రుణాలు కూడా త్వరితగితన పొందేలా జిల్లా కలెక్టర్లు చొరవ చూపాలన్నారు.

**డ్వాక్రా సంఘాలతో మిల్లెట్ కేఫ్‌లు:**

పొదుపు సంఘాల్లోని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించడానికి చొరవ చూపుతున్నారని చెప్పారు. ఇప్పటికే 3 వేల మంది పొదుపు సంఘాల మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారడానికి ఆసక్తి ప్రదర్శిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఈ సంఘాలతో మిల్లెట్ కేఫ్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తం 875 మిల్లెట్ కేఫ్‌లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు 12 జిల్లాల్లో 200 యూనిట్లు ఏర్పాటు చేశామని, ఇవి విజయవంతంగా నడుస్తున్నాయని వెల్లడించారు. అలాగే బాంబూ మిషన్ ప్రాజెక్టు కింద మహిళలు వెదురు సాగుకు ప్రోత్సహిస్తున్నామన్నారు.




సోమవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న మంత్రులు

# యూరియాతో కేన్సర్

>> ణంగా పని చేయాలి. మంచి పేరు తెచ్చుకునేలా కలెక్టర్లు పని చేయాలి. పని తీరు చక్కగా ఉన్నవాళ్లను నేను ఎప్పుడూ మార్చలేదు. ప్రభుత్వం అందించే సేవలన్నిటిలోనూ సంతృప్త స్థాయే కొలమానం అవుతుంది. సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తారో... శాంతి భద్రతల విషయంలో కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక్కడ పని చేసిన అధికారులు ఆర్బీఐ లాంటి సంస్థలకు వెళ్లారు. నేను అధికారులకు పూర్తిగా సపోర్ట్ అందిస్తాను. కానీ విఫలమైతే మాత్రం కఠినంగానే నిర్ణయాలు తీసుకుంటా. కలెక్టర్ల సదస్సు కొత్త ట్రెండ్‌ను సృష్టించాలని కోరుతున్నాను." అని సీఎం చెప్పారు సీఎస్, డీజీపీల నుంచి క్షేత్రస్థాయి వరకూ సరైన వ్యక్తి సరైన చోట ఉండాలనే లక్ష్యంతో నియమాకాలు చేశామని సీఎం తెలిపారు. సంస్కరణలు వద్దన్న చాలా రాజకీయ పార్టీలు మనుగడలో లేకుండా పోయాయని గుర్తు చేశారు.

**వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు అందిస్తున్నాం:** ఏఐ, డేటా లేక్ వంటి వాటి ద్వారా సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి పథకాలు, కార్యక్రమాల అమలు కోసం ఆర్టీజీఎస్ సేవల్ని ఉపయోగించుకో వాలని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. విజన్ రూపొందించి దానికి నిధులు కేటాయించకపోతే ఇబ్బందులు వస్తాయి సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి సంక్షేమం అమలు చేస్తామని చెప్పాం. అదే విధంగా సూపర్ సిక్స్‌ను సక్సెస్ చేశాం

దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకం పెన్షన్లు. 64 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తున్నాం తల్లికి వందనం ద్వారా చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థికసాయం చేస్తున్నాం ఏడుగురు పిల్లలు ఉన్న తల్లికి కూడా ఈ పథకాన్ని వర్తింప చేశాం. ఆ కుటుంబాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే పరిస్థితులు వచ్చాయి. ఆటో డ్రైవర్లకు కూడా రూ.15 వేలను అక్టోబరు 1 తేదీన ఇస్తామని ముఖ్యమంత్రి వివరించారు. వాణిజ్య పంటల విషయంలోనూ సరైన సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభం వచ్చేలా చేయాలి. కలెక్టర్లు బ్యూరోక్రాటిక్‌గా కాకుండా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుని పాలసీలు అమలు చేయాలి. ఐదేళ్లలో 25 కలెక్టర్ల కాన్ఫరెన్సులు, 125 కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహిస్తాం. ప్రభుత్వం అందించే సేవలన్నిటిలోనూ సంతృప్త స్థాయే కొలమానం అవుతుంది. యూరియా ఎక్కువ వాడకం వల్ల క్యాన్సర్ వస్తుందనే విషయమై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఏపీలో క్యాన్సర్ టాప్ ఫైవ్ రోగాల జాబితాలో ఉందని వెల్లడించారు. ఉల్లి పంట కొనుగోలు విషయంలో ప్రతిపక్షం డ్రామాలు ఆడుతోంది. ప్రస్తుతం క్వింటాను రూ.1200తో కొనుగోలు చేస్తున్నాం. ఎలా చేస్తే రైతులకు లాభం వస్తుందో అధ్యయనం చేసి ఆయా మార్గాలు అనుసరించాలి. గోశాలల నిర్మాణం వల్ల పశు సంపద రాష్ట్రానికి రిటన్ గిఫ్ట్ ఇస్తోంది. జీఎస్డీపీ వృద్ధిలో లైవ్ స్టాక్ పాత్ర కీలకంగా ఉంది. పాడి పరిశ్రమ అనేది చక్కటి ఆదాయ మార్గంగా ఉంటుంది. దాణా ఉత్పత్తిని డ్వాక్రా గ్రూపులకు అనుసంధానం చేస్తే వారికి మంచి ఆదాయం వచ్చేలా చేయగలం. అర్బన్ ఏరియాలో రెండు సెంట్లు, రూరల్ ప్రాంతంలో మూడు సెంట్లు ఇవ్వాలని సిఎం అన్నారు. అర్బన్ ప్రాంతాల్లో భూ లభ్యత లేకుంటే గ్రూప్ హౌసింగ్ విధానాన్ని అవలంభించాలి. సెంట్ పట్టా తీసుకోవడానికి ఆసక్తి చూపకపోతే... ఆ భూమిని పరిశ్రమలకు కేటాయించండి. సెంట్ పట్టా తీసుకోవడానికి ఆసక్తి చూపని లబ్దిదారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త ఉచిత ఇళ్ల పట్టాల పథకంలో చోటు కల్పించండి. ఏపీలో 5 లక్షల ఎకరాల్లో ఆక్వా కల్చర్ ఉంది. రూ. 1.50కే యూనిట్ విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం. రాయితీ విద్యుత్ అందించేందుకు జోన్‌నాన్ జోన్ కింద విభజించారు. నెల రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి రూ. 1.50కు యూనిట్ విద్యుత్ అందివ్వాలి. ఆక్వా ఉత్పత్తులకు ట్రేసబులిటీ, సర్టిఫికేషన్ కంపల్సరీ. ఆక్వా కల్చరును ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

**నా వద్ద పనిచేసిన వారికి జాతీయ స్థాయిలో గుర్తింపు:** పరిపాలనలో మొదటి ఏడాది పరీక్షలు పూర్తి అయిపోయాయని ఇక బాధ్యతగా పనిచేయాల్సిన సమయం వచ్చిందని సీఎం స్పష్టం చేశారు. ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయకపోతే ఫలితాలు రావని తేల్చిచెప్పారు. తాను కఠినంగా ఉన్నా, తన వద్ద పనిచేసిన అధికారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని వెల్లడించారు. 3 సార్లు కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శులుగా తన వద్ద పని చేసిన అధికారులే నియమితులయ్యారని గుర్తు చేశారు. తన వద్ద ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేసిన దువ్వూరి సుబ్బారావు ఆర్బీఐ గవర్నర్ అయ్యారన్నారు. సాంకేతికత పెరిగిన దృష్ట్యా స్మార్ట్ వర్క్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఏఐ, డేటా లేక్ వంటి వాటి ద్వారా సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. పథకాలు, కార్యక్రమాల అమలు కోసం ఆర్టీజీఎస్ సేవల్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. పీపీపీ విధానంలో పోర్టులు, ఇన్ఫ్రా పెరిగిందన్నారు. ఆర్థిక అసమానతలు పెరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని వెల్లడించారు. సమాజంలోని అన్ని ప్రాంతాల్లోనూ అవకాశాలు రావాలని, ప్రతిఫలాలు అందాలని అన్నారు.

**పీపుల్స్ ఫ్రెండ్లీగా రెవెన్యూ వ్యవస్థ :** రెవెన్యూ వ్యవస్థను పీపుల్స్ ఫ్రెండ్లీగా మార్చేందుకు కృషి చేస్తున్నామని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పరిశ్రమలకు ప్రభుత్వం కేటాయించే భూముల్లో పరిశ్రమలు త్వరితగతిన ఏర్పాటు అయ్యేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదే అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ 5 ఏళ్ల అరాచక పాలనతో రాష్ట్రం 40 ఏళ్లు వెనక్కి వెళ్లిందని మండిపడ్డారు. సూపర్ 6 హామీలతో వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ 12 హామీలు అమలు చేసిందని వెల్లడించారు.

**కలెక్టర్ల సదస్సుకు హాజరుకాని పవన్,నారా లోకేష్:** మహాలయ పక్షాలను అనుసరించి పితృ కర్మ పూజలు ఉండటం వల్ల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలెక్టర్ల సదస్సుకు హాజరు కాలేదు. పితృ కర్మ పూజ ప్రక్రియ ఈ రోజునే ప్రారంభమైనందున కలెక్టర్ల సదస్సుకి రాలేకపోతున్నట్లు పవన్ కల్యాణ్ సందేశం పంపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండవ రోజున పాల్గొంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. లండన్ పర్యటనలో ఉన్నందున మంత్రి నారా లోకేశ్ కలెక్టర్ల సదస్సుకు హాజరు కాలేదు.

# వక్ఫ్‌సవరణలపై పూర్తి స్టే ఇవ్వలేం

>> విచారణ జరిపామని, ఆ మొత్తం చట్టంపై స్టే విధించేంతగా పరిస్థితేం కనిపించలేదన్నారు. ఎందుకంటే పిటిషనర్ల ప్రధాన ఆందోళన, అభ్యంతరం అనేది 3(ఆర్), 3సీ, 14, వంటి పలు సెక్షన్లపైనే ఉందని పేర్కొన్నారు. ముస్లిమేతర వ్యక్తులకూ వక్ఫ్ బోర్డ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా అవకాశం ఇవ్వొచ్చంటూ చట్టంలో చేసిన సవరణపై స్టే ఇవ్వలేమని సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది. వీలైనంత మేరకు ముస్లిం వర్గానికే ఆ పదవిని కేటాయించేందుకు ప్రయత్నించాలని నిర్దేశించింది. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ మండళ్లలో ముస్లిమేతరుల సంఖ్యను 4 నుంచి 3కు తగ్గిస్తున్నట్లు పేర్కొంది. కనీసం ఐదేళ్లుగా ఇస్లామ్ మతాన్ని అనుసరిస్తున్న వారు మాత్రమే వక్ఫ్‌ను క్రియేట్ చేయగలరనే నిబంధనపై సుప్రీంకోర్టు స్టే విధించింది. వక్ఫ్‌ను ఎవరు రూపొందిచవచ్చు తప్పకుండా ఇస్లామ్‌ను అనుసరిస్తున్న వారే దీన్ని రూపొందించాలా అనే దానిపై కొత్త రూల్స్ సిద్ధమయ్యే వరకు, ప్రస్తుత నిబంధనపై స్టే అమల్లో ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వక్ఫ్ ఆస్తిలో కలుపుకుంటే, వివాదం పరిష్కారానికి ప్రభుత్వం ఒక అధికారిని నియమిస్తుందనే నిబంధన వక్ఫ్ చట్టంలో ఉంది. దీనిపై స్టే విధించింది. ఏదైనా ఆస్తి వక్ఫ్‌దా ప్రభుత్వానిదా అనే అంశాన్ని తేల్చి, ఆదేశాలిచ్చే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు కల్పిస్తూ చేసిన సవరణపై సుప్రీంకోర్టు స్టే విధించింది. న్యాయమూర్తుల్లా జిల్లాల కలెక్టర్లు దేశ పౌరుల హక్కులపై నిర్ణయాలు తీసుకోలేరని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వారు అలా చేయాల్సి వస్తే, అధికారాల విభజన సూత్రానికి విఘాతం కలుగుతుందన్నారు. వక్ఫ్ ఆస్తుల హక్కుదారులు ఎవరు అనేది కోర్టు తీర్పులతోనే నిర్ణయం అవుతుందని సీజేఐ చెప్పారు. కోర్టు కేసుల్లో తీర్పులు వచ్చేదాకా, ఆయా వివాదాస్పద ఆస్తులపై ఎవరికీ హక్కులను బదిలీ చేయకూడదని అడ్వకేట్ అన్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోని పలు నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఐదేళ్లుగా ఇస్లామ్‌ను అనుసరిస్తున్న వారికే వక్ఫ్‌ను రూపొందించే హక్కు ఉంటుందనే నిబంధనపై స్టే విధించారు. ఎవరైనా వ్యక్తి ఐదేళ్లుగా ఇస్లామ్‌ను అనుసరిస్తున్నాడా? లేదా? అనేది నిర్ధరించడానికి నిర్దిష్టమైన వ్యవస్థ ఏదీ లేకపోవడం వల్లే సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ బోర్డుల్లో నియమించే ముస్లిమేతరుల సంఖ్యను 4 నుంచి 3కు తగ్గించారు. వక్ఫ్ ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నిబంధనపై స్టే విధించలేదు. కానీ అందుకు నిర్దేశించిన గడువును పొడిగించింది" అని వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన అడ్వకేట్ అనస్ తన్వీర్ తెలిపారు. చాలావరకు మా వాదనలను సుప్రీంకోర్టు బెంచ్ పరిగణనలోకి తీసుకుంది. వాటితో సమ్మతించింది. చాలాకాలంగా ముస్లిం మతపరమైన అవసరాల కోసం వినియోగిస్తున్న భూమి లేదా ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించాలనే మా వాదనను సుప్రీంకోర్టు అంగీకరించింది. ముస్లింల రక్షిత కట్టడాల విషయంలోనూ మా వాదనకు దేశ సర్వోన్నత న్యాయస్థానం అంగీకారం తెలిపింది. అలాంటి కట్టడాలను థర్డ్ పార్టీ ఏదీ క్లెయిమ్ చేసుకోకూడదని కోర్టు చెప్పింది. కోర్టు ఆదేశాలు, విచారణపై మేం సంతృప్తితో ఉన్నామని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ సభ్యుడు సయ్యద్ ఖాసిం రసూల్ ఇలియాస్ చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేసిన కుట్ర వ్యవహారం బహిర్గతమైంది. వక్ఫ్‌కు భూములను దానం చేసిన వాళ్లు భయపడ్డారు. తాము ఇచ్చిన భూములను ప్రభుత్వం కబ్జా చేస్తుందేమోనని కలవరపడ్డారు. కానీ వారికి ఊరటనిచ్చేలా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. పలు వివాదాస్పద నిబంధనలపై స్టే విధించింది. ఐదేళ్లుగా ఇస్లామ్‌ను పాటిస్తున్న వాళ్లను కేంద్ర ప్రభుత్వం ఎలా గుర్తిస్తుంది? ఇది విశ్వాసానికి సంబంధించిన విషయం. ప్రభుత్వం ఇలాంటి అన్ని అంశాలను నిశితంగా పరిశీలించాకే చట్టాలు చేయాలి. మేం మా పోరాటాన్ని కొనసాగిస్తాం" అని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌ఘరీ తెలిపారు. నేను తమిళనాడులోని తిరుచెందురై గ్రామానికి చెందిన పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్నాను. ఆ గ్రామం మొత్తాన్ని వక్ఫ్ పరిధిలోకి తీసుకున్నారు. ఇటువంటి వివాదాస్పద అంశాలతో ముడిపడిన వక్ఫ్ చట్టపు సెక్షన్లపై స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నాను. ఆయా సెక్షన్లపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పునస్సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. సుప్రీంకోర్టు జారీ చేసిన మధ్యంతర ఆదేశాలు పారదర్శకంగా, సమతూకంతో ఉన్నాయి. చాలాకాలంగా ముస్లిం మతపరమైన అవసరాల కోసం వినియోగిస్తున్న భూమి లేదా ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించాలనే వక్ఫ్ బై యూజర్ నిబంధన దేశానికి అనుకూలమైంది కాదని సుప్రీంకోర్టు బెంచ్ అభిప్రాయపడిందని అడ్వకేట్ ప్రియదర్శిని రాహుల్ తెలిపారు. మొత్తం వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు స్టే విధించలేదు. కానీ పిటిషనర్ల అభ్యంతరాలు, ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని, వారికి అనుకూలంగా మధ్యంతర ఆదేశాలను జారీ చేసింది. కొన్ని సెక్షన్ల అమలుపై స్టే విధించింది. వక్ఫ్ ఆస్తుల యాజమాన్య నిర్ధారణ, కేటాయింపునకు చట్టపరమైన మార్గాలనే అనుసరించాలని పిటిషనర్లు వాదిస్తున్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోనూ ఇదే విధమైన నిబంధనలు ఉన్నాయి. ఈ అంశాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఏదైనా వక్ఫ్ ఆస్తిని ప్రభుత్వం తీసుకుంటే, ట్రిబ్యునల్, హైకోర్టు ఆదేశాలను పాటించాల్సి ఉంటుందని కూడా సవరణ చట్టంలో ఉంది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చిన తర్వాతే, ప్రభుత్వ నిర్ణయం అమల్లోకి వస్తుందని రూల్స్ చెబుతున్నాయని సీనియర్ అడ్వకేట్ బరుణ్ సింగ్ చెప్పారు. వక్ఫ్ బోర్డులలో ముగ్గురికి మించి ముస్లిమేతరులను నియమించకూడదని సుప్రీంకోర్టు చెప్పింది. వక్ఫ్ ఆస్తిని గుర్తించే, నిర్ధారించే ప్రక్రియపై వక్ఫ్ సవరణ చట్టంలో పొందుపర్చిన నిబంధనపై న్యాయస్థానం స్టే విధించింది. దీనివల్ల వక్ఫ్ ఆస్తులకు రక్షణ లభిస్తుంది. మొత్తం మీద ఈ ఆదేశాలు బాగున్నాయి. మేం దీన్ని స్వాగతిస్తున్నామని అడ్వకేట్ ఎంఆర్ శంషాద్ చెప్పారు.

# మెగా డీఎస్సీ తుది జాబితా

>> సచివాలయం ప్రచార విభాగంలో పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామ రాజుతో కలసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు చాలా శుభదినం అని, ఉపాధ్యాయులుగా ఎంపికైన అయిన వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఫైనల్ సెలెక్షన్ లిస్ట్ అందరికీ అందుబాటులో ఉందని చెప్పారు. అభ్యర్థుల నుండి అద్భుతమైన స్పందన వచ్చిందని, ఏప్రిల్ 20 మరియు మే 15, 2025 మధ్య కాలంలో 3,36,300 అభ్యర్థుల నుండి 5,77,675 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ముఖ్యంగా 87 అభ్యర్థులు వారి మొదటి ప్రాధాన్యత పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం జరిగిందన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జూన్ 6 నుండి జులై 2, 2025 వరకు రెండు షిఫ్టుల్లో పటిష్టమైన భద్రతా చర్యలతో నిర్వహించామని తెలిపారు. ప్రాథమిక సమాధానాల కీ జులై 5న విడుదల చేసి, జులై 12 వరకు అభ్యంతరాలు స్వీకరించి, నిపుణుల సమీక్ష తర్వాత ఆగస్టు 1న ఫైనల్ కీ ప్రచురించామని వివరించారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు మరియు కొన్ని కేటగిరీలకు షిఫ్టుల కారణంగా (69 కేటగిరీలలో 9 కేటగిరీలకు), జాతీయంగా గుర్తించబడిన నార్మలైజేషన్ పద్ధతిని ఈ 9 కేటగిరీ పోస్టులకు అవలంబించామని చెప్పారు. అన్నిసెషన్లలో న్యాయబద్ధతను నిర్ధారించడానికి మెరిట్ జాబితాలను టెట్ స్కోర్‌ల నుండి 20 వెయిటేజ్.డీఎస్సీ స్కోర్‌ల నుండి 80 వెయిటేజ్‌తో తయారు చేశామని వివరించారు. మెగా డీఎస్సీ 2025 అనేక చారిత్రాత్మక మైలురాళ్లను సృష్టించిందని, ఇది సబ్ క్లాసిఫికేషన్‌ను అమలు చేసిన మొదటి నియామకం, కొత్త 3 కోటా కింద 372 పోస్టులను స్పోర్ట్స్ పర్సన్స్‌తో భర్తీ చేసిన మొదటిది, మరియు మహిళలు, శిజుడ్బీ, మాజీ సైనికులు మరియు మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్స్‌తో సహా అన్ని కేటగిరీలలో వర్టికల్ మరియు హారిజాంటల్ రిజర్వేషన్లను అమలు చేసిన మొదటిదని వివరించారు. మైక్రో వెరిఫికేషన్ ప్రక్రియ తర్వాత 15,941 అభ్యర్థులతో ఫైనల్ సెలెక్షన్ లిస్టులను తయారు చేశామని చెప్పారు. మిగిలిన 406 ఖాళీలు సంబంధితకమ్యూనిటీలో అర్హతపొందిన అభ్యర్థుల అందుబాటులేక పోవడంతో భర్తీ కాలేదని, ఈ ఖాళీలను తదుపరి డీఎస్సీ నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తామని వివరించారు. సెలెక్ట్ అయిన 15,941 మందిలో 7,955 మహిళలు మరియు 7,986పురుషులు ఉన్నారని, అంటే 49.9 మహిళలు, 50.1 పురుషులు అని వివరించారు. మహిళలకు దాదాపు 50 సాధించడం హర్షనీయ విషయమని చెప్పారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ లిస్ట్‌కు వెయిటింగ్ లిస్ట్ కానీ సెకండ్ లిస్ట్ కానీ ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, ఈ క్రిందిఫోన్‌నంబర్లు(8125046997, 9398810958, 7995649286, 7995789286) ద్వారా సహాయం అందుబాటులో ఉందని వివరించారు.

## వారం - వర్జ్యం

16-09-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
దశమి రా.12.25
ఆరుద్ర ఉ.6.46
వర్జ్యం : సా.6.36-8.11
దు.ఉ.8.24-9.13, 2)రా.11.04-11.53
శుభసమయం:ఉ.6.30-7.20, సా.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** పోరాడి దూరప్రాంత అవకాశములను సాధిస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృషభం:** ఉద్యోగములో స్థాయి పరపతి పెంచుకొనే యత్నములకు గాను విశేషంగా కృషి చేస్తారు.

**మిథునం:** మీ మీద నిందారోపణలు చేసే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు ఏపాటించండి.

**కర్కాటకం :** కుటుంబ ఐకమత్యకు విఘాతమేర్పడకుండా సంయమనం పాటించండి.

**సింహం:** మీ మాటకు మంచితనమునకు గాను సమాజములో మీకు గౌరవ ప్రతిష్ఠలు పెంపొందాయి.

**కన్య :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**తుల :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతాయి. వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగలకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి.

**ధనుస్సు:** రాజకీయ, సినీ, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. వాహనసౌఖ్యం.

**మకరం:** నూతన పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. శత్రువులు సైతం పాత్రులుగా మారి సహాయం అందిస్తారు.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం :** కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఉద్యోగాలలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రోడ్డెక్కిన రైతులు

>> తో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగించే దిశగా ప్రయత్నాలు చేశారు. అయినా ప్రయత్నాలు ఫలించకపోవడంతో యూరియా పంపిణీ నిలిపివేశారు. ఈ విషయమై వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్‌ను ప్రశ్నించగా, పిఎసిఎస్‌కు సోమవారం 260 బస్తాలు యూరియా రాగా, రైతులందరికీ పిఎసిఎస్ అధికారులు తమ సమక్షంలో స్లిప్పులు అందజేశారని, 50 బస్తాలు పంపిణీ జరిగిన తర్వాత పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో పంపిణీ నిలిపి వేశామన్నారు.

# పలువురు ఐఎఎస్‌ల బదలీ

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగు రోజులుగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీపై దృష్టిపెట్టిన చంద్రబాబు సర్కార్ సోమవారం మరి కొంతమంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ముగ్గురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.ధాత్రిరెడ్డిని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓగా బదిలీ చేశారు. కృష్ణా జిల్లాజాయింట్ కలెక్టర్‌గా ఉన్న గీతాంజలి శర్మను ఏపీ ఫైబర్ నెట్ ఎండీగా నియమించారు. ఇక పాడేరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శౌర్య మాన్ పటేల్‌ను మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ఎండీగా బదిలీ చేసింది.

# పెరుగుతున్న డయేరియా

>> లో తీసుకున్న నీటి శాంపిల్స్‌కు సంబంధించిన రిపోర్ట్స్ ఇంకా రాలేదు. ఇప్పటికే రెండు కిలోమీటర్ల పరిధిలో షాపులను ఫుడ్ కంట్రోల్ అధికారులు మూయించారు. ఇంటింటికి మంచి నీటి క్యాన్లను, శానిటైజేషన్ కిట్లను అధికారులు అందచేస్తున్నారు.

# హజారిబాగ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## మావోయిస్టు అగ్రనేత సహా ముగ్గురు హతం

**హజారిబాగ్, సెప్టెంబరు 15:** జార్ఖండ్‌లో మావోయిస్టులకు గాలింపు చర్యలు ముమ్మరం కావడంతో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇందులోభాగంగానే రాష్ట్రంలోని హజారీబాగ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. హజారీబాగ్ జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనా యకుడు సహా మరో ఇద్దరు మృతిచెందారు. సోమవారం తెల్లవారుజామున హజారీబాగ్ జిల్లాలోని గిర్ది బొకారో సరిహద్దుల్లో మావోయి స్టులు ఉన్నారనే సమాచారంతో కోబ్రా బెటాలియన్, స్థానిక పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల సమయంలో కరండి గ్రామ సమీపంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలోపోలీసు బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. ప్రతిగా భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటెడ్ లీడర్ సహదేవ్ సోరెన్, జోనల్ కమిటీసభ్యుడు బిర్సేన్ గంఝూ అలియాస్‌రామ్‌ఖేలావన్, బీహార్‌ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీసభ్యుడు రఘునాథ్ హెమ్బ్రామ్ అలియాస్‌చంచల్‌మరణించారని పోలీసులు తెలిపారు.

# సంక్షేమం అంటే దానం కాదు సాధికారతకు మార్గం

## - అక్టోబరు 1న 3 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం: సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ, సెప్టెంబర్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షేమం అంటే పేదలకు చేసే దానం కాదు... వారి అభివృద్ధికి, సాధికారతకు మార్గం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అన్ని మార్గాలను వినియోగించుకుందామని చెప్పారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగిన తొలి రోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్‌లు, సూపర్ సిక్స్ పథకాల అమలు, డ్వాక్రా, మెప్మా గ్రూపుల పనితీరు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సంక్షేమం - అభివృద్ధి రంగాలకు సమతూకంగా నిధులు ఖర్చు చేస్తున్నాం. మూలధన వ్యయం కూడా చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం, తల్లికి వందనం అందరికీ అందించాం. లబ్దిదారులకు సాయం అందే విషయంలో తలెత్తే చిన్నచిన్న లోటుపాట్లను కలెక్టర్లు సరిదిద్దాలి. మెగా డీఎస్సీ ద్వారా యువతకు 16,347 ఉద్యోగాలు వచ్చాయి. ఇప్పటికే 6 వేలకు పైగా పోలీసు విభాగంలో ఉద్యోగాలిచ్చాం. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తాం. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజన యువతకే ఉద్యోగాలు ఇచ్చేలా ఉన్న జీవో3ను సుప్రీం కోర్టు రద్దు చేసింది. దీనిపై ఏం చేయాలనే అంశంపై ఆలోచన చేస్తున్నాం. అలాగే ప్రైవేటు రంగంలోనూ జాబ్స్ వచ్చేలా పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. జిల్లాల్లో యువతకు ఉద్యోగాలు వచ్చేలా జాబ్ మేళాలు ఏర్పాటు చేయాలి." అని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం స్త్రీ శక్తి విజయవంతమైంది. ఈవీ బస్సులతో ఖర్చు తగ్గుతుంది. కమర్షియల్ కాంప్లెక్సుల నిర్మాణం, కార్గో ద్వారా ఆర్టీసీ ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం ద్వారా ఏటా రూ.33 వేల కోట్ల వ్యయం చేస్తున్నాం. అక్టోబరు 1వ తేదీన 3 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తాం." అని చంద్రబాబు పేర్కొన్నారు. వడ్డెర్లకు క్వారీల్లో రిజర్వేషన్లు పెట్టడంతో పాటు సీనరేజీలో మినహాయింపు ఇస్తాం. ఇమామ్, మోజన్లకు కూడా గౌరవవేతనం ఇస్తున్నాం. విజయవాడలో హాజ్‌హౌస్ త్వరలోనే పూర్తి అవుతుంది. హాజ్ యాత్రికులకు రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తున్నాం. మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం. కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నాం. అన్ని దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లోనూ బ్రాహ్మణులకు చోటు కల్పించాం. నిర్మాణ రంగంలో వర్కర్ల సంక్షేమం కోసం కూడా బోర్డు ఏర్పాటు చేస్తున్నాం. శాశ్వత కుల ధృవీకరణ పత్రం కూడా త్వరలోనే జారీ చేస్తున్నాం. అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం ఎయిర్ పోర్టుకు పెడతాం. కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించాం. తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలపై విచారణకు ఆదేశించాం. మత్స్యకారుల సేవలో భాగంగా వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఇస్తున్నాం. ఎవరికీ అన్యాయం జరక్కుండా ఎస్సీ వర్గీకరణను కూడా విజయవంతంగా పూర్తి చేశాం. డ్రైవర్ల సాధికారిక సంస్థ ఏర్పాటు చేసే అంశం పరిశీలిస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల చొప్పున వేతనం ఇస్తున్నాం. అర్చకులకు గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాం. వేద విద్యార్థులకు రూ.3 వేలు ఇస్తున్నాం. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయించే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేసేలా కార్యాచరణ చేస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని ఆదుకునేందుకు కార్యా చరణ చేపట్టాం. రజకులకు దోబీ ఘాట్లు, షెడ్లు, ఇస్త్రీ చేయడానికి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలి. 200 యూనిట్లు హ్యాండ్లూమ్‌కు, 500 యూనిట్లు పవర్ లూమ్స్ ఉన్నవారికి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం.



## రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపునకు తీసుకువెళుతున్నాం

### - మంత్రి అనగాని సత్య ప్రసాద్

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** గత ప్రభుత్వం సృష్టించిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపుకు తీసుకుని వెళ్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు.ఆయన రెండురోజుల కలెక్టర్ల సదస్సులో ప్రారంభోపన్యాసం ఇస్తూ గత ఐదేళ్లలో అన్ని రంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గ నిర్దేశకత్వంలో అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్ళే ఇందుకు ఈకూటమి ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందని చెప్పారు.ఎపి బ్రాండ్ ను తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సూపర్ హామీలు ఇచ్చి సూపర్ 12 అమలు చేశామని గుర్తు చేశారు. అభివృద్ధి సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యం ఇచ్చి అన్ని పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్టు మంత్రి సత్య ప్రసాద్ స్పష్టం చేశారు.జిల్లాల్లో కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రతినిధులని ప్రజలకు సంబంధించిన అన్ని సమస్యలను పబ్లిక్ గ్రీవియోన్స్ రిడ్రస్సల్ సిస్టం ద్వారా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.రెవెన్యూ శాఖలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చామన్నారు.తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్తకాలను అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.ప్రజల ఆస్తుల పరిరక్షణకు ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని కుడా రద్దు చేశామన్నారు.తప్పుడు రిజిస్ట్రేషన్లు జరగకుండా నివారించేందుకు శాఖలో అనేక మార్పులు తీసుకు వచ్చామని తెలిపారు.అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములను పటిష్టంగా క్రమబద్ధీకరణ చేయడం జరిగిందని చెప్పారు. అన్ని రెవెన్యూ రికార్డులు డిజిటలైజేషన్ చేయడం ద్వారా ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నామ న్నారు.

## దీర్ఘకాల వ్యాధులకు దివ్య ఔషధం ఆయుర్వేదం

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాత వార్తప్రతి నిధి:** సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్య విధానమే ఆయుర్వేద ఔషద సేవనమని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలా జ్యోతి బాయి అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవంను పురష్కరించుకుని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ నగర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నిర్మలా జ్యోతి బాయి మాట్లాడుతూ నేటి స్పీడ్ యుగంలో ముఖ్యంగా యువత విపరీతమైన వత్తిడికి గురవుతున్నారని, వారి వత్తిడిని సహజ పద్ధతిలో తొలగించి ప్రశాంత జీవనం సాగించే వైద్యం ఆయుర్వేదంలో ఉందన్నారు. తక్కువ ఖర్చుతో ప్రాణాంతకమైన, దీర్ఘకాల వ్యాధులను సైతం సులువుగా తగ్గించే విధానం ఆయుర్వేద వైద్య ప్రత్యేకత అని తెలిపారు. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే వన మూలికల తో వ్యాధులను నయం చేసే ప్రక్రియే ఆయుర్వేదమని అన్నారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 23న జాతీయ ఆయుర్వేద దినోత్సవం ను ఘనంగా జరుపుకుంటామని వివరించారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా సోమవారం నుండి ఈ నెల 23 వరకు రోజూ వినూత్న కార్యక్రమాలు నిర్వహించి ఆయుర్వేద చికిత్సపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం కృష్ణ లంకలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నామని, కళాశాల ఆవరణలో ఆయుర్వేదంపై అవగాహన పెంచేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేస్తామన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మహిళా సాధికారిక కమిటి సభ్యులు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తీశ్వరుని సేవలో సోమవారం భారత దేశంలోని సుమారు 50 ప్రాంతాలకు చెందిన మహిళా ఎంఎల్ఏలు,ఎంపిలు పాల్గొన్నారు. అతిధి దేవోభవా అన్నట్లు ఏర్పాట్లు చ ఏసారు. ఉదయం నుంచి వారికి స్వాగతం పలకటానికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డి, ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మలు పర్యవేక్షించారు. అయితే ఇక్కడ ఏర్పాట్లను అట్టహాసంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా చేపట్టని రీతిలో ఏర్పాట్లు చేసారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. సన్నిధివీధి రోడ్డు (మూడవ గోపురం నుంచి నాల్గవ గోపురం వరకు) దిగ్బంధం చేయటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వేకువ జాము నుంచి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఎలాంటి ఇబ్బంది లేకుండా అతిధులకు చర్యలు తీసుకున్నారు.మహిళా ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. తిరుపతిలో జరిగిన మహిళా సాధికారిక సదస్సుకు హాజరైన ఎంఎల్ఏలు,ఎంపిలు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారి దర్శన ఏర్పాట్లుకు 15రోజుల నుంచి ఇక్కడ రాష్ట్ర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. మహిళా సాధికారిక సదస్సుకు హాజరైన ఎంఎల్‌సి గ్రీష్మ మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన మహిళా సాధికారిక సదస్సులో పలు కీలక నిర్ణయాలు తీసుకోవటానికి దోహదపడిందన్నారు.జాతీయ స్థాయిలో మహిళలు హాజరై తాము పరిపాలనలో ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘ చ ర్చ జరిగిందన్నారు.పలు ప్రాంతాల్లో మహిళల పేరుతో మగవారు పెత్తనంపై సుదీర్ఘ చర్చలు జరిగాయన్నారు. రాబోవు రోజుల్లో రాజ్యాంగ పరంగా ఇస్తున్న అధికారాలను సద్వినియోగంపై పలు కోణాల్లో చర్చలు జరిగాయన్నారు. మహిళలను చైతన్యపరచుటకు సధస్సులు ఎంతో దోహదపడతాయన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో రోజువారీగా 2లక్షల మంది భక్తులకు వాహనసేవలు

### - జిల్లా యంత్రాంగంతో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రోజుకు 2లక్షలమంది భక్తులు ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో వేచి ఉంటారని, వారిందరికీ సకల సౌకర్యాలు కల్పించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు. భద్రత పరంగా, గ్యాలరీల్లోకి ప్రవేశించే సమయంలో ఇంకా పలు



ప్రాంతాల్లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు రియల్‌టైమ్‌మానిటరింగ్ చేయాలని సూచించారు. వీలైనంతవరకు యాత్రికులకు సురక్షితమైన ప్రజారవాణావ్యవస్థను వినియోగించుకోవాలని భక్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీని క్రమబద్ధీకరించడం, పార్కింగ్ అంశాలపై సోమవారం సాయంత్రం అన్నమయ్యభవనంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, తిరుమల అదనపుఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్‌తో కలసి టిటిడి విజెలెన్స్,తిరుమల పోలీసు అధికారులతో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమీక్షించారు. మాఢవీదుల్లోని గ్యాలరీల్లో 1.80లక్షలమంది నుండి 2లక్షలమంది వరకు భక్తులు వేచివుంటారన్నారు.వారందరికీ కూర్చునే సదుపాయం ఉందని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహనసేవలను తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు ఇఒ వెల్లడించారు. 4,200మంది పోలీసులు, 1,500మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా రద్దీనియంత్రణ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. తిరుమలకు ఆర్టీసి 435 బస్సులు నడుస్తున్నాయని, దీనిద్వారా 1.60లక్షలమంది భక్తులను తిరుమలకు తీసుకువచ్చి తిరిగి తిరుపతికి చేర్చడం జరుగుతుందన్నారు. 23 పార్కింగ్‌ప్రాంతాలను వాహనాల పార్కింగ్ కోసం సిద్దంచేస్తున్నట్లు తెలిపారు.

## ఉన్నత స్థితిలో ఉన్నా సాధారణ జీవితం ఆయన ప్రత్యేకత

### - మారిషస్ ప్రధానిని ప్రశంసించిన బ్రహ్మశ్రీ గురూజీ

**తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాత వార్తప్రతినిధి:** ఉన్నతస్థితిలో ఉన్నా సాధారణ జీవితం సాగించడం మారిషస్‌ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రాంగులం ప్రత్యేకత అని తిరుపతి నగరం సమీపంలోని సి.రామాపురంలో ఉన్న బ్రహ్మరిగురూజీ సిద్దేశ్వర తీర్థ



ఆశ్రమం స్వామి బ్రహ్మర్షిగురూజీ తెలిపారు. డాక్టర్ నవీన్‌చంద్రరాంగులం తండ్రి శివశంకర్ రాంగులం మారిషస్ అభివృద్ధికి ఎంతో కృషి చేయడం వల్లే మారిషస్‌పితామహుడుగా పేరుగాంచారన్నారు. నవీన్‌చంద్ర చేపట్టిన ప్రజాసేవకు గుర్తింపుగా ఇప్పటికే నాలుగు పర్యాయాలు ప్రధానమంత్రిగా ఎంపికయ్యారని తెలిపారు. మరింత దీర్ఘకాలం నవీన్‌చంద్ర రాంగులం ఉన్నత పదవిలో ఉండగలరని గురూజీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగానవీన్‌చంద్రరాంగులం దంపతులను లక్ష్మీనారాయణులుగా గురూజీ పేర్కొన్నారు. ప్రతి హిందువుగా బ్రహ్మర్షి ఆశ్రమానికి రావడం తన పూర్వజన్మసుకృతంగా నవీన్‌చంద్ర భావించారు. ఈ సందర్భంగా గురూజీ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. మారిషస్ ప్రధాని వెంట చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్ ఉన్నారు.

## క్రికెట్,హాకీ టీంలకు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు భారత పురుషుల క్రికెట్ జట్టు,మహిళల హాకీ జట్టుకు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. ఆసియా కప్ 2025లో రజత పతకం గెలిచిన మహిళల హాకీ జట్టును అభినందించారు. వారు దేశం గర్వపడేలా చేశారని పేర్కొన్నారు. టీమ్ వర్క్,పోరాట స్ఫూర్తిని చూపారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆసియా కప్ 2025లో భాగంగా నిర్వహించిన టీ 20 క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై గెలిచిన భారత్ పురుషుల జట్టుకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. గొప్ప విజయం సాధించారని కొనియాడారు.

## 'సజీవ చరిత్ర' పుష్కకావిష్కరణ

### - హాజరుకానున్న చంద్రబాబు, వెంకయ్య నాయుడు, ఇంద్రసేనారెడ్డి

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాత వార్తప్రతినిధి:** ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ అధ్వర్యంలో రూపొందించిన 'సజీవ చరిత్ర' పుస్తకాన్ని విజయవాడ పోరంకి లోని మురళీ రిసార్ట్సులో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఆవిష్కరించనున్నట్లు కమిటీ ఛైర్మన్ టీడీ జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు,మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి,రాష్ట్ర స్పీకర్ అయ్యన్నపాత్రుడు,ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ తదితరులు హాజరవు తారన్నారు. పాత్రికేయుడు విక్రమ్ పూల రచించిన ఈ పుస్తకంలో 1984లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ కుట్రలను ఛేధించి ఎన్టీఆర్ మళ్ళీ సిఎం అయిన తీరుతెన్నులను వివరించినట్లు తెలిపారు.

## రాష్ట్రానికి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్

**రాజంపేట, సెప్టెంబర్15 ప్రభాతవార్త** రాష్ట్రానికి ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ చైనా 2800 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రాష్ట్రంలో 26 మున్సిపాలిటీలలో మంచినీరు, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా టెండర్లు పిలిచింది . ఈ పనులను చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై అండ్ సేఫ్టీ మేనేజ్మెంట్ ఇంప్రూవ్మెంట్ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. రాష్ట్ర పట్టణ అభివృద్ధి శాఖ పరిధిలోని పబ్లిక్ హెల్త్ సర్కిల్స్ వారిగా ఎస్.ఇ.లు తాజాగా టెండర్లు పిలిచారు.2014 19 తెలుగుదేశం హయాంలో చైనా బ్యాంకు రాష్ట్రానికి ఈ నిధులను విడుదల చేసింది. అప్పట్లోనే పనులను చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. కొన్ని పనులకు టెండర్లు కూడా పిలిచి పనులు చేపట్టారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఈ పనులు ఎక్కడికి ఎక్కడ నిలిచిపోయాయి. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పనులను మరలా చేపట్టేందుకు సోమవారం టెండర్ ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లాలో ఎర్రగుంట్ల ,అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం, గుత్తి, శ్రీ సత్యసాయి జిల్లాలో మడకశిర, పుట్టపర్తి ,కర్నూలు జిల్లాలో గూడూరు మున్సిపాలిటీలలో మంచినీటి వ్యవస్థ అభివృద్ధికి మురుగునీటి వ్యవస్థ అభివృద్ధికి 885.35 కోట్లతో టెండర్లు పిలిచారు. మడకశిర మున్సిపాలిటీలో 5 ఎం ఎల్ డి వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తారు. అలాగే ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, తిరువూరు మున్సిపాలిటీలలో, కృష్ణాజిల్లాలో ఉయ్యూరు, పెడన, గుంటూరు జిల్లాలో అద్దంకి ,బాపట్ల మున్సిపాలిటీలలో 646.51 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. అలాగే ప్రకాశం జిల్లాలో చీమకుర్తి ,కనిగిరి, గిద్దలూరు మున్సిపాలిటీలలో 474.95 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. కనిగిరి మున్సిపాలిటీలో 6 యం ఎల్ డి వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తారు. అలాగే కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం, గొల్లప్రోలు, కోనసీమ జిల్లాలో ముమ్మడివరం ,తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో 386.20 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాలో ఇచ్చాపురం, ఆముదాల వలస, మన్యం జిల్లాలో పాలకొండ ,సాలూరు మున్సిపాలిటీలలో,విజయనగరం జిల్లాలో నెలిమర్ల ,వైజాగ్ జిల్లాలో ఎలమంచిలి మున్సిపాలిటిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 405.52 కోట్లతో టెండర్లు పిలిచారు. మంచి నీటి పథకాల ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

# తిరుమల సమాచారం

## బ్రహ్మోత్సవాల్లో భక్తులకు దర్శనాలు, సౌకర్యాలపై కీలక నిర్ణయం

### - వేదపండితుల నియామకంపై చర్చ - నేడు టిటిడి బోర్డు సమావేశం

**తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ధర్మకర్తలమండలి ఏర్పాటైన తరువాత జరగనున్న తొలి సాలకట్లవార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు దర్శనాలు, సౌకర్యాలపై బోర్డు చర్చించనుంది. ఈ ఏడాది ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈనెల 24వతేదీ నుండి అక్టోబర్ 2వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో విచ్చేసే అశేషసంఖ్య భక్తులకు వసతి, వాహనసేవలతోబాటు మూలవిరాట్టు దర్శనం కల్పించడం, గరుడసేవరోజు అదనంగా భక్తులకు గరుడసేవ వీక్షణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన నిర్ణయాలను చర్చించనున్నారు. భారీసంఖ్యలో వేదపండితులు నియామకానికి సంబంధించి తుదిదశ ఆమోదం తెలిపే సూచనలు ఉన్నాయి.

మంగళవారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తలమండలి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించి ఆదమోదించనున్నారు. ఇప్పటికే టిటిడిపై అసత్యప్రచారాలు, సామాజికమాధ్యమాల్లో ప్రచారాలు ఎక్కువవడంతో ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించేలా, సైబర్‌నేరాల కట్టడిపై తీసుకోవాల్సిన చర్యలుపై బోర్డులో చర్చించనున్నారు. అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు, ఏఐతో సామాన్యభక్తులకు దర్శనాలు కల్పించే అంశంపై కూడా చర్చించనున్నారు. 24వతేదీ సిఎం చంద్రబాబునాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకురానుండటం, ఆయనచేత పిఎసి 5ప్రారంభం, ఇంకా మరికొన్ని అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయించాలనే అంశం పరిశీలిస్తున్నారు.

## దేవదేవుని దర్శనం మహద్భాగ్యం

### శ్రీవారిని దర్శించుకున్న మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్‌చంద్ర

**తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాత వార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం మహద్భాగ్యమని, తనకెంతో అనుభూతికలిగించిందని మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రాంగులం,వీణా రాంగులం తెలిపారు. స్వామివారి దర్శనం అద్భుతంగా జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.



సోమవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రాంగులం ,వీణా రాంగులం దంపతులు సాయంత్రం నైవేద్యవిరామసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద ఆంధ్రప్రదేశ్‌మంత్రి రాంనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల భక్తులతో కరచాలనం చేసి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. స్వామివారి దర్శనానంతరం తిరుగుప్రయాణమయ్యారు. శ్రీవారి దర్శనార్థం సాయంత్రం తిరుమలకు వచ్చిన మారిషస్ ప్రధాని రాంగులం దంపతులకు పద్మావతి విశ్రాంతి గృహాల సముదాయం వద్ద ఆంధ్రప్రదేశ్‌మంత్రి రాంనారాయణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## శ్రీవారి దర్శనంతో సకల శుభాలు - ప్రముఖులు



**తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకుంటే సకల శుభాలు కలుగుతాయని ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో టీమిండియా క్రికెటర్ రవీంద్రజడేజా సతీమణి గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులు, ఎంపి రవిచంద్ర, ఎంఎల్‌సి కల్యాణి తదితరులు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనం ,శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.20లక్షలు విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడ్డిస్తున్న వెంగమాంబ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు,ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు డిడిలను దాతలు విరాళమిచ్చారు. సోమవారం ఉదయం మంగళగిరికి మన్నెం శ్రీనివాసరావు



కుమార్తె మన్నెం హారిక పేరున ఎస్వీఅన్నప్రసాదంకు 10,00,116రూపాయలు, మరో కుమార్తె మన్నెం హరిత పేరున ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు 10,00,116 రూపాయలు డిడిలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు జానకిదేవి పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు

### - పలువురు మహిళా ప్రజాప్రతినిధులు

**తిరుమల,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ,ఆంధ్రప్రదేశ్‌లో సిఎం చంద్రబాబునాయుడు ఇద్దరూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలుచేస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వాలంభన సాధించాలనే సిఎం చంద్రబాబు ఆశయమన్నారు. ప్రతి ఇంట్లో మహిళ ఆర్థికంగా అభివృద్ధిచెందితే ఆ గ్రామం అన్ని విధాలా బాగుంటుందని ఆశయంతో పనిచేస్తున్నారన్నారు. తిరుపతిలో జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సులో హాజరైన దేశంలోని పలు రాష్ట్రాల నుండి వచ్చిన మహిళా ఎంపిలు, ఎమ్మెల్యేలు పలువురు సోమవారం ఉదయం తిరుమలకు వచ్చారు. తెలంగాణ ఎంపి డికె ఆరుణ, ఏపి ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, భూమా అఖిలప్రియ,గ్రీష్మ, బండారు శ్రావణి,మహువామజ్లి, లక్ష్మీకాంత్‌బాజ్‌పేయి తదితరులు విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు బహుకరించారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ సూపరింటెండెంట్ సస్పెన్షన్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తీశ్వరాలయ సూపరింటెండెంట్ విజయ సారధిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వు లుజారి చేసారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో దీర్ఘకాలంగా పని చేస్తున్న విజయసారధి స్కిట్ కళాశాలను పర్యవేక్షించే వారు.ఈ కాలంలో ఆయన ఆలయ ఇఒ, దేవాదాయశాఖ కమిషనర్‌కు సంబంధించి కోర్టు కేసుల విషయంలో బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సిన సూపరింటెండెంట్ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించారని వివరణ ఇచ్చిన డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి అన్నారు. సూపరింటెండెంట్ నిర్లక్ష్యం బాధ్యతా రాహిత్యంతో కోర్టు ధిక్కారణ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విజయసారధిని సస్పెండ్ చేసినట్లు వివరణ ఇచ్చారు.

ప్రతి మనిషి ఎంతో గొప్పవాడైనప్పటికీ, అతని మెదడుకున్న శక్తిలో శతకోటి భాగం కూడా తన జీవితకాలంలో ఉపయోగించుకోలేడనేది యథార్థం.

- ఎన్.డుబినిన్

# 'కుండపోత' కష్టాలు!


వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యామార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. అపార నష్టం కలిగిస్తున్నాయి. వర్షాల గూర్చి కొంతమేరకు వాతావరణ పరిశోధన శాస్త్రజ్ఞుల అంచనాలకు అందుతున్నా ఎక్కడ, ఎప్పుడు కుంభవృష్టి కురుస్తుందో కచ్చితమైన, స్పష్టమైన సమాచారం అందివ్వలేకపోతున్నది. దేశంలో అనేక చోట్ల ఈ వర్షాల కుంభవృష్టితో వరదలు ఉధృతమై అపార నష్టం కలిగిస్తున్నాయి. తెలంగాణలోని మొన్న నిజామాబాద్, నిన్న కామారెడ్డి ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కురిసిన కుంభవృష్టి రోడ్లు జలాశయాలుగా మారిపోయాయి. ఏకబిగువన కురిసిన వర్షంతో నగరవాసులు అతలాకుతలమయ్యారు. ఇద్దరు నాలాల్లో కొట్టుకుపోయారు. ఇక లోతట్టు కాలనీలో ఇళ్లల్లోకి నీరువచ్చింది. ఒక్క తెలంగాణలోనే కాదు అటు ఆంధ్రప్రదేశ్, ఆమాట కొస్తే దేశంలోని అనేక ప్రాంతాలు అ కుంభవృష్టి వర్షాలకు విలవిల్లాడుతున్నాయి. లక్షలాది ఎకరాల పంట నష్టం జరుగుతున్నది. వాతావరణంలో తలెత్తుతున్న ఈ మార్పుల కారణంగా రుతుపవనాల గమనం వర్షపాత విషయంలో భారత వాతావరణ విభాగం కచ్చితమైన అంచనాలు నేటికీ వేయలేకపోతున్నది. యేడాదియేడాదికి ఈ వరదల విపత్తులు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదే పదే ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడంఅటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు రహదారుల నిర్మాణాలు నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట భూమిని అరణ్యాల్లో జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ జరుగుతున్నది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం మరో పది, పదిహేనేళ్లలో భారత జనాభా దాదాపు 150 కోట్లకు చేరుకుంటుందని అందుకు తగినట్లుగా దేశంలో సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద వేగంగా తరిగిపోతుందని స్పష్టం చేసింది. భారత్‌లో రోజుకు దాదాపు మూడువందల ముప్పైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఎన్నో నివేదికలు ఘోషిస్తున్నాయి. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు,పరిశ్రమలు నదీలోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ప్లాస్టిక్‌వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు. అందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక్క ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధనాల వాడకం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వాహన కాలుష్యం నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు రెట్టింపుస్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్నపొగ అన్నీకలిపివాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమిలో ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రతపెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకుగురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగాప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవలకాలంలో పెరిగిపోతున్నది. వీటితోపాటు వరదలు, తుఫాన్లతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. యేటా దాదాపు 380కిపైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్ల డిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా యేటా లక్షలాదిమంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితు లు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్తల చర్యలవలన ప్రాణ,ఆస్తులనష్టం కొంత వరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణం సమతు ల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సాంకేతికంగా ఎంత పరిజ్ఞానం సంపాదించినా, ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతిముందు తలవంచని పరిస్థితుల నుండిమానవుడు బయటపడలేకపోతున్నాడు. తెలుగురాష్ట్రాల్లో గత రెండు,మూడు నెలలుగా కురుస్తున్న కుంభవృష్టి వర్షాలతో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వ్యవసాయ రంగానికి జరిగిన నష్టం లక్షల,కోట్లలో ఉండొచ్చు. ఏది ఏమైనా వీటన్నింటికి మూలకారణమైన ప్రకృతి సృష్టించే ఉపద్రవాలను నియంత్రించేందుకు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు త్రికరణశుద్ధిగా కృషిచేయాల్సినతరుణమిది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవిష్యత్‌లో ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించక తప్పదు.

ప్రతిభావంతుడు సముద్రపు గట్టులాంటివాడు. అలలవంటి సమస్యలకు వెనుతిరిగిపోడు.



టి. ఎడిసన్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### చెరువుల పట్ల నిర్లక్ష్యం వద్దు

నీరే మనుగడకు ప్రాణాధారం. ప్రతి చుక్క అమూల్యం. అటువంటి చెరువులను పూడ్చి వేస్తూ ప్రమాదకరమైన స్థలంలోఇల్లు నిర్మించడం ప్రమాదకరమని తెలిసిన ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోకపోవడం. పేద ప్రజలకు అటువంటి స్థలాలపై అవగాహన లేక అక్కడే నివాసం ఉండటం వర్షాకాలంలో ఆ ఊర్లు నీటమునిగి ఎన్నో విపత్తులకు గురవ్వడం,ఆస్తినష్టం,ప్రాణనష్టం జరుగుతుంది. తరిగిపోతున్నచెరువులను రక్షించడం మనందరి బాధ్యత. ఇప్పటికైనా వరదల్లో ఊర్లు కొట్టుకుపోకుండా ప్రభుత్వం దృష్టిసారించి వెంటనే చర్యలు చేపట్టి చెరువులను పూడిక తీసి రానున్నతరాలకు వారసత్వ సంపదగా అందించాలి.

- కాల్వ నిఖిత, సిద్ధిపేట

### గ్రూప్ 1 మెయిన్స్ రద్దు చేయాలి

**తెలంగాణ** రాష్ట్రప్రభుత్వం గ్రూప్ 1మెయిన్స్‌ను రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన చేస్తూ అదే విధంగా జీవో 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగ అభ్యర్థులు వేసిన పిటిషన్‌కు మెయిన్స్‌లోఅవకతవకలు జరిగాయి అని ఏకంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. గ్రూప్ 1 మెయిన్స్ పై అనేక సందేహాలు ఉన్నాయి వీటి అన్నింటికి పరిష్కారం ఒక్కటే గ్రూప్1మెయిన్స్‌ను రద్దుచేయడమే అంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు నిరుద్యోలు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. సంబంధించిన టీజీపీఎస్‌సీఅధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల జారీ చేస్తూ ముందు ముందు జరిగే పోటీ పరీక్షలనుఛాలెంజ్‌గాతీసుకుని సమర్థవంతంగా నిర్వహించాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### ఆర్థిక సహాయం కల్పించాలి

**విజ్ఞాన** శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణ రక్షణకు, సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం, చిరస్మరణీయం. వాటి ఫలితాలుఅనుభవించడం చాలాతేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతోపాటు ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్నిరంగాల్లో సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### రాసిపెట్టి ఉంటుంది

**తాము** అమిత బలవంతులమని, దైవ భక్తులమని తమను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగి ఎన్నో అకృత్యాలకి పాల్పడి తమ చావుని తామే కొని తెచ్చుకున్నారు పురాణకాలంలోని రాక్షసులు. చరిత్రలో కూడా కొందరు రాజులు. చక్రవర్తులు ఇదే విధంగా కండకావరంతో కన్నుమిన్ను కానరాకుండా ప్రవర్తించి చివరికి మట్టిలో కలిసిపోయారు. మరికొందరు రాజ్యాలను పోగొట్టుకుని అడవులపాలయ్యారు. ఇలాంటి వారి కథలను విని కూడా ఏలికలకు బుద్ధిరావడం లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైరిపక్షాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు. నోటికొచ్చిన తిట్లు తిడుతున్నారు. చులకనగా చూస్తు అవమానిస్తున్నారు. అహంకారం, గర్వం వంటివి ప్రదర్శించడంలో నాటి రాక్షసులకి, రాజులకి తామేమి తీసిపోమని నిరూపిస్తున్నారు.

-మిథునం, హైదరాబాద్

### ఆటుపోట్ల జీవితం ఆస్వాదిస్తే ఉత్తమం

**అతల** వితలసుతలాది పద్నాలుగు లోకాలలో భూలోకం అత్యుత్తమమైనది. ఈ భూలోకంలో భారతఖండం ఇంకా ఉత్కృష్టమైనది. ఇక్కడ మానవుడిగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమంటారు. ఎందుకంటే ఇది ఖర్మభూమి. ఎందరో దేవతలు కొలువై సులభంగా మోక్షంఇచ్చే భూమి. ఎన్నో ప్రకృతి వనరుల కాలవాలమైన భూమి. ఐనప్పటికీ ఈ భూమిలో పుట్టిన ప్రతి మనిషికి పోరాటం తప్పదు. కష్టసుఖాలు వెలుగు నీడల్లా వెంటాడుతూనేఉంటాయి. బతికినంతకాలం జీవితం చాలా విలువైనది. ఎప్పటికప్పుడు కొత్తపాఠాలు నేర్పుతూనే ఉంటుంది. కష్టాన్ని కూడాఇష్టంగా స్వీకరిస్తే ప్రతిరోజు జీవితం కొత్తగానే ఉంటుంది.

-డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### కాలమే సమాధానం చెబుతుంది

నేపాల్‌లో, బంగ్లాలో, శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు, విద్యార్థుల ఉద్యమం ఒకవైపు,ఈ జెన్‌జెడ్ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి. నేపాల్ కూడా వాటి లాగే చైనా వలలో చిక్కుకుపోయి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేసుకుంటుందా లేదా సర్వ సంక్షేమ రాజ్యాంగ వ్యవహరిస్తూ ఆర్థిక స్థిరత్వము సాగిస్తూ ముందుకు వెళుతుందా కాలమే సమాధానం చెప్పాలి.

-భారత అవినాష్, జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రధానులు మారడం సంక్షోభ పరిష్కారమేనా!

**నిర్దిష్టమైన లక్ష్యంలేని ఏ ఉద్యమం కూడా దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్య పరిష్కరించలేదు. ఒక వ్యక్తిస్థానంలో మరొక వ్యక్తిని అధికారంలో కూర్చోబెట్టటానికే పరిమితం అవుతుంది. శ్రీలంకలో జరిగింది అదే. నేపాల్ యువతదేశ ప్రధాన సమస్యలైన పేదలకు భూపంపిణీ, సంపద జాతీయకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం వంటి సమస్య పరిష్కారం వెడల అవగాహన లేదు. వారి ఉద్యమంలో ఈ అవగాహన వ్యక్తం కాలేదు. పాలకుల వెడల అసంతృప్తిని మాత్రమే వ్యక్తం చేసింది. మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం కొనసాగకుండానే ఉద్యమం ఆగిపోవటానికి అదే కారణం. సుశీలకర్కిని ప్రధానిగా నియమించటం ద్వారా ఎటువంటి మార్పు జరగదు.**

బొల్లిముంతసాంబశివరావు

నేపాల్లో యువత తిరుగుబాటుతో తీవ్రసంక్షోభం ఏర్పడింది. ప్రధాని కెపి ఓలీ శర్మ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ప్రదర్శనలు పెద్దఎత్తున సాగాయి. మంత్రుల ఇళ్లపై దాడులు జరిగాయి. ప్రభుత్వ భవనాలకు నిప్పు అంటించారు. హోంమంత్రితోసహా అనేక మంత్రులు రాజీనామా చేశారు. మిలటరీ కాల్పుల్లో 39 మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు. చివరికి ప్రధానమంత్రి శర్మ రాజీనామా ప్రకటించాడు. యువత తిరగబడితే జరిగే పరిణామాలకు నేపాల్ మరో ఉదాహరణ. యువత తిరుగుబాటుకు సోషల్ మీడియాపై నిషేధం ప్రధానకారణంగా చెప్పటం వాస్తవ పరిస్థితులను మరుగుపర్చటమేఅవుతుంది. సుదీర్ఘకాలం దేశంలో రాజరిక పరిపాలన సాగింది. దాని ఫలితంగా పేదరికం, నిరుద్యోగం పెరుగుతూవచ్చింది. రాజరికానికి వ్యతిరేకంగా నేపాల్ మావోయిస్టు పార్టీ పదేళ్లపాటు సాయుధ తిరుగుబాటు నడిపింది. ప్రభుత్వం, మావోయిస్టు పార్టీ ఒప్పందంలో భాగంగా నేపాల్లో ఎన్నికలు జరిగాయి. పెద్ద పార్టీగా మావోయిస్టు పార్టీ ఏర్పడింది. ఇతర పార్టీలతో కలసి ఆపార్టీ అధినేత ప్రచండనాయకత్వాన ప్రభుత్వం ఏర్పడింది. కొద్దికాలానికే ప్రభుత్వ భాగస్వాముల మధ్య విభేదాలు ఏర్పడి ప్రచండ రాజీనామా చేశాడు. ఆయన రాజీనామా తర్వాత కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ సోషలిస్టు) మాధవకుమార్ నేపాల్ ప్రధానిగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు జరిగింది. ఇంకా ఘలానాథ్ఖనాల్, బాబురామ్ భట్టారామ్, సుశీల్కోయిరాలా, కెపి ఓలీ శర్మ, షేర్ బహుదూర్దేవుబా ప్రధానులు అయ్యారు. ప్రచండ మూడవసారి 2022-2024 వరకు ప్రధానిగా ఉన్నాడు. తర్వాత మరలా కెపిఓలీశర్మ (కమ్యూనిస్టుపార్టీఆఫ్ నేపాల్) (సిపిఎన్) ప్రధాని అయ్యారు. నేటియువత ఆందోళనతో రాజీనామా చేశాడు. పదిసంవత్సరాలు సాయుధపోరాటం చేసిన ప్రచండ మార్క్సిజానికి, లెనినిజం, మావో ఆలోచనా విధానాలకు తిలోదకాలు ఇచ్చి భూర్జువా పార్టీలతో పొత్తు ద్వారా అధికారం చేపట్టాడు. కెపిశర్మ కూడా మార్క్సిజాన్ని జపిస్తూ ఇతరపార్టీలతో కలసి మూడుసార్లు ప్రధానిగా ప్రభుత్వాలు ఏర్పాటు చేశాడు. భూర్జువా ప్రభుత్వాల మాదిరిగానే, ప్రచండ, కెపిశర్మ ప్రభుత్వాల్లో కూడా తీవ్రమైన అవినీతి పెరగటమేకాకుండా, పేదరికం, నిరుద్యోగం కూడా బాగా పెరిగింది. నేపాల్ ప్రధానంగా వ్యవసాయదేశం. నూటికి 66 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 20శాతం భూమి మాత్రమేవ్యవసాయయోగ్యంగా ఉంది. వ్యవసాయం ద్వారా 70లభిస్తున్నది. గ్రామీణ ప్రజల్లో 28శాతం పేదరికంలో ఉన్నారు. జిడిపిలోమూడింట ఒక వంతు వ్యవసాయం నుండి వస్తుంది. దేశ జనాభాలో 7శాతంగా ఉన్న భూకామందుల వద్ద 31శాతం భూమి ఉంది. పారిశ్రామిక రంగం కూడా బాగా వెనుకబడి ఉంది. 1960 నుండి 1981వరకు నేపాల్లో 11 పారిశ్రామిక మండలాలున్నాయి. వీటిల్లో 611 పారిశ్రామిక సంస్థలు, 18,087 ఉద్యోగులున్నారు. 1990-91లో పారిశ్రామికవృద్ధి రేటు 15.05గా ఉంది. 1995 తర్వాత నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల ఫలితంగా పారిశ్రామిక వృద్ధి రేటు తగ్గటం ప్రారంభమైయింది. 2005-2006లో 8.28కి, 2015



16కి8 తగ్గింది. పారిశ్రామిక ప్రైవేటీకరణ ఫలితంగా1995లో ప్రతికూల పారిశ్రామికవృద్ధిరేటు 12.8గా ఉంది. 1996లో 2.9 మాత్రంగానే ఉంది. 1997నాటికి దేశంలోని ప్రభుత్వ యాజమాన్యంలోని అన్నిపారిశ్రామిక సంస్థలు అమ్మి వేయబడ్డాయి. కార్పొరేట్ సంస్థల్లో పెద్దసంఖ్యలో పనిచేస్తున్న కార్మికులను అరబ్ దేశాలకు, మలేసియాకు పంపటానికి ఏర్పాట్లు జరిగాయి. ఫలితంగా కార్పొరేట్ సంస్థలు వివాదంలో పడ్డాయి. కార్పొరేట్ సంస్థలతోపాటు జనపనార,చెరకు, పొగాకు, పత్తికర్మాగారాలు మూతపడడంతో కార్మికులు నిరుద్యోగులుగా మారారు. 2022లో కార్మికులు పెద్దఎత్తున తొలగించబడ్డారు. దేశంలో ఆర్థిక సంక్షోభాలు ఏర్పడ్డాయి. దేశ ఆర్థికవ్యవస్థ మొత్తం దిగుమతులపై ఆధారపడి ఉంది. 2022లో వాణిజ్య దిగుమతుల విలువ17వేలకోట్లు ఉండగా ఎగుమతుల విలువ 2 వేలకోట్ల రూపాయలు మాత్రమే. 1951లో మొత్తం ఎగుమతి విలువ 151మిలియన్ల రూపాయలు. 1998లో ఎగుమతులు 28.3 పెరిగాయి. 1989లో భారత దేశం విధించిన ఆంక్షల వల్ల 12.3 తగ్గాయి. పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. 2010 నుండి పేదరికం తీవ్రంగా పెరిగింది. దేశ జనాభాలో 10శాతంగా ఉన్న అగ్రశ్రేణి సంపన్నుల వద్ద 40శాతం సంపద ఉంది. ఇది 40 శాతంగా ఉన్న పేదల సంపదకంటే 26రెట్లు ఎక్కువ. (17 డిసెంబర్ 2023 నాటికి) సంపన్నుల ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని,సగటు కుటుంబ ఆదాయంగా పేద కుటుంబాలకు వర్తింపచేయడాన్ని అనేక మంది విమర్శించారు. నేపాల్లో ఒకధనవంతుడి ఆదాయం రూ.25కోట్లు జనాభాలో 40శాతం ఉన్న ప్రజలు 100 సంవత్సరాల్లో కూడా అంత సంపద సంపాదించలేరు. 2.80 కోట్ల నేపాల్ జనాభాలో 60 లక్షల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. 2019 నాటికి దేశ జనాభాలో 39శాతంమంది తక్కువ ఆదాయంతో రోజుజీవితం గడుపుతున్నారు. పిల్లల్లో 64శాతం మందికి పోషకాహారం లభించటం లేదు. పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం, తాండవిస్తున్న అవినీతి, కొద్దిమంది వద్దే దేశ సంపద ఉండడం నేపాల్ ప్రజల్లో ముఖ్యంగా యువతలో కెపి ఓలీశర్మ ప్రభుత్వం వెడల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. నిరుద్యోగంతో సతమతమవుతున్న యువత ఫేస్‌బుక్, యుట్యూబ్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్‌ల ద్వారా కొద్దిమేర ఉపాధి పొందుతున్నారు. వీటిద్వారా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు దేశప్రజలకు తెలుస్తూ ఉండటంతో వాటిపై కేపిశర్మ ప్రభుత్వం నిషేధం విధించడంతో నామమాత్రపు ఉపాధి కూడా యువత దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. అసలే ప్రభుత్వం వెడలకోపంతో ఉన్న యువత లోఈ చర్య మరింత కోపాన్ని రగిల్చి ఉద్యమానికి దారితీసింది. కేపీఓలీ శర్మ రాజీనామా చేసిన తర్వాత ఉద్యమకారులు, ఆర్మీకలిసి మాజీ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కిని దేశ తాత్కాలిక ప్రధానిగా ప్రకటించారు. దేశఅధ్యక్షుడు పార్లమెంటును రద్దుచేసి ఆరునెలల్లో ఎన్నికలు జరపాలని చెప్పారు. నిర్దిష్టమైన లక్ష్యంలేని ఏ ఉద్యమం కూడా దేశప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్య పరిష్కరించలేదు. ఒక వ్యక్తిస్థానంలో మరొక వ్యక్తిని అధికారంలో కూర్చోబెట్టటానికే పరిమితం అవుతుంది. శ్రీలంకలో జరిగింది అదే. నేపాల్ యువతదేశ ప్రధాన సమస్యలైన పేదలకు భూపంపిణీ, సంపద జాతీయకరణ, పారిశ్రామిక అభివృద్ధి,నిరుద్యోగసమస్య పరిష్కారం వంటి సమస్య పరిష్కారం వెడల అవగాహన లేదు. వారి ఉద్యమంలో ఈ అవగాహన వ్యక్తం కాలేదు. పాలకులవెడల అసంతృప్తిని మాత్రమే వ్యక్తంచేసింది. మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం కొనసాగకుండానే ఉద్యమం ఆగిపోవటానికి అదే కారణం. సుశీలకర్కిని ప్రధానిగా నియమించటం ద్వారా ఎటువంటి మార్పు జరగదు. •

# సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు!

తడకమళ్ళ మురళీధర్

నిర్ణయాలు తీసుకోవడంలో కాలయాపన చేయటం, అనవసర అడ్డంకులను సృష్టించటం, బాధ్యతల నుండి తప్పించుకొని రెడ్ టేపిజం ప్రక్రియలకు పాల్పడటం తగదంటూ చాలాసార్లు ఉన్నత న్యాయస్థానాలు ప్రభుత్వ అధికారులను నిలదీసిన వార్తలు మనకు సుపరిచితమే. అయితే ఉన్నత న్యాయస్థానాలు ఎన్నిసార్లు చీవాట్లు పెట్టినా బ్యూరోక్రసిలో మార్పు అడవి కాచిన వెన్నెల లాగా ఉంటుందనేది నగ్నసత్యం. నాణేనికి మరోవైపు పరిశీలించినట్లయితే బ్యూరోక్రసీని నిగ్గదీసే ఉన్నత న్యాయమూర్తులు ఎంతవరకు ప్రజలకు, కక్షిదారులకు జవాబుదారీగా నిలుస్తున్నారనేది సామాన్య మానవుడు, కక్షిదారులు, న్యాయవాదులు ప్రశ్నించలేని ప్రశ్నగా మిగిలిపోతుంది. ఎంత సేపూ ప్రభుత్వాలు సరిపడా కోర్టులను ఏర్పాటు చేయలేదనే దుగ్ధతప్ప, పదవులనలంకరించిన ఉన్నత న్యాయమూర్తులు సహేతుకమైన సమయంలో తీర్పులు వెలువరించట్లేదనే కక్షిదారుల ఆవేదన,ఆత్రుత, నిరీక్షణ, ఆదుర్దాకు ఏమాత్రం విలువ దక్కటం లేదు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఉన్నత న్యాయమూర్తులు సహేతుకమైన సమయంలో తీర్పు వెలువరించని సందర్భాలు కోకొల్లలు. అందులో ప్రజల దృష్టికి వచ్చిన సందర్భాలు చాలా అరుదు. కక్షిదారులు న్యాయమూర్తులకు వ్యతిరేకంగా తమ గోడును ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. అలహాబాద్ హైకోర్టు ముందున్న 2008 నాటి రవీంద్ర ప్రతాప్ షాహి వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీకేసులోని క్రిమినల్ అప్పీల్‌లో 24-12-2021న ఇరు పక్షాల తుది వాదనలు విని సంవత్సరం దాటినా తీర్పు వెలువరించలేదనే విషయం సుప్రీంకోర్టు దృష్టికి తేబడింది. "మాకు ఈ వార్త అత్యంత దిగ్భ్రాంతికరం,ఆశ్చర్యకరమైన విషయంగా అనిపిస్తుంది' అంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానిస్తూ అనిల్ రాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం 20సంవత్సరాలకు పూర్వమే అనగా 06-08-2001న వెలువరించిన మార్గదర్శకాలను పునరుద్ఘాటించింది. అనిల్‌రాయ్ కేసులో పాట్నా హైకోర్టు న్యాయమూర్తులు 23-08-1995 తేదీన ఇరుపక్షాల తుది వాదనలు విని 14-08-1997న మాత్రమే తుది తీర్పు వెలువరించారు. సుప్రీంకోర్టు దృష్టికి ఈ విషయం తేగా, తీర్పు సకాలంలో వెలువరించనందున, రాజ్యాంగం 21వ అధికరణ ద్వారా జైల్లో మగ్గుతున్న ఆ కేసులోని నిందితులకు కల్పించబడిన స్వేచ్ఛహక్కుకు విఘాతం కలిగిందని పేర్కొంది. సివిల్ ప్రొసీజర్ చట్టం,క్రిమినల్ ప్రొసీజర్ చట్టం తీర్పులను వెలువరించటానికి ఉన్నత న్యాయస్థానాలకు ఎటువంటి సమయ పరిమితి నిర్దేశించకున్ననూ, సహేతుకమైన సమయంలో తీర్పును వెలువరించాలని, అప్పుడే న్యాయం అందించినట్లవుతుందని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానిస్తూ కొన్ని మార్గదర్శకాలను ఆదేశాల రూపంలో జారీ చేసింది. ఇరుపక్షాల తుది వాదనలు విన్న మూడు నెలల్లోగా తీర్పు వెలువరించాలని, ప్రతి తీర్పు మొదటి పేజీలో తీర్పు రిజర్వ్ చేసిన తేదీ, తీర్పు వెలువరించిన తేదీ విధిగా పేర్కొనాలని సుప్రీంకోర్టు దేశంలోని అన్ని ఉన్నత న్యాయస్థానాలకు ఆదేశాలిచ్చింది. ఒకవేళ మూడు నెలల్లోగా తీర్పు వెలువరించకపోతే, సంబంధిత కక్షిదారులు సంబంధిత న్యాయమూర్తి ముందు ఆ విషయం తెలియజేస్తూ దరఖాస్తుద్వారా నివేదించే అవకాశం సుప్రీంకోర్టు తీర్పు కల్పించింది. అయిననూ ఆరు నెలల్లోగా తీర్పు ప్రకటించకపోతే కక్షిదారులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదుచేసే విధంగా మార్గదర్శకాలు నిర్దేశించారు. ఇటువంటి విలక్షణమైన, కఠినతరమైన మార్గదర్శకాలు 06-08-2001నే సుప్రీంకోర్టు నిర్దేశించినప్పటికీ, కొంతమంది ఉన్నత న్యాయమూర్తులు వాటిని గాలికొదిలేసి సమయపాలనను పాటించకుండా తీర్పులను ఏళ్లతరబడి పొడిగిస్తూ కక్షిదారులకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛహక్కుకు విఘాతం కలిగిస్తున్నారు. కొంతమంది సబార్డినేటు న్యాయమూర్తులు అరెస్టు మార్గదర్శకాలకు గండి కొడ్తుంటే ఉన్నత న్యాయస్థానాలు తీర్పులు వెలువరించాల్సిన సమయపాలన మార్గదర్శకాలను నిర్వేతుకంగా ఉల్లంఘిస్తున్నాయి. ఈ మార్గదర్శకాలు ఉన్నాయనే విషయం వారికి తెలియదేమో అనుకునే ఆస్కారం ఉండటానికి వీలు లేదు. ఎందుకంటే చట్టం తెలియదనటం సాకుకాదు. సుప్రీంకోర్టు సూచనలు, ఆదేశాలు 141వ అధికరణ ప్రకారం దేశంలోని అన్ని న్యాయస్థానాలు విధిగా పాటించాలి. తీర్పు రిజర్వు చేసిన తేదీని హైకోర్టులు తమ తీర్పుల్లో పేర్కొన్న సందర్భాలు అతిస్వల్పం. సకాలంలో తీర్పు ప్రకటించటమే కాకుండా తీర్పు ప్రతిని అదేరోజు వెబ్‌సైట్‌లోకి అప్ లోడ్ చేయించాలి. తీర్పు కాపీని ఇరు పక్షాలకు కనీసం వారంలోగా అందజేయాలి. కాసేపు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రక్కన పెడితే, ప్రతి న్యాయమూర్తి ప్రజలకు, కక్షిదారులకు, రాజ్యాంగానికి జవాబుదారీగా భావించవలసి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. ప్రభుత్వ అధికారులను ప్రశ్నించే విధంగానే కక్షిదారులు న్యాయస్థానాలను తీర్పు ప్రకటించటానికి జరిగే అలక్ష్యాన్ని సున్నితంగా, నిర్ద్వందంగా ప్రశ్నించగలిగే వాతావరణం కల్పించబడాలి. •

# మధ్యాహ్న భోజన పథకంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రభుత్వ పాఠశాలలలో జాతీయ పౌష్టికాహార పథకం కింద ఒకటో తరగతి నుండి పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కొన్నిసార్లు నిర్వాహకుల వలన కావచ్చు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ కావలసినంత లేకపోవడం వల్ల కావచ్చు. కారణాలు ఏమైనా అడపాదడపా మధ్యాహ్నభోజనంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నతర్వాత అస్వస్థకు లోనవుతున్నారు అనే వార్తలు వినవస్తుంటాయి. పరిశుభ్రమైన పాఠశాల పరిసర వాతావరణంలో నిర్వాహకులు సరైన రీతిలో వండటం, ప్రభుత్వం నుండి వచ్చేటువంటి భోజనానికి కావలసినటువంటి బియ్యం ముడిసరకు లాంటివి నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండడం అనేది ముఖ్యమైనప్పటికీ, కొన్నిసార్లు ఎవరి అప్రమత్తత లేకపోవడం ఏమోగానీ మధ్యాహ్నం భోజనం తింటున్న విద్యార్థులు అడపాదడపా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మధ్యాహ్న భోజనం అందించే విధానంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కలిసి భోజనం చేయడానికి సంబంధించి మధ్యాహ్న భోజనంపై హైకోర్టు ప్రశ్నించిన తీరు అదేవిధంగా ముఖ్యమంత్రి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంలో మధ్యాహ్నభోజనం ఉపాధ్యాయులు విద్యార్థులతో కలసి తింటే బాగుంటుందేమో అని సూచించిన సంగతి విధితమే. నిర్వాహకులు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజనం ప్రత్యక్ష పరిశీలన ఉంటుంది కాబట్టి నిర్వాహకులలో జాగ్రత్త భావనఉంటుంది. మధ్యాహ్న భోజనాన్ని మరింత మంచిగా వండడానికి ప్రయత్నిస్తారు. నిర్వాహకులపై ఆరోపణలు దరిచేరకుండా చూసుకునే ప్రయత్నం చేస్తారనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకంలో రోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టిక ఆహారం ఇచ్చేక్రమంలో ముందుగా పాఠశాలలోని ఉపాధ్యాయులలో రోజుకొకరు భోజన నాణ్యతను పరీక్షించి రుచిని చూడాలనే నిబంధనతో పాటు రోజువారి వంటకాలు రుచికి సంబంధించి ఉపాధ్యాయుల అభిప్రాయాన్ని మధ్యాహ్న భోజన డైరీలో రాస్తూ ఉంటారు. కానీ క్షేత్రస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై అనేక సందేహాలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. చాలా వరకు పాఠశాలలో వంటశాలలున్నప్పటికీ ఎక్కువగా కట్టెల పొయ్యిలనే వాడుతుండడం గ్యాస్ సిలిండర్ల వాడకం తక్కువ ఉండడం గమనార్హం. దేశంలోని ప్రభుత్వ యాజమాన్యాల కింద నడుస్తున్నటువంటి పాఠశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో ఆకర్షించడానికి విద్యార్థుల్లో సామాజిక సమానత్వ భావాన్ని పెంపొందించడం, నాణ్యమైన బోధన అభ్యసనతో పాటు విద్యార్థుల పెరుగుదలకు అవసరమైనటువంటి పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని మధ్యాహ్నం భోజనంలో అందించడానికి నిర్దేశించిన మధ్యాహ్న భోజన పథకంరాష్ట్రాల్లో ప్రభుత్వ ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలో నిర్వహించబడుతుంది. మధ్యాహ్న భోజన పథకం ఉద్దేశం ఏమైనా కానీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని



విద్యార్థులకు ఒకపూట మధ్యాహ్న భోజనాన్ని అందించే క్రమంలో సవాలక్ష సమస్యలు ఎదురవుతుండడం సాధారణమైపోతున్నాయనే వాదనలు వినిపిస్తున్నప్పటికీ దీనికి ప్రధాన కారణం కొన్ని సందర్భాల్లో నాణ్యత ప్రమాణాలు కలిగినటువంటి ఆహారాన్నినిర్ణీత సమయంలో నిర్వాహకులు అందించలేకపోతున్నారా అనే అనుమానం కలగక మానదు. ప్రధానంగా ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించవలసి ఉంటుంది. అలాంటప్పుడు ఒక ఉపాధ్యాయుడు దాన్ని నాణ్యతను పరిశీలించిన తర్వాత విద్యార్థులకు అందించే క్రమంలో ప్రతిరోజు ఒక ఉపాధ్యాయునికి ఒక పూట మధ్యాహ్న భోజనం వర్తింపజేసి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కలిసి భోజనం చేసే తీరు వలన మధ్యాహ్న భోజనంఅనేక సమస్యలకు మార్గం సుగమం అవుతాయేమో అనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతుండడం విశేషం. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ అనే సంస్థ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆయా ప్రభుత్వాలు ఉచితంగా ఒక పూట మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించడం జరిగింది. వాదనలను పరిగణలోకి తీసుకున్న భారత అత్యున్నత న్యాయస్థానం మధ్యాహ్న భోజనం ఆవశ్యకత గుర్తించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత మధ్యాహ్నం భోజనం తప్పనిసరిగా అమలుపరచాలని రెండు వేల ఒకటి సంవత్సరంలో వివరణాత్మకమైన తీర్పును ఇచ్చింది. అంతేకాకుండా దేశంలోని బాలల ఆరోగ్య పరిస్థితిపై అధ్యయనం చేసిన బోర్, మొదలియార్ కమిటీ సూచనల ప్రకారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తప్పనిసరిగా పోషకాహారంతో కూడిన భోజనం అవసరమని చెప్పింది. అనంతరం జరిగిన పరిణామాల్లో రెండు వేల ఐదు సంవత్సరం నుండి భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలతో సహా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా మధ్యాహ్న భోజన పథకం అమలు విధానంలో అరవై శాతం కేంద్ర ప్రభుత్వం నలభై శాతం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందిస్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వం భోజనానికి కావలసినటువంటి ధాన్యాలను నేరుగా అందించడమే కాకుండా పంచవర్ష ప్రణాళికల్లో ప్రతిసారిమధ్యాహ్న భోజనానికి అధిక సంఖ్యలో నిధులను కేటాయిస్తుంటారు. తరచుగా నెలలు తరబడి అయినా కూడా బిల్లులు రాని పరిస్థితులు గతంలో గోచరించి నప్పటికీ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నిర్వహణకు అవసరమైన ఖర్చు మొత్తం ఎప్పటికప్పుడు అందిస్తే గాని మధ్యాహ్న భోజన నిర్వహణ సజావుగా ముందుకు కొనసాగుతుందనే భావన నిర్వాహకులలో లేకపోలేదు. ఏదేమైనప్పటికీ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యా దశలో విద్యార్థుల మానసిక శారీరక అభివృద్ధికి ప్రాధాన్యత కలిగి ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనపథకం నాణ్యత ప్రమాణాలు కలిగిన సరైన పౌష్టిక విలువలు కలిగిన భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో వండించిప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమక్షంలో నిర్దేశించిన రోజువారీ మెనూప్రకారం విద్యార్థులకు క్రమపద్ధతిలో అందించగలిగితే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆసక్తి చూపడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యానికి ఈ పథ కంఎంతో ఉపయోగకరమైన విధంగా ఉంటుంది. •

# సుంకాలు పెంచితే అమెరికాపై ప్రతిచర్య



తీవ్రంగా హెచ్చరించిన చైనా

భయపెట్టడం, ఒత్తిడి చేయడంతో సమస్యలు పరిష్కారం కావని హితవు

**బీజింగ్, సెప్టెంబరు 15:** తమతోపాటు పలు దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాటిపై నాటో, జి–7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా పిలుపునివ్వడంపై చైనా తీవ్రంగా స్పందించింది. కేవలం ఏకపక్షంగా వేధించేందుకు ఆర్థిక బలప్రదర్శనకు ఇటువంటి చర్యలు చేపడతామని తీవ్రంగా ఆరోపించింది. వాషింగ్టన్ చెప్పినట్లు చేస్తే మాత్రం తాము ప్రతి చర్యలు చేపడతామని తీవ్రంగా హెచ్చరించింది. ఓ పక్క స్పెయిన్ మాడ్రిడ్‌లో సోమవారం నుంచి ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు మొదలైన వేళ చైనా నుంచి ఈ ప్రతిస్పందన రావడం గమనార్హం. రోజువారీ సాధారణ ప్రెస్ బ్రీఫింగ్స్‌లో భాగంగా చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జిన్ మాట్లాడుతూ ప్రపంచంలోని ఇతర దేశాల వలే రష్యాతో కూడా తమకు సాధారణ సంబంధాలున్నాయన్నారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా అనుగుణంగానే ఉన్నట్లు పేర్కొన్నారు. 'అమెరికా చర్యల ఏకపక్ష వేధింపులు, ఆర్థిక బలప్రదర్శనకు నిదర్శనం. ఇవి తీవ్ర స్థాయిలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను దెబ్బతీస్తాయి. అంతేకాదుప్రపంచ వాణిజ్య, పారిశ్రామిక పంపిణీ వ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుంది. భయపెట్టడం, ఒత్తిడి చేయడం వంటివి సమస్యలను పరిష్కరించలేవని ఎప్పుడో నిరూపితమైంది. ఉక్రెయిన్ విషయంలో చైనా విధానం ఎప్పుడూ ఒక్కటే. కేవలం చర్చలు, సంప్రదింపులతోనే ఆచరణయోగ్యమైన పరిష్కారం మార్గం లభిస్తుంది' అని పేర్కొన్నారు. ఏకపక్ష ఆంక్షలను చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఐరోపా, అమెరికా ఇప్పటికే రష్యాతో వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాయని గుర్తు చేశారు. ఇక తమ, రష్యా సంస్థల మధ్య సహకారం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందన్నారు.

నాటో దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం పిలుపునిచ్చారు. దాంతోపాటు రష్యన్ పెట్రోలియం కొంటున్న చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధిస్తానని కూడా ట్రంప్ సంకేతం పంపారు. భారీ స్థాయిలో డ్రాగన్‌పై సుంకాలు విధిస్తేనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నిలిచిపోతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని నాటో దేశాలు ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలువరించేందుకు కావాల్సిన నిబద్ధత కొన్ని నాటో దేశాల్లో తక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



చట్టవిరుద్ధ పద్ధతులుంటే

# బీహార్ 'సర్' రద్దుచేస్తాం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) అనుసరిస్తున్న పద్ధతుల్లో ఏదైనా చట్టవిరుద్ధం అని తేలితే, బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను రద్దు చేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్‌లో చేపట్టిన సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేసింది. ఈ సందర్భంగా సర్ నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ చట్టాలను, తప్పనిసరి నిబంధనలను పాటించిందని తాము భావిస్తున్న సుప్రీం ధర్మాసనం పేర్కొంది. సర్ పరంగా తాము ఇచ్చే తుది తీర్పు బీహార్‌కు మాత్రమే కాదు, దేశం మొత్తానికి వర్తిస్తుందని స్పష్టం చేసింది. బీహార్ సర్ ఎక్సర్‌సైజ్‌పై తుది వాదనలు అక్టోబర్ 7న వింటామని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇంతకు ముందు, నిర్ణీత కాల వ్యవధుల్లో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించాలనే ఆదేశాలు జారీ అయితే తమ ప్రత్యేక అధికార పరిధికి విఘాతం కలుగుతుందని సుప్రీంకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కు సంబంధించిన విధానంపై పూర్తి విచక్షణతో స్వతంత్రంగా నిర్ణయాన్ని తీసుకునే అధికారం తమకు ఉందని పేర్కొంది. ఈ విషయంలో ఇతర సంస్థలతో నిమిత్తం లేకుండా పనిచేసే స్వేచ్ఛ తమకు ఉందని ఈసీ చెప్పింది. ఈ మేరకు వాదనలతో సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం దాఖలు చేసింది. బీహార్‌లో చేపట్టిన సర్ కోసం 11 గుర్తింపు కార్డులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. అయితే వీటిలో ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున ఆందోళన చేశాయి. ఆధార్‌ను గుర్తింపు పత్రంగా పరిగణించాలని కోరుతూ, సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. దీనితో ఆధార్‌ను 12వ గుర్తింపు పత్రంగా పరిగణించాలని ఈనెల 8న సర్వోన్నత న్యాయస్థానం ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆధార్ అనేది వ్యక్తుల గుర్తింపునకు, నివాసానికి చట్టబద్ధమైన రుజువుగా మాత్రమే ఉంటుందని, అది పౌరసత్వాన్ని సూచించదని స్పష్టం చేసింది. ఈసీ బీహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి, సరైన ధ్రువీకరణ లేకుండా లక్షలాది మంది నిజమైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తోందని విపక్షాలు విమర్శలు గుప్పించాయి.



## మహారాష్ట్ర గవర్నర్‌గా దేవవ్రత్ ప్రమాణం

**ముంబయి, సెప్టెంబరు 15:** మహారాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం ముంబైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా హాజరయ్యారు. కాగా, ఇటీవలే జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగారు.

# నెతన్యాహు జాగ్రత్త.. ఖతార్ మా మిత్రదేశం

## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, సెప్టెంబరు 15:** గత వారం గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు దోహాలో సమావేశమైన హమాస్ నేతలపై 'సమ్మిట్ ఆఫ్ ఫైర్' పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని.. దానిపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఇజ్రాయెల్ ఆచితూచి వ్యవహరించాలని ఆ దేశ ప్రధాని నెతన్యాహును హెచ్చరించారు. ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–థానీని అద్భుతమైన వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. ఇజ్రాయెల్ హమాస్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఖతార్ జోలికి మాత్రం వెళ్లొద్దని అన్నారు.

కాల్పుల విరమణకు సంబంధించి యుఎస్ ప్రతిపాదన మేరకు ఇటీవల దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వారెవరూ ప్రాణాలు కోల్పోలేదు. అయితే, ఈ దాడులను ఖతార్ తీవ్రంగా పరిగణించింది. మధ్యవర్తిత్వ సూత్రంపై జరిగిన దాడిగా అభివర్ణించింది. కాగా భారత్‌తో సహా పలు దేశాలు ఈ దాడులను ఖండించాయి. మరోవైపు– అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. గాజా సమస్యకు పరిష్కారం ఏమిటనేది ఇజ్రాయెల్ అధికారుల్ని అడిగేందుకు ఆయన అక్కడికి వెళ్లినట్లు సమాచారం. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తాము చేసిన దాడులను సమర్థించుకున్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను. అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. ఆయన ఓ విడియోలో మాట్లాడారు. హమాస్‌తో యుద్ధానికి దారితీసిన అక్టోబరు 7 నాటి దాడులను ఆయన ప్రస్తావించారు. వీటిని అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చుతూ నాడు యుఎస్ ఎలా స్పందించిందో ప్రస్తుతం తాము అలాగే చేశామన్నారు. దాడులకు కారణమైన ఉగ్రవాదులు ఏదేశంలో ఉన్నా వెంటాడి హతమారుస్తామని నాడు అమెరికా ఏ విధంగా చెప్పిందో ప్రస్తుతం తాము కూడా అదే చేశామని అన్నారు.

# విదేశీ ఉద్యోగులను నియమించుకోండి

## దక్షిణ కొరియా దెబ్బకు దిగొచ్చిన డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, సెప్టెంబరు 15:** అమెరికా పరిశ్రమల్లో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యుఎస్‌లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణ కొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అక్రమ వలసల విషయంలో కఠినవైఖరి అవలంబిస్తు న్నారు. వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల జార్జియాలో 475 మంది అక్రమ వల సదార్లను నిర్బంధినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. జార్జి యాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో దక్షిణ కొరియా వాసులు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారం ఆధా రంగా ఈ రైడ్ జరిగింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్న వారిలో ఆ దేశవాసులే ఎక్కువగా ఉన్నారు. ఇది రెండుదేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జె మ్యూంగ్ స్పందించారు. 'ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యుఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకడతాయి' అని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారుచేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. లేకపోతే ఆ భారీ పెట్టుబడుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారి నుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం' అని ట్రంప్ రాసుకొచ్చారు.



## 30 యేళ్లుగా ఉన్నా సరైన పత్రాలులేవని పంజాబీ వృద్ధురాలి అరెస్టు

**వాషింగ్టన్, సెప్టెంబరు 15:** అక్రమ వలసలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న విదేశీయులను ఇమిగ్రేషన్ అధికారులు గుర్తించి, వారిని జైలుకు తరలించడం లేదా స్వదేశానికి పంపించడం చేస్తున్నారు. ఈ క్రమంలో నార్తర్న్ కాలిఫోర్నియాలోని ఈస్ట్ బేలో నివాసం ఉంటున్న హర్జిత్ కౌర్ (73)ను అధికారులు గత సోమవారం అదుపులోకి తీసుకున్నారు.సరైన పత్రాలు లేవని ఆమెను జైలుకు పంపించారు. దీనిపై కౌర్ కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పం జాబీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

# రాజకీయ పార్టీలకు 'పోష్' వర్తింపచేయలేం

పార్టీలను పనిప్రదేశంగా గుర్తించలేం..

పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ సెప్టెంబరు 15:** రాజకీయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) కింద రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. రాజకీయ పార్టీలకు, కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి సంబంధం ఉండదని, కాబట్టి రాజకీయ పార్టీలను "పని ప్రదేశం"గా పరిగణించలేమని సోమవారం స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రాజకీయ పార్టీలను 'పోష్' చట్టంలోని 'పని ప్రదేశం' నిర్వచనం కిందకు ఎలా తీసుకురాగలమని ధర్మాసనం ప్రశ్నించింది. పార్టీకి, దాని కార్యకర్తలకు మధ్య యజమానిఉద్యోగి బంధం లేనప్పుడు, ఈ చట్టం వర్తింపజేయడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. అడ్వకేట్ యోగామాయ ఎం.జి. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. 2022 మార్చిలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. యజమానిఉద్యోగి సంబంధం లేనందున, రాజకీయ పార్టీలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అప్పట్లో కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేరళ హైకోర్టు తీర్పు వల్ల రాజకీయ, సినీ, మీడియా వంటి అనధికారిక రంగాలలో పనిచేస్తున్న ఎంతో మంది మహిళలు పోష్ చట్టం రక్షణకు దూరమవుతున్నారని పిటిషనర్ వాదించారు. యజమాని, ఉద్యోగి , పని ప్రదేశం వంటి పదాలకు చట్టంలో విస్తృత అర్థం ఉందని, కానీ హైకోర్టు తీర్పు దాని స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 19(1), 21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషన్‌లో ఆరోపించారు. గత నెలలో కూడా ఇదే తరహా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే తిరస్కరించింది. అయితే, కేరళ హైకోర్టు తీర్పును ప్రత్యేకంగా ఎస్ఎల్‌పీ ద్వారా సవాలు చేయవచ్చని అప్పుడు సూచించింది. కాగా, గతేడాది డిసెంబర్‌లో ఇలాంటి మరో పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించడం గమనార్హం.

# సంక్షిప్తంగా..

## మాజీ ఐఎఎస్ పూజాఖేడ్కర్‌పై కిడ్నాప్ కేసు



**ముంబయి, సెప్టెంబరు 15:** మహారాష్ట్రకు చెందిన మాజీ ఐఎఎస్ ఆఫీసర్ పూజా ఖేడ్కర్ పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. తన కారును ఢీ కొట్టాడనే కోపంతో ఓ డ్రైవర్ ను తన ఇంట్లోని ఓ గదిలో బంధించిందని ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదుతో పూజా ఖేడ్కర్ పై కిడ్నాప్ కేసు పెట్టారు. నకిలీ సర్టిఫికెట్లతో ఐఎఎస్ కు ఎంపికైన పూజా ఖేడ్కర్ ను కేంద్రం ఇప్పటికే ఉద్యోగంలో నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై ఆమె న్యాయ పోరాటం చేస్తున్నారు. ఇటీవల నవీ ముంబైలో ఓ కాంక్రీట్ మిక్సర్ ట్రక్ ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, ఆ తర్వాత మిక్సర్ ట్రక్ డ్రైవర్ కనిపించకుండా పోయాడు. డ్రైవర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు సదరు ప్రమాదానికి గురైన కారును పూజా ఖేడ్కర్ ఇంటి ఆవరణలో గుర్తించారు. కారును పరిశీలించి, యజమానిని ప్రశ్నించేందుకు వెళ్లిన పోలీసుల పట్ల పూజా ఖేడ్కర్ తల్లి మనోరమ ఖేడ్కర్ అనుచితంగా ప్రవర్తించారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ గేటు తీసేందుకు నిరాకరించారు. కాసేపటి తర్వాత బలవంతంగా గేటు తెరిచి లోపలికి వెళ్లిన పోలీసులు ఇంట్లోని ఓ గదిలో బంధించిన మిక్సర్ ట్రక్ డ్రైవర్ ను గుర్తించి విడిపించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో న్యూడ్‌పార్టీ!

రూ.40వేలు ప్రవేశరుసుం..

ఆన్‌లైన్‌లో ఆహ్వానాల చక్కర్లు

ఆర్గనైజర్లు, అనుమానితుల అరెస్టులు



**రాయ్‌పూర్, సెప్టెంబరు 15:** ఛత్తీస్‌ఘర్ రాజధానిలో ఈనెల 21వ తేదీ న్యూడ్‌పార్టీ జరుగుతుందన్న సోషల్‌మీడియా ప్రచారంపై పోలీసులు స్పందించారు. రంగంలోకి దిగిన రాయ్‌పూర్ పోలీసులు అనుమానితులు అనేక మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆర్గనైజర్లుగా అనుమానిస్తున్న వారిని సమగ్ర విచారణజరిపి మరింతగా ముందుకు వెళతామని పోలీస్ అధికారులు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలనుంచి అర్ధరాత్రి దాటేంతవరకూ కూడా ఈ న్యూడ్‌పార్టీ ఉంటుందని, ఇందుకుగానుప్రవేశ రుసుం రూ.40వేలుగా ప్రకటించారు. అంతే కాకుండా ఈమొత్తంలో ఆరాత్రి బసచేసేందుకు గదికూడా కేటాయిస్తామని ప్రచారంచేసారు. ఒక్కసారిగా నెట్‌లో ఈపోస్టులు వైరల్ అయ్యాయి. హైపర్‌క్లబ్ మేనేజర్ జేమ్స్‌బ్యాక్, సంతోష్ జెవాని, అజయ్ మహాపాత్ర, ఎస్‌ఎస్‌గుప్త, టినుసింగ్, దేవేంద్ర అందరినీ అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తునానమని, మరి కొందరు అనుమానితులను కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఛత్తీస్‌ఘర్ కాంగ్రెస్ చీఫ్ దీపక్ బైజ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న బిజెపి ఇలాంటి చట్టవ్యతిరేక శక్తులకు రక్షణ ఇస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలు క్షీణిస్తే ఇలాంటి న్యూడ్ పార్టీలు ప్రారంభం అవుతాయని, సోషల్‌మీడియాలో పోస్టర్లు వైరల్ అవుతున్నాయని అన్నారు. అయినా కూడా ప్రభుత్వం సైలెంట్‌గా ఉందని, బిజెపి హయాంలో చట్ట వ్యతిరేక శక్తులు మరింతగా రెచ్చిపోతున్నారని ఆయన గుర్తుచేసారు. పలుకుబడి ఉన్న వ్యక్తులు మాత్రమే ఇలాంటి పార్టీలునిర్వహిస్తారని చెప్పారు. హోంమంత్రి తన శాఖపై పట్టుకోల్పోయారని ప్రతిరోజు ఒక కొత్తకుంభకోణం వెలుగులోకి వస్తోందని, నేరగాళ్లు ప్రభుత్వాన్ని డామినేట్ చేస్తున్నారన్నారు. అయితే డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ మాట్లాడుతూ ఈ సమాచారం తన దృష్టిలో లేదని, ఇలాంటి వాటిని ఎంతమాత్రం సహించబోమని, అనుమతులు ఇవ్వమని సరికదా కఠిన చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఛత్తీస్‌ఘర్ మహిళాకమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్మయి నాయక్ రాయ్‌పూర్ ఎస్పీకి లేఖరాస్తూ 48 గంటల్లోతనకు నివేదిక ఇవ్వాలని కోరారు. ఎస్పీతోపాటు సైబర్‌సెల్‌చీఫ్‌ను కూడా విచారణ చేయాలని, నిర్వాహకులు, ప్రాయోజితంచేసే ప్రముఖులు, ఆహ్వానాలూన్‌లైన్‌లో సర్క్యులేట్ చేసిన వారిని వెంటనే అరెస్టుచేయాలనికోరారు. రోజువారి ప్రగతిని కమిషన్‌కు నివేదించాలని కూడా మహిళాకమిషన్ ఛైర్‌పర్సన్ పేర్కొన్నారు.

## అరుణాచల్ దిబాంగ్ నదిపై మెగా డ్యామ్‌నిర్మాణం

చైనాకు దీటుగా భారత్ ముందడుగు

**ఇటానగర్, సెప్టెంబరు 15:** చైనాకు ధీటుగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిబాంగ్ నదిపై భారత్ మెగా డ్యామ్ నిర్మిస్తోంది. జల విద్యుత్ కేంద్రంతో పాటు డ్రాగన్ విడుదల చేసే వరదను తట్టుకునేలా డ్యామ్‌ను నిర్మించనుంది. భారత సరిహద్దుల్లో టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మిస్తున్న నేపథ్యంలో వ్యూహాత్మక భద్రతలో భాగంగా భారత్ కూడా మెగా డ్యాంకు శ్రీకారం చుట్టింది. అరు



ణాచల్ ప్రదేశ్‌లోని దిబాంగ్‌నదిపై 17వేల కోట్లతో మెగా డ్యాంను నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ భారీ డ్యాం ద్వారా పెద్ద మొత్తంలో నీటి విడుదల చేసి భారత్‌లో కృత్రిమ వరదలు సృష్టించే ప్రమాదం ఉందని అనుమానాలు ఉన్నాయి. చైనా కుట్రలను తిప్పికొట్టే లక్ష్యంతో భారత్ కూడా అరుణాచల్‌లో మెగా డ్యాం నిర్మాణం చేపట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. 2032 కల్లా ఈ మెగా డ్యాంను అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు సాగుతున్నాయి. చైనా ప్రాజెక్టు పూర్తైతే భారత్‌లోని బ్రహ్మపుత్రకు ప్రమాదమేనని భావిస్తోంది. టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చైనా ఇటీవల భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించింది. దీనిపై భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేశాయి. చైనా జల విద్యుత్ ప్రాజెక్టు ప్రభావం దిగువన ఉన్న దేశాలపై పడుతుందని భారత్ ఆందోళన వ్యక్తంచేసింది. చైనా ప్రాజెక్టు పూర్తైతే భారత్‌లోని బ్రహ్మపుత్ర నది పూర్తిగా ఎండిపోయే ప్రమాదముంది. ఈ ప్రాజెక్టును వాటర్ బాంబుగా వినియోగించుకొని, భారత్‌లో కృత్రిమ వరదలు సృష్టించే ప్రమాదముందనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి.

## హిట్ అండ్ రన్ బిఎండబ్ల్యు కేసులో డ్రైవర్ అరెస్టు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** దేశరాజధాని ఢిల్లీలో జరిగిన బీఎండబ్ల్యూ కారు హిట్ అండ్ రన్ కేసులో ఆ కారు డ్రైవర్ గగన్‌ప్రీత్‌ను అరెస్టు చేశారు. ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ నవజ్యోత్ సింగ్, ఆయన భార్య సందీప్ కౌర్ బైక్‌పై వెళ్తుండగా ఆ వాహనాన్ని బీఎండబ్ల్యూ కారు ఢీకొన్నది. ఆదివారం జరిగిన ఆ ప్రమాదంలో ఆర్థికశాఖ ఆఫీసర్ నవజ్యోత్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఇదే ప్రమాదంలో గాయపడ్డ బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ హాస్పిటల్‌లో చికిత్స పొందింది. ఆమెను సోమవారం పోలీసులు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. హిట్ అండ్ రన్ ఘటనలో ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కింద సెక్షన్ 281, ప్రమాదభరిత ప్రవర్తన కింద 125 బీ , హత్యాయత్నం కింద 105 సెక్షన్, తప్పుడు సమాచారం ఇచ్చిన కేసులో 238 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డ్యామేజ్ చెందిన వాహనాన్ని ఎఫ్ఎస్ఎల్ బృందం తనిఖీ చేసింది. బీఎండబ్ల్యూ కారును ఓ మహిళ డ్రైవ్ చేసిందని, సెంట్రల్ వర్జ్‌ను ఢీకొన్న తర్వాత ఆ వాహనం కంట్రోల్ తప్పి, బైక్‌ను ఢీకొన్నదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## వర్క్‌ఫ్రం హోం కాదు వర్క్‌ఫ్రం థియేటర్

**బెంగళూరు, సెప్టెంబరు 15:** సినిమా థియేటర్‌కు వెళ్లేది కాసేపు రిలాక్స్ అవ్వడానికి. కానీ, ఆ చీకట్లో వెండితెరపై సినిమా వెలుగుతుంటే, ఓ యువతి మాత్రం తన ల్యాప్‌టాప్ ఆన్ చేసుకుని ఆఫీస్ పనిలో మునిగిపోయింది. బెంగళూరులో చోటుచేసుకున్న ఈ వింత ఘటనకు సంబంధించిన ఫొటో ఇప్పుడు ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. నగరంలోని కార్పొరేట్ వర్క్ కల్చర్‌పై తీవ్రమైన చర్చకు దారితీసింది. లోక అనే సినిమా చూసేందుకు బెంగళూరులోని ఓ థియేటర్‌కు ఓ ఉద్యోగి వెళ్లాడు. తన ముందు వరుసలో కూర్చున్న ఓ యువతి ల్యాప్‌టాప్ ఓపెన్ చేసి తీవ్రంగా పనిచేస్తుండటం గమనించాడు. ఈ దృశ్యాన్ని ఫొటో తీసి రెడిట్ అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశాడు. బెంగళూరులో ఉద్యోగుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి ఇదే నిదర్శనం అంటూ దానికి ఓ వ్యాఖ్యను జోడించాడు. ఈ ఫొటో క్షణాల్లో వైరల్‌గా మారింది. నెటిజన్లు ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తున్నారు.

## కేరళలో 67కు పెరిగిన అమీబా కేసులు



**తిరువనంతపురం, సెప్టెంబరు 15:** కేరళలో మెదడు తినే అమీబా కేసుల సంఖ్య 67కు చేరింది. తాజాగా 17ఏళ్ల బాలుడికి అమీబిక్ మెనింగో ఎన్‌సెఫలిటిస్ అనే అరుదైన ఇన్ఫెక్షన్ సోకింది. స్నేహితులతో కలిసి అక్కులం టూరిస్ట్ విలేజ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టిన తర్వాత ఆ యువకుడు ఈ వ్యాధి బారినపడినట్లు ఆరోగ్యశాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో ఆ స్విమ్మింగ్ పూల్‌ను అధికారులు మూసివేశారు. నీటి నమూనాలు సేకరించి పరీక్ష కోసం పంపారు. కాగా, మెదడు తినే అమీబా వ్యాధి కారణంగా కేరళలో గతవారం ఒకే నెలలో ఐదో మరణం సంభవించింది. మలప్పురం జిల్లాలోని వండూర్‌కు చెందిన 56 ఏళ్ల శోభనకు ఈ వ్యాధి సోకింది. కోజికోడ్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. అదే హాస్పిటల్‌లో చికిత్స పొందిన సుల్తాన్ బతేరీకి చెందిన 45 ఏళ్ల రతీష్ అనే మరో రోగి కూడా అదే వ్యాధితో చనిపోయాడు.

# మాదేశాన్ని మాకిచ్చేయండి

లక్షలాదిమంది ఆందోళనలతో దద్దరిల్లిన లండన్ వీధులు

**లండన్, సెప్టెంబరు 15:** బ్రిటన్‌లో వలసదారుల సంఖ్య పెరిగిపోవడంపై స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమ దేశాన్ని తమకే వదిలేయాలంటూ లక్షలాది మంది లండన్ వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. "మా దేశాన్ని మాకు ఇచ్చేయండి" అనే నినాదాలతో లండన్ నగరం దద్దరిల్లింది. ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడంతో పోలీసులతో ఘర్షణ చోటుచేసుకుంది. జాతీయవాద నేత టామీ రాబిన్సన్ నేతృత్వంలో లక్ష మందికి పైగా నిరసనకారులు యూకే జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఉండే వైట్‌హాల్ ప్రాంతంలోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో 26 మంది పోలీసు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు పాలస్తీనా, ఇస్లామిక్ స్టేట్ జెండాలను చించివేసి తమ నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. నియంత్రణ లేని వలసలతో బ్రిటన్ వేగంగా పతనమవుతోంది. మీరు హింసను ఎంచుకోకపోయినా, హింసే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తోంది.దాన్ని ఎదుర్కోవాలి, లేదంటే ప్రాణాలు వదలాలి. ఇదే వాస్తవం అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, టామీ రాబిన్సన్ నిరసనకు వ్యతిరేకంగా పలువురు బ్రిటన్ ఎంపీలు, వామపక్ష నేతలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు సుమారు 5 వేల మందితో కౌంటర్ ర్యాలీ నిర్వహించారు. రాబిన్సన్ మద్దతుదారులను జాత్యహంకారులుగా, మహిళా వ్యతిరేకులుగా వారు ఆరోపించారు. ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల నుంచి వలసలు, శరణార్థుల సంఖ్య పెరిగిపోవడంతో తమ సంస్కృతి దెబ్బతింటోందని, నేరాలు అధికమవుతున్నాయని బ్రిటన్‌లోని జాతీయవాద వర్గాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూకే ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2024చివరి నాటికి దేశంలో 5,15,697 మంది అధికారిక శరణార్థులు ఉన్నారు. మరో లక్షా 24 వేల మందికి పైగా ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చట్టవిరుద్ధంగా దేశంలో నివసిస్తున్న వారి సంఖ్య 10 నుంచి 15 లక్షల వరకు ఉండవచ్చని అంచనా.

# రాష్ట్రంలో సోలార్ విప్లవం- 2026 మార్చి నాటికి 2.93 లక్షల సౌర విద్యుత్తు

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం 12,762 మెగావాట్ల పీక్ లోడ్‌ను ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ సీఎస్, ఇంధన శాఖ కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. మేనిఫెస్టోలోని విద్యుత్ సబ్సిడీ పథకాలన్నీ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. మార్చి 2026 నాటికి 2.93 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లను సోలార్‌గా మార్చనున్నామన్నారు. తిరుపతి జిల్లా అత్యధిక విద్యుత్ వినియోగ జిల్లాగా నిలిచింది. స్మార్ట్ గ్రిడ్ ఆధునీకరణ వేగవంతమవుతోందన్నారు. 4వ కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర విద్యుత్ రంగం పై సమగ్రమైన వివరణ ఇస్తూ పునరుత్పాదక ఇంధన విస్తరణ మరియు గ్రిడ్ ఆధునీకరణకు సంబంధించిన ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను వివరించారు. రాబోయే నెల్లో అనగా అక్టోబర్ 2025 నుండి మార్చి 2026 వరకు రాష్ట్రం 12,762 మెగావాట్ల అంచనా పీక్ లోడ్‌ను చేరుకునే స్థితిలో ఉందని, రోజువారీ డిమాండ్ 207 నుండి 250 గిగ్ వరకు ఉంటుందని చెప్పారు. 21,728 మెగావాట్ల ఇన్‌స్టాల్ కెపాసిటీ ఉన్నప్పటికీ, దాదాపు 50 పునరుత్పాదక ఇంధన వనరుల నుండి వస్తుంది, వీటి అనిశ్చిత స్వభావం వల్ల 24 గంటల డిమాండ్ తీర్చడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. సెప్టెంబర్ 10, 2025న రాష్ట్రం 12,527 మెగావాట్ల పీక్ డిమాండ్‌ను నమోదు చేసిందని, సెప్టెంబర్ 2025లో ఇంధన వినియోగం 2,974 మెగావాట్లకు చేరుకుందని నివేదించారు. ముఖ్యంగా, గత సంవత్సరంతో పోల్చితే సెలవారీ డిమాండ్ 15.38 పెరిగింది, ఇది రాష్ట్రంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను,ఆర్థిక కార్యకలాపాలను చూపిస్తుందని వివరించారు. విద్యుత్ సబ్సిడీలకు సంబంధించిన అన్ని ప్రధాన మేనిఫెస్టో హామీలను విజయవంతంగా నెరవేర్చామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ధోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్ సరఫరా అందుతోందని, పవర్‌లూమ్‌లకు నెలకు 500 యూనిట్లవరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, హ్యాండ్‌లూమ్‌లకు నెలకు 200 యూనిట్ల వరకు లభిస్తోందని ధ్రువీకరించారు. హెయిర్ కటింగ్ సెలూన్‌లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా విస్తరించామని, రైతులకు రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్ ప్రయోజనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని భారీ పునరుత్పాదక ఇంధన చోదనను ప్రకటించారు. డిస్కంలు 2,93,587 వ్యవసాయ పంప్‌సెట్ల సోలారైజేషన్‌కు టెండర్లను ఆహ్వానించారు, మొత్తం సోలార్ కెపాసిటీ దాదాపు 1,163 మెగావాట్లు ఉంటుందని వివరించారు. దేవలపల్లకు భూములను ఇప్పున్నామని, ఈ ప్రాజెక్టు మార్చి 2026 నాటికి పూర్తవుతుందని వివరించారు. అదనంగా, భారత ప్రభుత్వ కార్యక్రమంతో అనుసంధానించిన రూఫ్‌టాప్ సోలార్ కార్యక్రమం గురించి చర్చించారు. తిరుపతి జిల్లాలోని నాయావారిపల్లె మరియు చిత్తూరు జిల్లాలోని నడిమూరులో పైలట్ ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేశామని, మొత్తం రూఫ్‌టాప్ సోలార్ కెపాసిటీ 393 జ్యూ ఉందని తెలిపారు. ప్రెజెంటేషన్‌లో 2025 వ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మరియు 2026 వ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మధ్య జిల్లాల వారీ విద్యుత్ వినియోగ నమూనాలలో ఆసక్తికరమైన మార్పులను వెల్లడించారు. తిరుపతి జిల్లా 2026 వ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 1,448 మీగేవాట్ అత్యధిక విద్యుత్ వినియోగించే జిల్లాగా నిలిచింది, మూడవ స్థానం నుండి పైకి ఎగబాకింది, అయితే విగిలీ జిల్లా 1,032 మీగేవాట్ రెండవ స్థానానికి చేరుకుంది, గుంటూరు 923 మీగేవాట్ మూడవ స్థానంలో ఉంది. ఈ ర్యాంకింగ్‌లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పారిశ్రామిక మరియు ఆర్థిక అభివృద్ధి నమూనాలను ప్రతిబింబిస్తున్నాయని, విద్యుత్ వినియోగం ఆర్థిక కార్యకలాపాలు మరియు వృద్ధికి కీలక సూచికగా పనిచేస్తోందని తెలిపారు.



చిత్తూరులో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

## - ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం డిమాండ్

**చిత్తూరు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం పరిష్కరించి ఈ రంగాలను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఉపాధ్యాయ, విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన రణభేరి ప్రచార బైక్ జాత సోమవారం పలమనేరులో ప్రారంభమై చిత్తూరుకు చేరుకుంది. ఈ జాతను ఉద్దేశించి ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో చేసిన ప్రయోగాలు దుష్పరిణామాలకు దారి తీయడంతో వాటిని సరిదిద్దాలని ప్రస్తుత ప్రభుత్వంకు మొర పెట్టుకుంటే ప్రస్తుత ప్రభుత్వం సైతం నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలను పునర్వ్యవస్థీకరించడం వల్ల పాఠశాల వ్యవస్థలో 9 రకాలైన పాఠశాలలు ఆవిర్భవించాయన్నారు. దీని ఫలితంగా అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారడంతో పాటు 3 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలి వెళ్ళడం జరిగిందన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. టీచర్లను బోధనకు పరిమితం చేయకుండా అనేక రకాల యాప్లతో ప్రభుత్వం వేధిస్తోందని, ఫలితంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం అవుతుండటం సహించరానిదన్నారు. బోధనేతర కార్యక్రమాలు తొలగిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం ఏకంగా ఉపాధ్యాయులకు సంబంధం లేని అనేక కార్యక్రమాలను ఉపాధ్యాయుల చేత చేయించడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపించారు. దీని ఫలితంగా పాఠశాలల్లో బోధన కుంటుపడుతోందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియమించిన పిఆర్‌సి కమిటీ నిర్వీర్యం కావడంతో ప్రస్తుత ప్రభుత్వం వచ్చి 15 నెలలు పూర్తయినా ఇప్పటికీ పిఆర్‌సి కమిటీకి సంబంధించి ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. ప్రభుత్వం సత్వరం పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, నివేదిక వచ్చి అమలు జరిగేలోపు 29 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, జివి రమణలు మాట్లాడుతూ గత ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు నాలుగు విడతల కరవు భత్యం మంజూరు కాకుండా పెండింగ్‌లో వున్నదని, ఉద్యోగ,

ఉపాధ్యాయులకు ఎలాంటి ఆర్థికపరమైన అంశాలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుత మాట విస్మరించి ఉపాధ్యాయ సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ రూపాల్లో చెల్లించాల్సిన 26 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడానికి చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్‌నాయుడు, ఎస్.మణిగండన్‌లు, జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సహాఅధ్యక్షులు రెడ్డప్పనాయుడు, రెహానా బేగంలు, కోశాధికారి ప్రసన్నకుమార్, నాయకులు ఎస్‌పి భాషా, సిపి ప్రకాష్, కృష్ణమూర్తి, పంటపల్లి సురేష్, ఎం.పార్థసారధి, ఏకాంబరం, సరిత, బివి రమణ, పిసి బాబు, కె.శేఖర్, నిర్మల, యువరాణి, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పలమనేరులో ప్రారంభమైన ఈ రణభేరి బైక్ ర్యాలీ జాత చిత్తూరు నుండి నగరి వరకు సాగి అక్కడ ముగియనుంది.

# మామిడి రైతుకు కేజీకి రూ.12 చెల్లించాలి

## - మార్కెట్ యార్డు నుండి కలెక్టరేట్ వరకు రైతుల బైక్‌ర్యాలీ - కలెక్టరేట్ ఎదుట మామిడి రైతుల నిరసన

**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మామిడి సీజన్ ప్రారంభంలో మామిడి రైతుకు చెప్పినట్లు కేజీ మామిడిపై రూ.12 చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని మామిడి రైతులు డిమాండ్ చేశారు. మామిడి కేజీకి రూ.12 ధర చెల్లింపుపై సోమవారం మామిడి రైతులు కొంగారెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీజన్ ప్రారంభంలో ఇచ్చిన హామీ మేరకు మామిడి కేజీకి రూ.12 చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మామిడి రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మామిడి రైతులు మాట్లాడుతూ సీజన్ ప్రారంభంలో మామిడి కేజీపై రూ.12 చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు కేజీ మామిడిపై రూ.4 చెల్లిస్తే కేజీపై మిగిలిన రూ.8 ఫ్యాక్టరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు చెల్లించాల్సి వుందన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం చెప్పిన మేరకు మామిడి రైతులకు సబ్సిడీ ధర కేజీపై రూ.4 చెల్లించడానికి సిద్ధమైందన్నారు. ఫ్యాక్టరీలు సైతం మామిడి రైతుకు న్యాయపరమైన ధర చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీలు సైతం మామిడి కేజీపై రైతుకు రూ.8 చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఒకొక్క ఫ్యాక్టరీ ఒకొక్క ధరతో మామిడి రైతులకు చెల్లింపులు చేయడానికి సిద్ధం అవుతున్నాయన్నారు. అలా కాకుండా జిల్లాలోని ప్రతి ఒక్క ఫ్యాక్టరీ మామిడి రైతుకు కేజీపై రూ.8 కచ్చితంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలు కేజీపై రూ.8 చెల్లించకుంటే మామిడి రైతులు అక్టోబర్ నెల నుండి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం మామిడి సంక్షేమ సంఘ నాయకులు జనార్ధన్, ఎ.హరిబాబుచౌదరిలు, సిమునీశ్వర్‌రెడ్డి, ఎ.రామానాయుడు, హేమలత, చిత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, మునిరత్నంనాయుడు, బెల్లంకొండ శ్రీనివాసులు, లవకుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి, సందీప్, భారతి, త్యాగరాజులురెడ్డి, పెద్ద ఎత్తున మామిడి రైతులు పాల్గొన్నారు. మామిడి కేజీకి రూ.12 చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్ విద్యాధరిని కలిసి వినతిపత్రం అందించడానికి వెళ్ళిన సమయంలో అక్కడ మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మామిడి రైతులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. మామిడి రైతులకు తమకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కేజీ మామిడిపై రూ.12 చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని కోరగా, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు జోక్యం చేసుకుని జిల్లాలోని మూడు ఫ్యాక్టరీలు కేజీపై రూ.6 చెల్లించడానికి సిద్ధంగా వున్నాయని చెప్పారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మామిడి రైతులు జాయింట్ కలెక్టర్ ఎదుటే మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులుతో వాగ్వివాదంకు దిగారు.



# ప్రజా ప్రయోజనమే కలెక్టర్ల అంతిమ లక్ష్యం కావాలి : మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాత వార్తప్రతి నిధి:** ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల సంతృప్తి శాతం పెరిగేలా జిల్లా కలెక్టర్లు, అధికారులు పనిచేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలు వినూత్నంగా ఉంటాయని, ఆయన ఆలోచనలు ఎంతో ముందుచూపుతో ఉంటాయన్నారు. ఆయన ఆలోచనలు, ఆకాంక్షలను ప్రజలవద్దకు చేర్చి, అవి ప్రతిఫలించేలా కృషి చేయడంలో జిల్లా కలెక్టర్లదే ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పథకాలు జిల్లాల్లో సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కూడా కలెక్టర్లేదనని, పథకాల అమలులో ప్రజా సంతృప్తి స్థాయి పెరిగేలా కృషి చేయాలన్నారు. గతంలో ప్రణాళిక శాఖ అంటే కేవలం ఏదో గణాంకా నమోదుకు మాత్రమే పరిమితమైన శాఖగా ఉండేదని, ఇప్పుడు ఆ శాఖను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఆ శాఖను ఎంతో కీలకమైన శాఖగా మార్చారన్నారు.

## జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ 2025లో 3 బంగారు పతకాలు కైవసం చేసుకున్న నారాయణ విద్యార్థులు

**హైదరాబాద్,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:** భారత రెజ్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) ఛాంపియన్ షిప్ 2025లో నారాయణ విద్యార్థులు 3 బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయిలో సత్తాచాటారు. ఆయుష్ ఠాకూర్ , వైష్ణవి ఠాకూర్ అనే ఇద్దరు ప్రతిభావంతులైన నారాయణ విద్యార్థులు తమ నైపుణ్యం, కృషి, పట్టుదలతో జాతీయస్థాయిలో తమ విజయకేతనాన్ని ఎగురవేశారు. ఆయుష్ ఠాకూర్ యు11 విభాగంలో పోటీ పడి, రెండు బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఒకటి జి ఐ విభాగంలో (కిమోనో వంటి ప్రత్యేక డ్రస్‌అదే శైలి) మరియు మరొకటి న్నోబి విభాగంలో నేరుగా పట్టీలు, మార్పులతో జరిగే శైలి) వైష్ణవి ఠాకూర్, యు15 విభాగంలో బి। ఈవెంట్‌లోబంగారు పతకం సాధించారు. ఈ విజయాలు విద్యార్థుల పట్టుదలనే కాకుండా నారాయణ విద్యాసంస్థల సమగ్ర సహకారానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. చదువులో ఎటువంటి లోటు లేకుండా ఉండేందుకు, వారికి ప్రత్యేక తరగతులు, మార్గదర్శనం అందజేయడం ద్వారా నారాయణ తన బహుముఖ ప్రతిభా అభివృద్ధికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించింది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డా పి. సింధూర నారాయణ మాట్లాడుతూ "పట్టుదల, సరైన మార్గదర్శకత్వం.. అవకాశాలు కలిసి వచ్చినప్పుడు యువ ప్రతిభావంతులు ఎలాంటి సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కొనగలరన్నారు. వైష్ణవి, ఆయుష్ విజయాలు మనకు వాటినే గుర్తు చేస్తున్నాయని వారి విజయం సహ విద్యార్థులకు ప్రేరణగా నిలిచే కాకుండా, నారాయణ నాలుగు దశాబ్దాలుగా పాటిస్తున్న విలువలు, శ్రేష్టతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు .నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి నారాయణ మాట్లాడుతూ ఆయుష్ ఠాకూర్, వ వైష్ణవి ఠాకూర్లకు ముందుగా అభినందనలు తెలిపారు. వారు సాధించిన ఘన విజయాలను గౌరవిస్తూ నారాయణ పాఠశాలలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా వారి క్రీడాప్రతిభను ప్రోత్సహించడం, వారిని మరింత ప్రేరేపించడం, ఇతర విద్యార్థులను కూడా కలలు కనడానికి ఉత్సాహపరచడం నారాయణ విద్యాసంస్థల లక్ష్యమన్నారు. 46 ఏళ్ల విజయవంతమైన వారసత్వంతో, నారాయణ విద్యాసంస్థల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, ప్రతి విద్యార్థి క్రీడా కలలను, విద్యా లక్ష్యాలను నెరవేర్చడానికి అంకితభావంతో కొనసాగుతున్నాయి. "మీ కలలే మా కలలు" అనేది నారాయణ నినాదమన్నారు.



# అనంతలో ఆర్డిటి లబ్ధిదారుల ఆందోళన

## - వేల సంఖ్యలో కదలి వచ్చి కలెక్టరేట్ ముట్టడి - జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన

**అనంతపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లా కేంద్రంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి)కి ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా కేంద్రం హోంశాఖ మొండికేసిందనే ఆక్రోశంతో వేల సంఖ్యలో లబ్దిదారులు సోమవారం అనంతపురంకి తరలివచ్చారు. చిన్నా, పెద్ద, ముసలి, ముతక అన్న తేడా లేకుండా ఆర్డిటి లబ్దిదారులు పెద్దఎత్తున చీమ పుట్టల్లా కదలి వచ్చి అనంతపురం వీధుల్లో ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. సేవ్ ఆర్డిటి పేరుతో ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, పాల్గొనడం ఒక ఎత్తైతే, పిడికలు బిగించి ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను ఇవ్వాల్సిందే అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్, అక్కడక్కడ తరలివచ్చిన వాహనాలను పోలీసులు అడ్డుకునేందుకు యత్నించగా లబ్దిదారులు ప్రతిఘటించడంతో చేసేది లేక పోలీసులు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. జెఎసి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదిన కూడా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ సంఘాలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేశారు. రెండవ విడుతగా సోమవారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ఆర్డిటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం పొందిన లబ్దిదారులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న కాలేజీ గ్రౌండ్‌లోకి లబ్దిదారులంతా చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. ర్యాలీలో పెద్ద ఎత్తున కళాకారులు కూడా డప్పులు వాయిస్తూ తప్పెట్లు కొడుతూ, ఉరుములు వాయిస్తూ ఆందోళన కారులను ఉత్సాహ పరిచారు. గొరవయ్యలు కూడా పాల్గొన్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో కలెక్టరేట్ వద్దకు చేరుకుని గంటల తరబడి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ విగ్రహం వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేసి కలెక్టరేట్ కార్యాలయంకు చేరుకున్నారు. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ పునరుద్దరించే విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుకుంటే పని అవుతుందని ఎన్డీఏ ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చి ఆర్డిటి ప్రజలకు సేవ చేసే విధంగా తోడ్పడాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాలోనే కాకుండా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో వెనుకబడిన జిల్లాల్లో విస్తృతంగా సేవలు అందిస్తున్న ఆర్డిటిని రక్షించుకుంటామని పలు ప్రజా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ బిసి సంఘాల నాయకులు వెల్లడించారు. ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ నిలుపుదల చేయడంతో భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోతాయని, ఆర్డిటి సంస్థ ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా స్పందించడం లేదని, పరిస్థితి ఇలాగె కొనసాగితే ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని, జెఎసి నాయకులు హెచ్చరించారు. ఆర్డిటి సంస్థను విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించగా ఆ సంస్థ దశల వారీగా విస్తరించి లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆర్డిటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బడుగు బలహీన వర్గాలకు ఎంతో న్యాయం జరిగిందని జేఎసి నాయకులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో ఆణిముత్యాలను తయారు చేసేందుకు ఆర్డిటి ఎంతో కృషి చేస్తోందని, అనంతపురంలో క్రికెట్ స్టేడియం నిర్మించడంతో దేశ, విదేశాల నుంచి శిక్షకులను రప్పించి ఫుట్‌బాల్, వాలీబాల్, హాకీ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తోందని దేశంలో ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీ పడే విధంగా ఆర్డిటి చర్యలు తీసుకుంటోందన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న విన్సెంట్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

# బిసి యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు : మంత్రి సవిత

## సత్ఫలితాలిచ్చిన మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** వ బీసీ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న సత్ఫలితాలిస్తున్నాయి. వివిధ పోటీ పరీక్షల నిమిత్తం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ, సివిల్స్ కోచింగ్ ను వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం శిక్షణ అందజేసింది. ఈ శిక్షణతో తాజాగా నిర్వహించిన డీఎస్సీ సహా పలు ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలో బీసీ నిరుద్యోగ అభ్యర్థులు సత్తా చాటారు. కూటమి ప్రభుత్వం అందజేసిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ, 241 మంది టీచర్ పోస్టులు సాధించగా, బ్యాంకు, పోలీసు సహా ఇతర ప్రభుత్వ పోస్టులను కూడా బీసీ అభ్యర్థులు సాధించారు. 2024 జూన్ లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలకు వెన్నుదన్నుగా నిలిచింది. ముఖ్యంగా బీసీ యువతను ఉన్నత స్థానాల్లో నిలపాలన్న లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా మెగా డీఎస్సీ, సివిల్స్ సర్వీసెస్ కు ఉచిత కోచింగ్ అందజేసింది. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణ చేపట్టింది. అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను బీసీ నిరుద్యోగ యువత సాధించాలన్న లక్ష్యంతో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించింది. జిల్లా కేంద్రానికి సుదూరంలో ఉండే మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకునే వారి సౌలభ్యం కోసం ఆన్ లైన్ ద్వారా కూడా ఉచిత డీఎస్సీ శిక్షణ అందజేసింది. ఇలా ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా 6,470 మందికి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా మెగా డీఎస్సీ సన్నద్ధతకు ఉచిత శిక్షణ అందజేశారు. సివిల్ సర్వీసెస్ కు కూడా 83 మంది బీసీ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణ అందజేసింది. రాష్ట్ర స్థాయిలో విజయవాడలోని గొల్లపూడి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచిత శిక్షణ అందజేసింది. బీసీ యువత అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న సంకల్పంతో నిర్వహించిన ఉచిత డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ శిక్షణ ఎంతో దోహదం చేసింది. బీసీ స్టడీ సర్కిళ్ల ఉచిత శిక్షణ కేంద్రాల ద్వారా 1,674 మందికి, ఆన్ లైన్ లో ద్వారా మరో 4,774 మందికి.. మొత్తం 6,470 మందికి ఉచిత శిక్షణ డీఎస్సీ శిక్షణ అందజేశారు. వారిలో 241 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారు. కర్నూల్ నుంచి 36, అనకాపల్లి నుంచి 40, నెల్లూరు నుంచి 17, కృష్ణా నుంచి 10 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారు. ఈస్ట్ గోదావరి నుంచి ఆరుగురు, చిత్తూరు నుంచి ఎనిమిది, పల్నాడు నుంచి ముగ్గురు, కడప నుంచి 12 మంది ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. పార్వతీపురం మన్యం,బాపట్ల, నంద్యాల నుంచి ఒక్కొక్కరు, అనంతపురం, ఏలూరు, శ్రీకాకుళం నుంచి ఏడుగురు చొప్పున, అన్నమయ్య, కోనసీమ నుంచి ముగ్గురు చొప్పున టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. గుంటూరు నుంచి 12 మంది, కాకినాడ నుంచి నలుగురు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఆరుగురు, ప్రకాశం నుంచి ఎనిమిది మంది గురువులుగా ఎంపికయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి ఇద్దరు, తిరుపతి నుంచి 13 మంది, విశాఖపట్నం నుంచి అయిదుగురు, విజయనగరం నుంచి 14 మంది, వెస్ట్ గోదావరి 12 మంది బీసీ అభ్యర్థులుగా టీచర్లగా బాధ్యతలు చేపట్టనున్నారు. మెగా డీస్సీతో పాటు సివిల్ సర్వీసెస్ కోచింగ్ కూటమి ప్రభుత్వం అందజేసింది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ కోచింగ్ వల్ల కూడా బీసీ నిరుద్యోగ యువత ఎంతో లబ్ధిపొందింది. కేవలం అయిదు నెలల పాటు సాగిన ఈ కోచింగ్ వల్ల గ్రూప్ 2 మెయిన్స్ కు 12 మంది, ఆర్.ఆర్.బి లెవల్ 1కు పది మంది, ఎఫ్.ఆర్.వో ప్రిలిమ్స్ కు ఇద్దరు, మెయిన్ కు ఒకరు అర్హత సాధించారు. ఆరుగురు అభ్యర్థులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు.

# టూరిజంపై 2029 నాటికి పెట్టుబడి.. 50,000 కోట్లు. 3 లక్షల ఉద్యోగాల లక్ష్యం : టూరిజం శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యాటక రంగం 2025-26 మొదటి త్రైమాసిక లక్ష్యాలను 22.14 శాతం సాధించి 10.70 వృద్ధిని కొనసాగించిందని ప్రధాన కార్యదర్శి పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ల్లుల సదస్సులో ఆయన మాట్లాడారు.. సేవల రంగం ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీలో అత్యధిక వాటా కలిగి ఉందని ఆయన గుర్తు చేశారు. 202526కి ..7,10,714 కోట్ల విలువైన సేవా రంగం పలు విభాగాలలో స్థిరమైన పనితీరు చూపింది. కమ్యూనికేషన్స్ 25.90 లక్ష్యాన్ని సాధించి అత్యధిక పనితీరుతో నిలిచింది, అయితే ట్రేడ్, హోటల్ మరియు రెస్టారెంట్ల రంగం ..25,702 కోట్ల జీవీఏతో 17.92 అసాధారణ వృద్ధిని నమోదు చేసింది.రూ.22,150 కోట్లుగా అంచనా వేయబడిన రవాణా రంగం 8.67శాతం స్థిరమైన వృద్ధిని చూపింది. టూరిస్టుల తాకిడి 6.89 కోట్ల నుండి 8.07 కోట్లకు (17.08 శాతం వృద్ధి), వాహనాల రిజిస్ట్రేషన్లు 25,487 నుండి 27,337కు (7.26శాతం వృద్ధి),విమాన ప్రయాణికుల సంఖ్య 13.09 లక్షల నుండి 15.85 లక్షలకు (21.1 శాతం వృద్ధి) పెరుగడం దీనికి కారణంగా వివరించారు.2029 నాటికి రూ.50,000 కోట్ల టూరిజం పెట్టుబడి మరియు 3 లక్షల ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. విశాఖపట్నం నుండి పుదుచ్చేరి వరకు కార్డేలియా క్రూజ్, ట్యాండా మరియు అరకులో టెంట్ సిటీలు, విజాగ్‌లో 14 ఆకర్షణలను కవర్ చేసే హాప్‌ఆన్ హాప్‌ఆఫ్ బస్సులు, మరియు 150 క్యారవాన్లతో 25 క్యారవాన్ పార్కులువంటి కొత్త కార్యక్రమాలను విజయవంతంగా ప్రారంభించింది .. రాష్ట్రం టూరిజం శాఖకు 3,212 ఎకరాలను బదిలీ చేసింది, 750 ఎకరాలు ప్రాసెస్‌లో ఉన్నాయి. జిల్లా కలెక్టర్లు తిరుపతిలో (120 ఎకరాలు) మరియు విశాఖపట్నంలో (50 ఎకరాలు) వ్యూహాత్మక భూమిని గుర్తించారు.

# విద్యుత్ రంగంలో సుస్థిర అభివృద్ధి కోసం ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

**విజయవాడ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల కాలంలో అనేక నూతన విధానాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలు చేయడం ద్వారా రాష్ట్ర విద్యుత్ రంగం విశేష ప్రగతి సాధించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడుతూ, పెట్టుబడులను ప్రోత్సహిస్తూ నాణ్యమైన, నమ్మకమైన నిరంతరాయ విద్యుత్ ను , భవిష్యత్ అవసరాలకు సరిపడేలా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం విజయవాడలోని సీఎస్ క్యాంప్ కార్యాలయంలో ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన "ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రెండ్స్" అనే న్యూస్ లెటర్ ను సీఎస్ ఆవిష్కరించారఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించారు.

# నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు నగరూర్‌లో హాల్టింగ్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 15,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-నాందేడ్-బెంగళూరు మధ్య తిరిగే నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా కర్నూలు జిల్లాలోని నగరూర్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్/స్టాపింగ్ సదుపాయం కల్పించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి నాందేడ్ వెళ్లే నెంబర్ 16593 ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18నుంచి ప్రతి రోజు ఉదయం నగరూర్‌కు 06-59/07-00గంటలకు తిరుగు ప్రయాణంలో నాందేడ్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 16594ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19నుంచి ప్రతిరోజు రాత్రి 8-19/20గంటలకు నగరూర్ నుంచి బయలుదేరుతాయి.

గుంతకల్లు, ఆదోని, రైల్వే స్టేషన్లలో ఇరువైపులా రాకపోకల్లో ఎలాంటి మార్పుల్లేవు.

# పోలీసు సంస్కరణల ప్రాజెక్టుకు సైబరాబాద్, సంగారెడ్డి ఎంపిక

## రెండుచోట్ల పైలట్ ప్రాజెక్టుగా 30 పోలీసుస్టేషన్లలో అమలు

## ఐపిఎఫ్‌తో టి.పోలీసు ఎంఒయు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణలో పోలీసు సంస్కరణల అమలుకు సైబరాబాద్, సంగారెడ్డి జిల్లాలో 30 పోలీసు స్టేషన్లను ఎంపిక చేశారు. ఇందుకు గాను ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపిఎఫ్) ప్రతినిధులతో డిజిపి జితేందర్ సోమవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు గత ఆగస్టు నెలలో సర్కారు ఆమోదం తెలపగా దీనిని సోమవారం అధికారికంగా ఆమోదముద్ర వేశారు. ఐపిఎఫ్‌ను ఢిల్లీలో 2014లో మేఘాలయ మాజీ డిజిపి రామచంద్రన్ స్థాపించగా ఆ తరువాత దేశ వ్యాప్తంగా దీని విస్తరణ జరిగిందని డిజిపి జితేందర్ ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో పోలీసు సంస్కరణలను వేగంగా అమలు చేయడంతో పాటు, ప్రజలతో పోలీసు శాఖ మమేకం అవడంతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించడం, దీని లక్ష్యమని ఆయన తెలిపారు. ఐపిఎఫ్‌లో విశ్రాంత సీనియర్ ఐపిఎస్ అధికారులతో పాటు విద్యావేత్తలు, పరిశోధ కులు, బ్యూరోక్రాట్లు వుంటారని, వీరంతా ఒక బోర్డు కింద పనిచేస్తారని డిజిపి తెలిపారు. పోలీసు సంస్కరణల అమలు ద్వారా ప్రజలకు పోలీసుల పై మరింత విశ్వాసం పెరుగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే అమలవుతున్న మీ సేవ, క్యూఆర్ కోడ్ వ్యవస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం టి.సేఫ్ వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని ఆయన అన్నారు. పోలీసు సంస్కరణలకుగానూ సైబరాబాద్, సంగారెడ్డిలో 30 పోలీసు స్టేషన్లను ఎంపిక చేశామని ఆయన తెలిపారు. ఐపిఎఫ్ అధ్యక్షుడు విశ్రాంత డిజి ఓం ప్రకాష్ మాట్లాడుతూ పరి శోధన, సామర్థ్యాభివృద్ధి, విధాన రూపకల్పన ద్వారా పోలీసింగ్‌ను మెరుగు పరచడం తమ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఐపిఎఫ్ హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్‌లలో విభాగాలను ఏర్పాటు చేసినదని ఇప్పుడు తెలంగాణలో ఏర్పాటుచేయడం ఆయన తెలిపారు. ఐపిఎ ఫ్ ఉపాధ్యక్షుడు, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఈష్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా పౌరుల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడం, మహిళల భద్రత, ప్రజలు కోరుకున్నట్లుగా పోలీసింగ్ ఏర్పాటు, పోలీసుల కోసం మంచి వాతావరణ కల్పించడం ముఖ్యంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏడాది పాటు నిర్వహించిన తరువాత స్వతంత్ర సంస్థ ద్వారా పరిశీలన చేయిస్తామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలు కోసం పోలీసులకు శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, పర్సనల్ విభాగం అదనపు డిజి అనిల్ కుమార్, ఐపిఎఫ్ ప్రతినిధులు కోడె దుర్గా ప్రసాద్. శరత్ కుమార్, ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లకు రూ.1,435 కోట్ల చెల్లింపులు

### గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారం భమైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ.1,435 కోట్లను లబ్ధిదారులకు అంద చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.15 లక్షల ఇళ్ల పనులు ప్రారంభం కాగా, 1.29 లక్షల ఇళ్ల పనులు పురోగతిలో ఉన్నాయని, వాటిలో సుమారు 20 వేల ఇళ్ల గోడలు, 8633 ఇళ్ల రూఫ్ పూర్తి అయ్యాయని ఎండి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణం పూర్తయిన ఇళ్లకు గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని బట్టి, ప్రతి సోమవారం లబ్ధిదారులకు ఆధార్ నెంబర్ ఆధారంగా నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా సోమవారం 13,841 మంది లబ్ధిదారులకు రూ. 146.30 కోట్లను విడుదల చేశామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# వైద్యవిద్యార్థుల సమస్యలను తీర్చడంలో ముందుంటాం

### నీట్స్ పేరంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణచారి

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వైద్య విద్యార్థుల సమస్యలను తీర్చడంలో ముందంజలో ఉంటామని నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్య క్షులు సత్యనారాయణ చారి అన్నారు.సోమవారం నాగోల్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. సత్యనారాయణ చారి మాట్లాడుతూ పేరెంట్స్ అసోసియేషన్ భవిష్యత్తులో చేయవలసిన కార్యక్రమాల గూర్చి కులం కుశంగా చర్చించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ చారి మాట్లాడుతూ..ఈ అసోసియేషన్ అతి త్వరలో రిజిస్ట్రేషన్ చేయాలను కుంటున్నామన్నారు. వైద్య విద్యార్థుల అడ్మిషన్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన సంప్రదించడానికి ప్రతి జిల్లాలో సైతం మన సభ్యులు ఉంటారని వెల్లడించారు.గతంలో మనం చేసిన ఉద్యమం ద్వారా నాలుగు నుంచి ఐదు వందల మందికి స్థానిక విద్యార్థులకు మెడికల్ సీట్లు కల్పించడంలో ఈ ఉద్యమం తోడ్పడిందని ఆయన వెల్లడించారు. అనంతరం ప్రధాన కార్య దర్శి పొడిశెట్టి రమేష్ మాట్లాడుతూ జీవో 33 అమలు కోసం ప్రారంభమైన మన పోరాటం జీవో 150 గా ప్రభుత్వ మార్చడం దానిని పకడ్బందీగా అమలు చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. యూనివర్సిటీ వెల్లడించిన మెరిట్ లిస్టులో దాదాపు 1,000 మందికి పైగా స్థానికేతలను గుర్తించి వారి సర్టిఫికెట్లను పరిశీలించి కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ అనర్హులుగా ప్రకటించడం జరిగిందన్నారు.ఇలా చేయడం వల్ల దాదాపు 400 మంది పైగా స్థానికులకు మెడికల్ సీట్లు కల్పించడంలో ఉపయోగపడిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు భవిష్యత్తులో అసోసియేషన్ చేయాల్సిన కార్యక్రమాల కోసం తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి కసరత్తు

### దక్షిణాది రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానం అమలు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో అంగన్వాడీల్లో 15,274 ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు గుర్తించిన ప్రభుత్వం నియామక విధానంలో మార్పులపై దృష్టిసారించింది. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత కారణంగా పోషకాహారం పంపిణీ, పూర్వప్రాథమిక విద్య వంటి కీలక సేవలు సక్రమంగా అందడం లేదు. సహాయకులు లేకపోవడంతో పోషకాహారం అందించడంలో సమస్యలు, అలాగే టీచర్లులేని చోట విద్యార్థులకు ప్రాథమిక విద్య అందడం కష్టంగా మారుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అంగన్వాడీల్లో ఖాళీల వివరాలను సేకరించి మొత్తం 15,274 ఖాళీలు ఉన్నట్లు గుర్తించింది.

ఇందులో టీచర్లు 2,999 ఖాళీలు ఉండగా, సహాయకులు 12,275 ఖాళీలు ఉన్నాయి. దీంతో వీటి నియామక విధానంలో మార్పులపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇందులోభాగంగా అంగన్వాడీ సిబ్బంది నియామకానికి దక్షిణాది రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను శిశు సంక్షేమ శాఖ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించింది. ఆయా రాష్ట్రాల్లో విద్యార్హతలు, ఎంపిక విధానంపై అధికారులు అధ్యయనం చేశారు. ఈ నివేదిక ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత నియామక విధానంలో మార్పులు తీసుకొచ్చే అవకాశం ఉంది.



చిరుతను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

# ఎట్టకేలకు చిక్కిన చిరుత

### వీడిన పాలమూరు వాసుల భయాందోళన

**మహబూబ్‌గర్ బ్యూరో, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** గత రెండు నెలలుగా మహబూబ్నగర్ పట్టణవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు అధికారులకు చిక్కింది. మూడు సార్లు టీడీ గుట్ట వద్ద పెద్ద రాయిపై కూర్చుని అటు, ఇటు చూస్తున్న దృశ్యాలను వీక్షించిన ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారు. రెండు రోజుల కింద టీడీగుట్టపై మళ్లీ కనిపించడందో స్థానికులు భయాందోళన చెందారు. ఎప్పుడు తమవైపునకు వస్తుందో, ఏ రాత్రి ఇండ్లపై దాడి చేస్తుందో అని.. అయితే అధికారుల ప్రత్యేక చొరవతో డ్రోన్లు, సీసీ కెమెరాలు, బోన్ల సాయంతో, వనపర్తి జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలను రప్పించి తీసుకున్న చర్యలు ఫలించాయి. మహబూబ్ నగర్ జిల్లా వీరన్నపేట, టి.డి. గుట్ట ప్రాంతంలో గత కొన్ని రోజులుగా కనిపిస్తున్న చిరుతను సోమవారం ఉదయం విజయవంతంగా అటవీ శాఖ అధికారులు పట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు.సోమవారం పట్టుకున్న చిరుతను జిల్లా అటవీ అధికారి కార్యాలయం లో జిల్లా కలెక్టర్ పరిశీలించి అటవీ సిబ్బందిని అభినందించారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ ఉదయం సుమారు 7:30 గంటలకు ట్రాప్ కేజ్లో చిక్కిన ఈ ఆడ చిరుతను, ఫీల్డ్ డ్యూటీలో ఉన్న సిబ్బంది ఉదయం 10:30 గంటలకు గుర్తించారు. వెంటనే ప్రాంతాన్ని చుట్టుముట్టి భద్రత కల్పించి, స్థానిక ప్రజల రాకపోకలు నిలిపివేసి, పోలీసుల సహకారంతో ప్రాంతాన్ని సురక్షితం చేశారు. వెటర్నరీ వైద్యుడిని పిలిపించి చిరుతను పరిశీలించగా, కేజ్లో తన్నుకోవడం వలన స్వల్ప గాయాలు ఉన్నట్లు గుర్తించారు.ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు సిబ్బంది ట్రాక్టర్ సహాయంతో కేజ్ ను కొండపై నుంచి కిందికి తీసుకువచ్చి, మధ్యాహ్నం 2:30 గంటలకు డీసీఎం వాహనంలో ఎక్కించి నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్కు సురక్షితంగా తరలించారని తెలిపారు. అక్కడ చిరుతకు వైద్య చికిత్స కల్పించి దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతంలో చిరుతను వదిలి వేస్తారని ఆయన వెల్లడించారు.

# మరో రూ.35 వేల కోట్ల రుణం

### రిజర్వ్ బ్యాంక్ అనుమతి కోసం సర్కార్

### రూ.2,34,500 కోట్లకు చేరిన అప్పు

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** రుణాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెం చేందుకు రాష్ట్ర సర్కార్ సిద్ధమైంది. ఇందు కోసం రూ.35వేల కోట్ల మేర రుణాలను తీసుకోవాలని నిర్ణయించింది. ఈ రుణం నిమిత్తం రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పెట్టి వాటికి అందుకు అనుమతి కోరింది. ఈ రుణంలో యంగ్ ఇండియా స్కూల్స్ కోసం 35వేల కోట్లు ఖర్చు చేయనుంది. వెయ్యి కోట్లను సాధారణ ఖర్చుల కోసం, మూసీ సుందరీకరణ కోసం 4వేల 100 కోట్లు కావాలని ఈ ప్రతిపాదనల్లో పేర్కొంది. అలాగే యంగ్ ఇండియా స్కూల్స్ కోసం 30వేల కోట్లు కావాలని ఆర్బీఐ దృష్టికి తీసుకెళ్లింది. ఈ కొత్త అప్పుతో ఇప్పటివరకు కాంగ్రెస్ సర్కార్ చేసిన అప్పు 2లక్షల 34వేల 500 కోట్లకు చేరింది. రేవంత్ సర్కార్ 21 నెలల్లోనే అప్పు ఇంతకు చేరుతోంది. జూలై 31 నాటికి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలు రూ.24,669.88 కోట్లుగా ఉండగా, వార్షిక అంచనా బడ్జెట్‌లో మొత్తం రూ.54 వేల కోట్లు సేకరించనున్నట్లు పేర్కొంది. కాగా రోజు రోజుకు సర్కార్ ఖజానాకు ఆదాయం తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరులైన జీఎస్టీ, ల్యాండ్ రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, సేల్ టాక్స్, ఎక్సైజ్ ఆదాయం గడిచిన నాలుగు నెలల్లో పెరగకపోగా తగ్గుతూ వస్తుండటం సర్కార్‌కు మరింత గుదిబండగా మారింది.

గతేడాది కంటే ఈ ఏడాది జీఎస్టీలో 3శాతం, సేల్స్ ట్యాక్స్‌లో 2శాతం, స్టేట్ ఎక్సైజ్ పన్నులో 2.50 శాతం, ల్యాండ్ రెవెన్యూ ఆదాయం 2.3 శాతం తగ్గింది. మరోవైపు అప్పులు మాత్రం ఈ నాలుగు నెలల్లో 45 శాతం రుణాలు చేసింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలలకు రాష్ట్ర ఖజానాకు 74,955 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రుణాలు రూ.24,670 కోట్లు తీసుకుంది. ఇక రుణాల నిమిత్తం వడ్డీ చెల్లింపుల కింద రూ.9,355 కోట్లు ఖర్చు చేసింది. ప్రభుత్వం జూలై నాటికి రూ.68,823 కోట్లు లేదా వార్షిక కేటాయింపులో 26.1 శాతం ఖర్చు చేసింది. రెవెన్యూ వ్యయం ఒక్కటే రూ.62,835 కోట్లు ఖర్చయింది.

జీతాలు, పెన్షన్లు, సబ్సిడీలు మరియు వడ్డీ చెల్లింపుల ద్వారా ఇది జరిగింది. రూ.36,504.45 కోట్ల వార్షిక లక్ష్యంలో 16.4 శాతం అంటే రూ.5,988 కోట్ల మాత్రమే ఉన్న పేలవమైన మూలధన వ్యయం ఆందోళనకరంగానే ఉంది. గత ఏడాది ఇదే కాలానికి 22.77 శాతంగా ఉన్న రాష్ట్రం, ఇప్పటివరకు రుణాలు మరియు అప్పులు వార్షిక రుణ పరిమితిలో 45.7 శాతానికి చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి పనుల కోసం మరో 35 వేల కోట్ల రూపాయల మేర రుణం చేయాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పాడ్డాయి.

# ‘సెప్టెంబర్17’ పై బిజెపి కల్లబొల్లి మాటలు కట్టిపెట్టాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణ గవర్నర్ బిజెపికి చప్రాసి మాదిరిగా వ్యహరిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచ లన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో సెప్టెంబర్ 17న బిజెపి సర్కార్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారి కంగా జరపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సెప్టెంబర్ 17 గురించి తెలంగాణ ప్రజలకు బిజెపి నేతలు వక్ర భాష్యం చెబుతున్నారని మండిపడ్డారు. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో రాజాకార్లకు వ్యతిరేకంగా ప్రాణాలకు ఎదురొడ్డి పోరాడింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు.రాష్ట్ర బిజెపినేతలు ఏది చెబితే రాష్ట్ర గవర్నర్ అందుకు తలాడిస్తున్నాడని నారాయణ కామెంట్ చేశారు.ప్రతి ఏటా సెప్టెంబర్ 17 రాగానే హడావుడి చేయడం వారికి పరిపాటిగా మారిందన్నారు.ఏనాడైనా ప్రజలకు అండగా ఉండి పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు.1925లో సీపీఐ పార్టీ, ఆర్ఎస్ఎస్ పుట్టాయని..భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఏ ఒక్క ఆర్ఎస్ఎస్ కార్యకర్త పాల్గొనలేదన్నారు. బ్రిటీష్ లాఠీ,బుల్లెట్ దెబ్బలు వారికి తగలేదని అన్నారు. 4,500 మంది కమ్యూనిస్టులు దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలర్పించారని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర బిజెపి నేతలు సెప్టెంబర్ 17పై కల్లబొల్లి మాటలు బంద్ చేయాలని నారాయణ హితవు పలికారు.



# జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం

### అక్రెడిటేషన్ విధానంపై కార్యాచరణ ప్రణాళిక

### జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవిగుప్తా, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐఅండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్ఒ జి.మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహిం చారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రెడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్‌ల హెల్త్‌పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాతూ జర్న లిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీచర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హైపవర్ కమిటీని కూడా పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జిఒ జారీ చేసిందని, తెలంగాణ ఏర్పడ్డాక ఆ ఊసే ఎత్తలేదన్నారు. అలాగే, జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించా మని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రెడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు.

జర్నలిస్టులకు అవార్డులను పునరు ద్ధరించాలన్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సి.ఇ.ఓ. ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నదీపరీవాహక ప్రాంతం మూడు భాగాలుగా అధ్యయనం

### డబ్ల్యుఐఐ డీన్ రుచిబదోలా

**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** గోదావరి పరివాహక ప్రాంతాన్ని మూడు భాగాలుగా అధ్యయనం చేశామని మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్రతో పోలిస్తే తెలంగాణలో గోదావరి తక్కువ కాలుష్యానికి గురైందని డబ్ల్యుఐఐ (వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) డీన్ డాక్టర్ రుచిబదోలా అన్నారు. సోమవారం వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యుఐఐ) ఆధ్వర్యంలో ఒక ప్రైవేట్ హోటల్లో సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ భారతదేశంలోని నదుల పర్యావరణ పరిస్థితులను అంచనా వేసి వాటి సంరక్షణ కోసం సరైన ప్రణాళికలు అమలు చేయడానికి మొత్తం 7 నదులను ఎంపిక చేసినట్ల తెలిపారు.నదుల్లో ఇసుక క్వారీల నియంత్రణ సరైన విధంగా అమలు కావడంలేదని, మితిమీరిన ఇసుక తవ్వకాల వల్ల భవిష్యత్తులో ఆనకట్టలు, వంతెనలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు.అలాగే, నదీ జలాల పక్కన నీటిని శుద్ధి చేసి చెట్లు, గడ్డి జాతుల మొక్కలు నాటాలని సూచించారు. సుమారు 25 ఏళ్ల క్రితం భారతదేశంలోని నదులు, చెరువుల్లో విదేశీ జాతుల చేప పిల్లలను (ప్రధానంగా ఆఫ్రికన్ జాతి) విడిచారని, ప్రస్తుతం అవి స్థానిక భారతీయ చేపల కంటే ఎక్కువగా విస్తరించినట్లు గుర్తించామని తెలిపారు.ముఖ్యంగా కార్ప్ టిలాపియా అనే చేపలు దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు.


వలల వాడకం విషయంలో కూడా ప్రత్యేక దృష్టి అవసరమని నిపుణులు సూచించారు. చిన్నవల్ల చేపలను కూడా పట్టే విధంగా వలలను ఉపయోగించడం వల్ల స్థానిక జాతుల పెంపకం దెబ్బతింటుందని, ఇది భవిష్యత్తులో చేపల జనాభా తగ్గిపోవడానికి దారి తీస్తుందని హెచ్చరించారు. అందువల్ల మత్స్యకారులు శాస్త్రీయ పద్ధతిలో వలలను వాడాలని, చిన్న చేపలకు పెరుగుదలకు అవకాశం ఇవ్వాలని సూచించారు.గోదావరి పరివాహక ప్రాంతంలోని పర్యావరణ పరిస్థితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా మాత్రమే నది జీవవ్యవస్థను కాపాడగలమని,రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతోసమన్వయం చేసుకొని సంరక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో అటవీ దళాల ప్రధాన సంరక్షిణాధికారిణి డాక్టర్ సువర్ణ జియోలాజిక్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్ట్ పాండి,పిసిబి నుంచి డాక్టర్ ప్రసాద్,గోదావరి రివర్ మేనేజింగ్ బోర్డ్ మెంబెర్(టెక్నికల్) ఇరిగేషన్, సిసిఎంబి చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఉమాపతి, సిసిఎంబి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కార్తికేయన్, బయో డైవర్సిటీ నుంచి శిల్పి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 21 యేళ్ల జైలు

### నల్గొండ న్యాయస్థానం సంచలన తీర్పు!

### బాలికకు రూ.10 లక్షల పరిహారం

**చిట్యాల రూరల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు దోమల రాములుకు 21 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ నల్గొండ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి రోజా రమణి సోమవారం తీర్పు చెప్పారు. పరిహారం కింద బాలికకు రూ.10 లక్షలు చెల్లించా లంటూ న్యాయమూర్తి తన తీర్పులో ఆదేశించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన దోమల రాములు 2018 ఫిబ్రవరి 1న మద్యం మత్తులో ఆగ్రామంలోని ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. ఇంట్లో ఒంటరిగా ఉండి టీవీ చూస్తున్న ఎనిమిదేళ్ల బాలికను బెదిరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా తండ్రి ఫిబ్రవరి 11న చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాములుపై పోక్సో కేసు నమోదు చేసి కె. భాస్కర్ రెడ్డి, డి. సైదాబాబు, కె. పాండురంగారెడ్డి దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. ఈకేసు ఎనిమిదేళ్లుగా నల్గొండ జిల్లా పోక్సో న్యాయస్థానంలో విచారణ కొనసాగింది. సుదీర్ఘ విచారణ అనంతరం 2025 సెప్టెంబర్ 15న (నేడు సోమవారం) నేరం రుజువు కావడంతో న్యాయస్థానం నిందితుడికి పైవిధంగా శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ వాదించారు. న్యాయ సలహాదారుగా భరోసా కేంద్రం లీగల్ ఆఫీసర్ మామిడి కల్పన వ్యవహరించారు.



జూబ్లీహిల్స్ నియోజక వర్గం వెంగళరావునగర్ డివిజన్ బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి కెటిఆర్


# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలి: మాజీమంత్రి కెటిఆర్

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపునకు బూత్ స్థాయి నుంచి కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని వెంగళరావునగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశంలో దివంగత ఎమ్మెల్యే సతీమణి మాగంటి సునీత గోపినాథ్‌తో పాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే వెంగళరావునగర్ నగర్ డివిజన్ ఇన్‌చార్జ్ సుధీర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ జూబ్లిహిల్స్ విజయంతోనే గోపినాథ్‌కు ఘన నివాళి అన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దే అని అన్నారు. రేవంత్ ప్రభుత్వం ఫీజు రియింబర్స్మెంటు విషయంలో విద్యార్థులను మోసం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అధికారంలోకి రాగానే 20వేలకోట్ల ఫీజు రియింబర్సుమెంటు అందించామని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలకు ఉద్యోగ జీతాలకు డబ్బులు పూర్తిగా ఖర్చు అవుతున్నాయని ఫీజు రియింబర్సుమెంటుకు డబ్బులు లేవని ఉపముఖ్యమంత్రి చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని అందుకు నిదర్శనగా మిరియాలగూడ ఎమ్మెల్యే గన్‌మాన్ ఏకంగా లారీ యూరియాను అక్రమంగా ఎత్తుకెళ్ళిపోయాడని గన్‌మానే యూరియా ఎత్తుకుపోతే ఎమ్మెల్యే ఎంత ఎత్తుకుని పోయాడో అన్నారు. దోపిడీలకు బ్రాండ్ అంబాజిడర్‌గా కాంంగ్రెస్ పనిచేస్తుందన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

### ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ నిర్ణయానికి మద్దతు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్లు కాలేజీలు బంద్‌కు బిజెపి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాలేజీలకు భారీగా బకాయిలు పెరగడంతో, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఎదురయ్యాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు తాత్కాలికంగా మూసివేయాల్సిన పరిస్థితికి వచ్చాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ చర్య వల్ల ఏర్పడిన పరిస్థితి అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు పైగా ఉన్నప్పటికీ, రెండేళ్లుగా ఒక్క పైసా కూడా విడుదల చేయడం లేదని, ఫీజు రీయిం బర్స్‌మెంట్ లేకపోవ డంతో ప్రైవేట్ కాలేజీలు ప్రొఫెసర్లు, లెక్చరర్స్, టీచర్లకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం గత ఆరు నెలలుగా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో మాట్లా డుతూ మేము త్వరలో పరిష్కారం చేస్తాం” అని చెప్పినా, ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టమైన నిర్ణయం గానీ పెండింగ్ బకాయిలు విడుదల చేయలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులు ఇస్తామని వాగ్దానం చేసింది. కానీ ఈ వాగ్దానం ఇప్పటి వరకు అమలుకావడం లేదన్నారు. విద్యా వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వం మీదే ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న వ్యవస్థ మరింత కూలిపోయే పరిస్థితికి లోనవుతుందని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 1000 కోట్లు నిధులు ఇస్తామని వాగ్దానం చేశారు. కానీ రాష్ట్రంలో పరిస్థితి రిటైర్డ్ టీచర్లకు పెన్షన్లు కూడా ఇవ్వని పరిస్థితి దాపురించింది. భారతీయ జనతా పార్టీ ప్రైవేట్ మేనేజ్మెంట్స్ తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా మద్దతు పలుకుతుందన్నారు. కొత్త యూనివర్సిటీలకు కనీసం భవన నిర్మాణాలు చేయకపోవడం సబబుకాదు. ఇప్పటికైనా అవసరమైన మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యా వ్యవస్థను కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కొత్త భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు.


# తెర

## కెరీర్ డైలమా



పూజా హెగ్డేకు సరైన హిట్ వచ్చి మూడేళ్లు దాటిపోయింది.. కమిటైన సినిమాలు ఆగిపోవడం.. విడుదలైన సినిమాలు ఆడకపోవడంతో అమ్మడి కెరీర్ డైలమాలో పడింది. టాలీవుడ్ పట్టించుకోకపోవడంతో తమిళం, హిందీపై ఫోకస్ చేస్తున్నారు పూజా. అక్కడుంచి ఆదరణ బాగానే ఉంది. అక్కడ కూడా పూజా నటించిన రెట్రో, కూలీ సినిమాలు అంచనాలు అందుకోలేదు. తమిళంలో బిజీగానే ఉన్నారు పూజా. విజయ్ జన నాయగన్ సినిమాతో పాటు కాంచన 4లో నటిస్తున్నారు. వీటితో కమ్ బ్యాక్ ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హిందీలోనూ ఆఫర్స్ వస్తున్నా. తెలుగులో మాత్రమే ఈమె కాస్త వెనకబడి ఉన్నారు. తాజాగా ఆ లోటు కూడా తీరిపోయింది. ఇక్కడ దుల్కర్ సల్మాన్ సినిమాలో అవకాశం వచ్చింది. విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో నితిన్ హీరోగా ఓ స్పోర్ట్స్ డ్రామా రెడీ అవుతుంది. ఇందులో కూడా హీరోయిన్‌గా పూజా హెగ్డేను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇష్క్ తర్వాత విక్రమ్, నితిన్ కాంబినేషన్‌లో రానున్న సినిమా ఇది. దాంతో పాటు హిందీలో హై జవానీతో ఇష్క్ హోనా హై సినిమాలో నటిస్తున్నారు. వెబ్ సిరీస్‌లకు కూడా ఒకే అంటున్నారు పూజా. ఇష్క్ తర్వాత విక్రమ్, నితిన్ కాంబినేషన్‌లో రానున్న సినిమా ఇది. దాంతో పాటు హిందీలో హై జవానీతో ఇష్క్ హోనా హై సినిమాలో నటిస్తున్నారు. వెబ్ సిరీస్‌లకు కూడా ఒకే అంటున్నారు పూజా.

## కొత్తగుందే..



కుబేరతో బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకున్న నేషనల్ అవార్డ్ విన్నింగ్ సూపర్ స్టార్ ధనుష్ ఇడ్లీ కొట్టు సినిమాతో అలరించబోతున్నారు. ధనుష్ హీరో, డైరెక్టర్‌గా చేస్తున్న ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బ్యానర్స్‌పై ఆకాష్ బాస్కరన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. డైరెక్టర్‌గా ధనుష్‌కి ఇది నాలుగో మూవీ. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ కొత్తగుందే సాంగ్ రిలీజ్ చేశారు. జివి ప్రకాష్ కుమార్ ఈ సాంగ్‌ని ఫీల్ గుడ్ మెలోడీ గా కంపోజ్ చేశారు. సింగర్స్ కృష్ణ తేజస్వి, శ్వేతా మోహన్ వోకల్స్ సాంగ్‌కి మరింత మెలోడీ వైబ్‌ని తీసుకొచ్చాయి. సామ్రాట్ నాయుడు ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. సాంగ్‌లో ధనుష్, నిత్యా మీనన్ కెమిస్ట్రీ చాల బ్యూటీఫుల్‌గా వుంది. వినగానే కనెక్ట్ అయ్యే ఈ సాంగ్ మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్ లో వుంది. శ్రీ వేదక్షర మూవీస్ బ్యానర్ ద్వారా నిర్మాత రామారావు చింతపల్లి తెలుగులో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## మారెమ్మతో తొలి అడుగు


మాస్ మహారాజా రవితేజ బ్రదర్ యాక్టర్ రఘు కుమారుడు యంగ్ చాప్ మాధవ్ రూరల్ రస్టిక్ మూవీ మారెమ్మతో హీరోగా సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. ఈ హైఆక్టేన్ ప్రాజెక్ట్‌ను మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు తమ ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మాధవ్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్, గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. పోస్టర్‌లో మాధవ్ ఇంటెన్స్, రగ్గడ్ లుక్ లో ఆకట్టుకున్నారు. మాధవ్ కబడ్డీ కోర్ట్‌లో అడుగుపెడుతున్నట్లుగా ప్రజెంట్ చేసిన గ్లింప్స్ పవర్ ఫుల్‌గా వుంది. తనని ఫెరోషియస్‌గా ప్రజెంట్ చేసిన తీరు అదిరిపోయింది. విజువల్స్, బ్యాగ్ గ్రౌండ్ స్కోర్ టాప్ నాచ్ వున్నాయి.



ఈ చిత్రంలో మాధవ్ సరసన దీపా బాలు కథానాయికగా నటిస్తోంది. వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్ రెడ్డి, వి.ఎస్.రూప లక్ష్మి ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తున్నారు. దేవ్ రాథోడ్ ఎడిటర్, రాజ్‌కుమార్ మురుగేశన్ ఆర్ట్ డైరెక్టర్.

## నవంబరు 7న జటాధర

నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. మూవీ మేకర్స్ తాజాగా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. విజువల్ స్పెక్టకిల్ జటాధర నవంబర్ 7, 2025న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. రిలీజ్ డేట్ పోస్టర్ డివైన్ ఎనర్జీతో అదిరిపోయింది.



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా తో పాటు దివ్యా ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్ లాంటి అద్భుత తారాగణం స్క్రీన్‌పై కనువిందు చేయనున్నారు. జీ స్టూడియోస్ సీబీఓ ఉమేష్ కుమార్ బన్సాల్ మాట్లాడుతూ.. జటాధర సాధారణ సినిమా కాదు, ఇది ఒక గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. స్కేల్, స్టోరీటెల్లింగ్, విజన్ పరంగా ఆడియన్స్‌ను ఒక కొత్త లోకంలోకి తీసుకెళ్తాం. ప్రేరణ అరోరా మాట్లడుతూ రుస్తమ్ తర్వాత జీ స్టూడియోస్‌తో మరోసారి కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా గ్లోబల్ లెవెల్‌లో ప్రజెంట్ చేస్తున్నాం. ఇది ఎమోషనల్‌గా, విజువల్‌గా రేర్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది. డైరెక్టర్స్ అభిషేక్ జైస్వాల్, వెంకట్ కళ్యాణ్ మాట్లాడుతూ.. జటాధర ఒక ఫోక్ టేల్ నుంచి పుట్టిన అద్భుతమైన కథ. డివైన్ పవర్, కాస్మిక్ డెస్టినీ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా ప్రెజెంట్ చేస్తున్న జటాధరను ఉమేష్ కుమార్ బన్సాల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా ప్రొడ్యూస్ చేస్తున్నారు. అకాష్ కేజ్రీవాల్, కుస్సుం అరోరా కోప్రొడ్యూసర్స్. దివ్యా విజయ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్, భావిని గోస్వామి సూపర్‌వైజింగ్ ప్రొడ్యూసర్‌గా

## రాయలసీమ బ్యాక్ డ్రాప్‌తో లెనిన్

అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రస్తుతం తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్ లో చేస్తున్నాడు. అయితే, ఈ సినిమా పై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. తాజాగా మరో రూమర్ వినిపిస్తోంది. ఈ సినిమా కీలక షెడ్యూల్ ను హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. ఈ షెడ్యూల్ లో అఖిల్ పై ఇంట్రో సన్నివేశాలను ఘూట్ చేస్తారట. అన్నట్టు ఈ సినిమాలోని కీలక పాత్ర కోసం మరో హీరోయిన్ని తీసుకొవాలని చూస్తున్నారు. కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్‌తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. అఖిల్ మాడ్యులేషన్ కూడా పూర్తిగా చిత్తూరు యాసలోనే ఉండబోతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్ర యూనిట్ అనుకుంటున్న ప్లాన్ ప్రకారం ఈ చిత్రాన్ని నవంబర్ 14న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా అఖిల్ - శ్రీలీల కలయికలో లవ్ సీన్స్ చాలా బాగుంటాయట. అన్నట్టు ఈ సినిమా పై అఖిల్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు.

## యక్షగానంతో కొత్త ప్రపంచం సృష్టించా



కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్, ఎస్ జె కె బ్యానర్స్ పై ఎమ్‌వీ రాధాకృష్ణ, జేమ్స్ డబ్ల్యూ కొమ్ము తెలుగులో విడుదల చేస్తున్న కన్నడ చిత్రం వీర చంద్రహాస. మంచి టేస్ట్ ఉన్న ప్రొడ్యూసర్‌గా రాధాకృష్ణకు గుర్తింపు ఉంది. గతంలో శివరాజ్ కుమార్ నటించిన వేద, ప్రజ్వల్ దేవరాజ్ నటించిన రాక్షస చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన.. తాజాగా వీర చంద్రహాస తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. సెప్టెంబర్ 19న తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా థియేటర్స్‌లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి బస్రూర్ మాట్లాడుతూ..ఇదొక రేటెడ్ స్టోరీ. యక్షగానం కల్చర్‌ను రిప్రజెంట్ చేసేలా ఉంటుంది. ఈ సినిమా నా 12 సంవత్సరాల కల. విజయం సాధించిన ప్రతి ఒక్కరి స్టోరీ ఇది. జీరో నుంచి హీరోగా ఎలా అవుతారు అనే డెడికేషన్ ఈ కథలో ఉంటుంది. ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యేలా సినిమా ఉంటుంది. ఒక సినిమా చేయడంతో సుమారు 4000 మందికి ఉపాధి కలుగుతుంది. మ్యూజిక్ చేయడంతో వచ్చే డబ్బును సరైన మార్గంలో ఉపయోగించాలనే ఉద్దేశంతో ఎప్పుడో ఒక సినిమా దర్శక నిర్మాతగా చేయాలనుకునే లక్ష్యం పెట్టుకున్నాను. ఇది నా ఆరో సినిమా. దీని ద్వారా కొత్త వాళ్లను ఎంకరేజ్ చేసాను. మనం ఏ స్థాయికి వెళ్ళినా అన్ని మూలాలను మర్చిపో కూడదని నమ్ముతాను. యక్షగాన కళతో రూపొందిన ఈ చిత్రంతో ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించాను. మన కల్చర్ ను కాపాడుకునేలా ఈ చిత్రం ఉంటుంది. ఎనిమిదో తరగతి ఫెయిల్ అయిన వాడిని, ..ఉగ్రం.. సినిమా వచ్చేవరకు నా జీవితంలో అన్ని డిజాస్టర్లే. నాకు అవకాశం ఇచ్చిన ప్రశాంత్ నీల్ గారు నాకు దేవుడితో సమానం. నన్ను నమ్మిన ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను అని అన్నారు. నిర్మాత ఎమ్.వీ.రాధాకృష్ణ మాట్లాడుతూ..'ఇటీవల కన్నడలో విడుదలై అఖండ విజయం సాధించిన వీర చంద్రహాస వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ మధ్య కాలంలో 100 డేస్ రన్ అయిన సినిమా ..వీర చంద్రహాస.. మంచి గుర్తింపును అందుకుంది. ఈ చిత్రాన్ని మేము తెలుగులో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇదొక భారతీయ నాగరికత సంస్కృతికి సంబంధించిన.. యక్షగానం అనే కాన్సెప్ట్ తో ఈ చిత్రం రూపొందిదని అన్నారు.

## పీపుల్స్ పాలిటిక్స్‌తో భద్రకాళి



హీరో విజయ్ ఆంటోనీ మార్గన్ విజయం తర్వాత మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ భద్రకాళితో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్‌మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కనెక్ట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్, రాణా దగ్గుబాటి స్పిరిట్ మీడియాతో కలిసి గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. భద్రకాళి సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ.. భద్రకాళి అద్భుతమైన సినిమా. రచయిత భాష శ్రీ గారు తెలుగు సంబంధించి అన్ని బాధ్యతలు తీసుకు న్నారు. చాలా అద్భుతమైన మాటలు రాశారు.

హీరోయిన్స్ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు అని పేర్కొన్నారు. డైరెక్టర్ అరుణ్ ప్రభువు మాట్లాడుతూ.. ఇది మంచి పొలిటికల్ థ్రిల్లర్. ఇది ఏ రాష్ట్రానికో దేశానికి సంబంధించిన పాలిటిక్స్ కాదు. ఇదో ప్యూపుల్ పాలిటిక్స్. అందరికీ రిలేట్ అయ్యేలా ఉంటుంది అన్నారు. నిర్మాత సురేష్ బాబు, ప్రొడ్యూసర్ రామాంజనేయులు, హీరోయిన్‌లు తృప్తి రవీంద్ర, రియా రైటర్ భాష శ్రీ మాట్లాడారు.

## ప్రతి పాత్ర ఇన్‌స్పైర్ చేసింది



సూపర్ హీరో తేజ సజ్జా బ్రహ్మాండం బ్లాక్ బస్టర్ మిరాయ్.. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్‌ఫుల్ పాత్ర పోషించారు. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. సెప్టెంబర్ 12న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజైన ఈ చిత్రం బ్రహ్మాండం బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకుని అద్భుతమైన కలెక్షన్స్‌తో హౌస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ హరి గౌర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

హనుమాన్, మిరాయ్ రెండు బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా హిట్స్ అందుకోవటం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సక్సెస్ వచ్చినప్పుడు సినిమా కోసం పడ్డ కష్టం మర్చిపోతాం. కార్తీక్ చాలా అద్భుతమైన పిక్చర్ తీశారు. ఆ పిక్చర్ నన్ను మ్యూజిక్ ఇవ్వడానికి ఇన్‌స్పైర్ చేసింది. సినిమా చూస్తున్నప్పుడే ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌కి దగ్గరగా ఉందనిపించింది. ఈ సినిమా కోసం చాలా కాంప్లిమెంట్స్ వచ్చాయి. ఫోన్ కంటిన్యూగా రింగ్ అవుతూనే ఉంది. ఈ సినిమాలో మ్యూజిక్ చేయడానికి బిగ్గెస్ట్ ఛాలెంజ్ అనిపించిన క్యారెక్టర్ అంటూ ఏమీ లేదు. ప్రతి పాత్రకి వెయిటేజ్ ఉంది. ప్రతి పాత్ర గొప్ప మ్యూజిక్ ఇవ్వడానికి ఇన్‌స్పైర్ చేసింది. ఇందులో మిరాయ్ ఆయుధానికి లార్డ్ శివ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ (బిజి) ఉపయోగించాం. శ్రీ రాములవారి ఆయుధం అయినప్పటికీ దానికి పినాక అనే పేరు ఉంది. ఆస్ఫూర్తితో బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చేశాం. స్టోరీని దృష్టిలో పెట్టుకుని మ్యూజిక్ స్కోర్ కూడా రాశారు. ఈ సినిమా రాములవారి పోర్షన్ చేయడానికి దాదాపు 10 డేస్ పట్టింది. అందులో చాలా ఎలిమెంట్స్ ఉంటాయి. అవన్నీ కూడా పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేయడానికి టైమ్ పట్టింది. నిజానికి చాలా పెద్ద కథ ఇది. ఒక పార్ట్‌గా చెప్పడం చాలా చాలెంజ్. కానీ కార్తీక్ చాలా అద్భుతంగా సినిమాని ప్రెజెంట్ చేశారు. ఆ సాంగ్ ఎడిటింగ్ టేబుల్ దగ్గర చూసుకుంటే ఫ్లోకి ఇబ్బంది కలిగిస్తుందేమో అనే ఫీలింగ్ కలిగింది. దీంతో ఆ నిర్ణయం తీసుకున్నాం. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత మమ్మల్ని కీరవాణి గారు లాంటి లెజెండరీ కంపోజర్‌తో పోల్చడం ఒక భయాన్ని తీసుకొచ్చింది. భవిష్యత్తులో తెలిసో తెలియక ఏదో ఒక చిన్న తప్పు చేసిన అది నాకు పెద్ద అపవాదాన్ని తీసుకొచ్చి పెడుతుంది. రాబోయే రోజుల్లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీలోనే నాలుగు ప్రాజెక్ట్స్ చేస్తున్నాను. వర్క్ చేస్తున్నారు. మ్యూజిక్‌ని జీ మ్యూజిక్ కో అందిస్తోంది.

## గన్స్ అండ్ రోజెస్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ ఓజీ సెప్టెంబర్ 25న థియేటర్స్‌లో విడుదల కానుంది. రిలీజ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రబృందం. ఈమేరకు తాజాగా మూవీ మరో సాంగ్ విడుదల చేసింది. గన్స్ అండ్ రోజెస్ టైటిల్‌తో విడుదల చేసిన ఈ పాట పవన్ ఫ్యాన్స్‌కి పూనకాలు తెప్పిస్తోంది. పాటలోని రిథమ్స్, తమన్ పవర్ ఫుల్ బీట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ర్యాప్ స్టైల్లో ఆంగ్లం, తెలుగు పదాలతో కలిపిన లిరిక్స్ రిఫ్రెషింగ్‌గా కొత్తగా ఉన్నాయి. గన్స్ అండ్ రోజెస్ పాట సినిమాలోని కథాంశానికి అనుగుణంగా సాగుతుంది. గ్యాంగ్ స్టార్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో పవన్ యాక్షన్ సైడ్ తో పాటు రొమాంటిక్ యాంగిల్ కూడా చూపించారు డైరెక్టర్. అందుకే గన్స్ అండ్ రోజెస్ పేరుతో పాటను విడుదల చేసినట్లు అర్థమవుతోంది. తమన్ సంగీతం అందించిన ఈ పాటను సింగర్ హర్ష ఆలపించారు. అద్వితీయ లిరిక్స్ రాశారు. ఊచకోత..చావు మోత అంటూ ఓజాస్ గంభీర పాత్రను ఎలివేట్ చేస్తూ సాగిన ఈ ర్యాప్ సాంగ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా నుంచి విడుదలైన ప్రతీ పాట సూపర్ హిట్ రెస్పాన్స్ సొంతం చేసుకుంది.

సువ్వి.. సువ్వి, ఇప్పుడు గన్స్ అండ్ రోజెస్ అన్నీ పాటలు కూడా విడుదలైన గంటల్లోనే మిలియన్ల వ్యూస్ సాధించాయి. ఇతర సినిమాల కంటే ఓజీ మ్యూజిక్ కాస్త బిన్నంగా ఉండబోతుందని తెలుస్తోంది. అంతేకాదు ఈ సినిమా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కోసం మ్యూజిక్ డైరెక్టర్ తమన్ చాలా కష్టపడుతున్నారు. ఆడియన్స్‌కి ఒక కొత్త అనుభవాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. బీజీఎం కోసం జపాన్ సాంప్రదాయ వాద్య పరికరం కోటాను కూడా ఉపయోగించారట. ఇది సినిమాకు ఒక ప్రత్యేకమైన ఫీల్ ఇస్తుందని చెబుతున్నారు. ఇటీవలే తమన్ ఒక ఓజీ బీజీఎం కి సంబంధించి ఒక జాపనీస్ బీట్ వినిపించగా.. సోషల్ మీడియాలో ఫుల్ ట్రెండ్ అయ్యింది. లండన్ లోని ఓ ప్రముఖ స్టూడియోలో ఓజీ మ్యూజిక్ రికార్డింగ్స్ జరుగుతున్నాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 117 మంది సంగీత కళాకారులు ఈ సినిమా మ్యూజిక్ కోసం పనిచేస్తున్నారు.

## ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అనేవారు

సీనియర్ హీరోయిన్ మీనా స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. తాజాగా ఆమె జయమ్ము నిశ్చయమ్మురా కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పింది. జగపతి బాబు హోస్ట్ గా వ్యవహారిస్తున్న ఈ టాక్ షో జీ 5 లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇంతకీ, మీనా ఏం చెప్పింది అంటే.. చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమోంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను అడిగేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది అంటూ మీనా చెప్పుకొచ్చింది.



మీనా ఇంకా మాట్లాడుతూ.. కెరీర్‌లో నాకు వరుస అవకాశాలు వస్తున్నప్పుడే, నేను పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్కరించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలోపెట్టుకున్నట్లు చెప్పారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. ఇక ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అని రాసేవారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేసేది అంటూ మీనా చెప్పుకొచ్చింది.

## డ్రాగన్ కోసం కొత్త ప్రయత్నం

ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమా పై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. ఐతే, తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమాలోని ఓ స్పెషల్ యాక్షన్ సీక్వెన్స్ కోసం ఎన్టీఆర్ కొత్త గెటప్ ట్రై చేస్తోందని తెలుస్తోంది. ఈ సీక్వెన్స్ లో ఎన్టీఆర్ గెటప్ అండ్ సెటప్ చాలా థ్రిల్లింగ్ గా ఉంటుందని తెలుస్తోంది. పైగా ఈ సీక్వెన్స్ ఈ సినిమా మొత్తానికే మెయిన్ హైలెట్ గా నిలిచిపోతుందని తెలుస్తోంది. ఇక ఈ మూవీ టైటిల్ డ్రాగన్



అని ప్రచారంలో ఉంది. ఐతే, డ్రాగన్ సినిమాని ఎన్టీఆర్ కెరీర్ లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లోకల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



## బ్యూటీ.. ఓ మధ్యతరగతి అమ్మాయి జీవితం

అంకిత్ కొయ్య, నీల హీరో హీరోయిన్లుగా విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం బ్యూటీ. జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా బ్యూటీ మూవీని నిర్మించారు. ఈ సినిమాకు గీతా సుబ్రమణ్యం. హాలో వరల్డ్, భలే ఉన్నాడే ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న విడుదల కాబోతోంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో నేడు సినిమా దర్శకుడు జె.ఎస్.ఎస్. వర్ధన్ మీడియాతో ముచ్చటించి మీడియా ప్రతినిధులు అడిగిన వాటికి సమాధానాలు తెలిపారు. ఈ కథ మారుతీ పిలిచి నాకు ఇచ్చారు. దీన్ని సుబ్రహ్మణ్యం అనే జర్నలిస్ట్ రాసారు. ఆయనే డైరెక్ట్ చేయాలి కానీ వేరే వాళ్లకు ఇమ్మనడంతో జీ వాళ్ళు నన్ను ప్రపోజ్ చేశారు నా వర్క్ నచ్చి. మొదటిసారి నేను వేరే వాళ్ళ కథకు పనిచేసాను. దాంతో నేను వారం రోజులు కథని అర్థం చేసుకున్నాను. హీరో హీరోయిన్స్ మధ్య కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయింది. గీతా సుబ్రహ్మణ్యం లాగే. సినిమాలో ఒక మంచి డ్రామా నడుస్తుంది. బోర్ కొట్టదు. హీరోయిన్‌ని చూస్తే పక్కింటి అమ్మాయి అనిపిస్తుంది. మొదట వేరే అమ్మాయి అనుకున్నాం కానీ ఆమె హీరోయిన్ లాగా కనిపిస్తుంది పక్కింటి అమ్మాయిలా లేదని మార్చేసాము. ఒక లైన్ లో ఈ సినిమా కథ చెప్పాలంటే ఒక మధ్య తరగతి అమ్మాయి గురించి చెప్పాలి. ఇప్పుడు అందరూ మన జీవితం కాకుండా పక్కనోళ్ళ జీవితం చూసి కంపారిజన్ చేసుకుంటున్నారు. మా అమ్మాయి కూడా వాళ్ళు కొంటున్నారు నాకు కావాలి అని కంపేర్ చేస్తుంది. ఇందులో హీరోయిన్ కూడా టీనేజర్స్ లాగా పక్కనోళ్ళతో కంపేర్ చేసుకొని తన కుటుంబ స్థితి మర్చిపోయి అది కావాలి ఇది కావాలి అంటారు. మనం స్థితికి మించి వాళ్ళని చదివిస్తాం అయినా వాళ్ళు పక్కనోళ్ళతో కంపేర్ చేసుకుంటారు. మనం ఎంత చేసినా చిన్న లోటు కనిపిస్తే దాన్ని హైలెట్ చేస్తారు పిల్లలు. అదే కథాంశంతో ఉంటుంది.



## రౌడీ మంచివాడుగా మారితే....

టాలెంటెడ్ హీరో శ్రీ రామ్ నటిస్తున్న సినిమా యంగ్ అండ్ డైనమిక్. ఈ సినిమాలో మిథున ప్రియ హీరోయిన్‌గా నటిస్తోంది. పి.రత్నమ్మ సమర్పణలో శ్రీరామ్ ప్రొడక్షన్ బ్యానర్ పై శ్రీరామరాజు, లక్ష్మణరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కిషోర్ శ్రీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న యంగ్ అండ్ డైనమిక్ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకులు వీరశంకర్, వీఎన్ ఆదిత్య, సముద్ర ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ట్రైలర్‌ను లాంఛ్ చేసి చిత్ర యూనిట్‌కు తమ బెస్ట్ విశెస్ అందించారు. ఈ కార్యక్రమంలో ..దర్శకుడు కిషోర్ శ్రీ కృష్ణ మాట్లాడుతూ .. నేను దాసరి గారి శిష్యుడిని. నా మొదటి సినిమా మైండ్ గేమ్. ఆ సినిమా హీరో శ్రీరామ్ తోనే చేశాను. ఇప్పుడు యంగ్ అండ్ డైనమిక్ రూపొందిస్తున్నాను. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే చిత్రమిది. ఒక రౌడీ ఊరిని ఎలా నియంత్రిస్తాడు. ఆ రౌడీ మంచివాడుగా మారితే ఊరికి కలిగే లాభమేంటి అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా తెరకెక్కించాం. ఈ సినిమా ఇంత బాగా రూపొందడానికి బ్రదర్ హీరో శ్రీరామ్ కారణం. త్వరలోనే చిత్రాన్ని విడుదలకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మా మూవీని మీరంతా ఆదరిస్తారని కోరుకుం టున్నా అన్నారు. అతిథిగా వచ్చిన డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ .. చిన్న సినిమాకు మంచి జరగాలి, వాళ్ల కోసం రెండు మంచి మాటలు చెప్పాలనే ఇక్కడికి వచ్చాను. "యంగ్ అండ్ డైనమిక్" ట్రైలర్ బాగుంది. ఇందులో మాస్ డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. హీరో శ్రీరామ్ గారు ఫైట్స్ బాగా చేశారు. ఇలాంటి మాస్ చిత్రాలు ప్రేక్షకాదరణ పొందిన చరిత్ర టాలీవుడ్ కు ఎంతో ఉంది.

# సామర్థ్యంలో లింగ భేదం లేదు..



సమర్థత విషయంలో మహిళా పైలట్లు పురుం కల తక్కువనే భావన కొందరిలో కనిపిస్తుంది. కానీ ఓ తాజా పరిశోధన అందుకు భిన్నమైన అంశాన్ని చెబుతోంది. యూనివర్సిటీ ఆఫ్ వాటర్ లూ చేసిన ఈ పరిశోదన ప్రకారం తీవ్ర ఒత్తిడి, ప్రతికూల పరిస్థితుల్లో మహిళా పైలట్లు పురుషుల కంటే మెరుగ్గా స్పందిస్తారు. 'పురుష, మహిళా పైలట్లు పరిస్థితుల్ని గమనించడంలో, మన విమానం నడపడంలో ఒకే విధంగా ఉన్నప్పటికీ, ఒత్తిడి స్థాయిలు ఎక్కువైనప్పుడు విమాన నియంత్రణ పరంగా పైలట్లు తక్కువ తప్పిదాలు చేశారు అని చెబుతున్నారు. పరిశోధనకు నేతృత్వం వహించిన నైలా అయాలా. ఈ అధ్యయనంలో 20 మంది అనుభవజ్ఞులైన పౌర పైలట్లు (మహిళలూ, పురుషులూ సమాన సంఖ్యలో) పాల్గొన్నారు. వీళ్లకి ఇంజిన్ ఫెయిల్యూర్, క్లిష్టమైన ల్యాండింగ్ లాంటి పరిస్థితులు ఉన్నట్టుగా ఫ్లైట్ సిమ్యులేటర్లను ఇచ్చారు. పైలట్లకు ఐ ట్రాకింగ్ కళ్లద్దాలను ఇచ్చి.. ఆ సమయంలో వాళ్లు ఎటువైపు చూస్తున్నారు. ఎలా స్పందిస్తేన్నారనే అంశాల్ని రికార్డు చేశారు. ఇద్దరూ సమానంగా సమస్యల్ని గుర్తించినప్పటికీ మహిళలు నిదానంగా, స్థిరంగా, కచ్చితంగా ప్రతిస్పందించారు. పైలట్ల కొరత నెలకొన్న ప్రస్తుత తరుణంలో సామర్థ్యం విషయంలో లింగ భేదం సమస్యే కాదని నిరూపించామనీ, పైలట్ల శిక్షణలోనూ ఈ అధ్యయనం ఉపయోగపడు తుందనీ చెబుతున్నారు పరిశోధకులు. □

# నల్ల నేలలో పసుపు బంగారం



నల్లరేగడి నేలలు. అత్యంత సారవంతమై ఈ నేలలు గోధుమ, పత్తి, చెరకు, సోయా.. వంటి పంటలకు అనుకూలం. అయితే 'ఎప్పుడూ ఇలాంటి సంప్రదాయ పంటలేనా? ఈసారి కొత్తగా ట్రై చేద్దాం! అని ప్రయత్నించి సక్సెస్ సాధించింది మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళా రైతు **కంచన్ వర్మ.** సాధారణంగా ఎర్ర/బంకమట్టిలో నేలల్లో పండే పసుపు పంటను నల్లరేగడి నెలలో సాగు చేయడమే కాదు.. పంట దిగుబడిని పెంచి రెట్టింపు లాభాల్ని అర్జిస్తోంది. ఓ టివి షోలో పసుపు పంట సాగు గురించి తెలుసుకొని ఆమె చేసిన ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో ఆ రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందామె. ప్రస్తుతం పది ఎకరాల్లో పసుపు పంట పండిస్తూ లక్షల ఆదాయం ఆర్జిస్తోన్న ఈ మహిళా రైతు సక్సెస్ స్టోరీ తెలుసుకుందాం..

**ఆ షో చూశాకే..!** అందరు చేసే పనె తానెందుకు చేయాలనుకుంది కంచన్. మధ్యప్రదేశ్‌లోని సోమల్‌వాడా ఖుర్ద్ అనే గ్రామానికి చెందిన ఆమెది వ్యవసాయాధారిత కుటుంబం. అయినా డిగ్రీ వరకు చదువుకుంది. మంచి చదువు ఉన్నా వ్యవసాయం చేయడానికే ఇష్టపడింది. తన ఈ కల పెళ్లయ్యాక నెరవేరిందంటోంది కంచన్ 'మా అత్తింటి వారిదీ వ్యవసాయాధారిత కుటుంబమే. పుట్టింట్లో పొలానికి వెళ్లి వ్యవసాయం చేసే అవకాశం రాకపోయినా.. అత్తింట్లోకి అడుగుపెట్టాక నా ఈ కోరిక నెరవేరింది. ఈ క్రమంలోనే కాయగూరలు సాగు చేయడం, గోధుమమొక్కజొన్న.. వంటి పంటలు పండించడం నేర్చుకున్నా. అలాగే ఆయా పంటల సాగు, వ్యవసాయం గురించి అనుభవపూర్వకంగా మరింత లోతు తెలుసుకోగలిగా. అయితే ఒసారి టీవీలో ఓ కార్యక్రమంలో భాగంగా పసుపు పంట సాగు, దానివల్ల వచ్చే లాభల గురించి తెలుసుకున్నా. దీంతో నాకూ ఈ పంట పండించాలన్న ఆసక్తి పెరిగింది. ఈ మక్కువతోనే దగ్గర్లోని 'కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణకు హాజరై పసుపు పంట గురించి ప్రాథమిక అవగాహన పెంచుకున్నా.. అంటోంది కంచన్.

**సాంగ్లీ పసుపు.. ఎందుకంటే?!** అయితే పసుపు రకాల్లోనూ సాంగ్లీ పసుపు పండించాలని నిర్ణయించుకుంది కంచన్. ముదురు ఆరెంజ్ కలర్‌లో ఉండే ఈ పసుపు పొడిలో కర్క్యుమిన్ అనే రసాయనం అధికమొత్తంలో ఉంటుంది. ఫలితంగా మందుల తయారీలో దీన్ని ఎక్కువగా వాడుతుంటారు. కాబట్టి ఎక్కువ లాభాలు ఆర్జించేందుకు ఈ రకాన్ని సాగు చేయాలని నిర్ణయించుకున్నట్లు చెబుతోందీ మహిళారైతు. 'సాధారణంగా ఇక్కడి నేలలు నల్లరేగడి రకానికి చెందినవి. ఈ తరహా మట్టిలో గోధుమ, పత్తి, చెరకు,సోయా.. వంటి పంటలు ఎక్కువగా పండుతాయి. అదే పసుపు పంటకు ఎర్ర/బంకమట్టి లోమీ నేలలు అనువైనవి. అయితే ఇదే నల్లరేగడి నేలను పసుపు పంటకు అనువుగా మార్చి ఈ పంటపండించాలనుకున్నా. ఇందుకోసం సాంగ్లీ పసుపు రకాన్ని ఎంచుకున్నా. తొలి ప్రయత్నంగా నేను శిక్షణ తీసుకున్న కృషి విజ్ఞాన కేంద్రం నుంచి 8 క్వింటాళ్ల పసుపు విత్తనాల్ని (రైజోమ్‌లు) సేకరించా. ఆపై పొలంలోని కలుపు మొక్కల్ని తొలగించి.. భూమిని దున్నాం. ఇప్పుడు ఆవు పేడ, జీవామృతం (పశువుల వ్యర్థాలు).. వంటి పదార్థాల్ని నేలలో కలపడం ద్వారా నేల సారాన్ని పెంచడంతో పాటు పసుపు పంటకు అనువుగా మార్చగలిగాం. ఇలా సిద్ధం చేసిన నేలలో పసుపు విత్తనాలు నాటాం. ఈ పద్ధతి కూడా దుంపల్ని నేలలో నాటే మాదిరిగానే ఉంటుంది. అంటోంది కంచన్.



**వేల పెట్టుబడి.. లక్షల ఆదాయం!**

ఇలా 2020లో తొలి ప్రయత్నంగా ఎకరం పొలంలో పసుపు వేశాం. ఎనిమిది నెలలు తిరిగేసరికి వంద క్వింటాళ్ల పసుపు దిగుబడిని సాధించింది. అంటే రూ.50 వేల పెట్టుబడితో రూ.3లక్షలు ఆర్జించిందామె. తొలి ప్రయత్నమే సక్సెస్ కావడంతో నాలో ఆత్మవిశ్వాసం రెట్టించింది. అయితే ఈ పంటకు అనువైన సమయం ఏది? ఎప్పుడు విత్తనాలు భూమిలో నాటాలి? ఎన్ని రోజులకు పంట చేతికొస్తుంది? వంటి అంశాలపై పూర్తి అవగాహన లేక మొదట్లో పలు ఇబ్బందులు పడ్డా. కానీ ఆ తర్వాత ఈ విషయాల గురించి తెలుసుకోవడంతో సాగు సులభమైంది. ఇలా పంట చేతికొచ్చాక పసుపు కొమ్ముల్ని శుభ్రం చేసి, నీళ్లలో ఉడికించి.. పూర్తిగా ఎండబెడతాం. ఆపై పొడి చేసి విక్రయిస్తున్నాం. ఈ పద్ధతి పూర్తి కావడానికి సుమారు 15 రోజుల సమయం పడుతుంది. అలాగే పసుపు పొడితో పాటు పసుపు కొమ్ముల్ని కూడా విక్రయిస్తున్నాం. ఇవే అధిక లాభాల్నిస్తున్నాయి కూడా! ఇలా పసుపును పూర్తిగా సహజసిద్ధమై పద్ధతుల్లో సాగు చేస్తున్నా.. అందుకే స్థానికంగా దీనికి ఎక్కువ డిమాండ్ ఉంది.. అంటోన్న కంచన్.. ప్రస్తుతం పది ఎకరాల పొలంలో పసుపు పంట పండిస్తూ లక్షలు సంపాదిస్తోంది. మరోవైపు స్థానిక మహిళా రైతుల్నీ ఈ దిశగా ప్రోత్సహిస్తోంది. ఇందుకు గుర్తింపుగా 2020లో వ్యవసాయ రంగంలోనే ప్రతిష్టాత్మకంగా భావించే 'క్రిషి కర్మన్ అవార్డ్' అందుకుంది కంచన్. □



## తెలుసుకుందాం..

నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్ రిసెర్చ్ ప్రకారం.. మహిళా టీచర్లు ఎక్కువగా ఉన్న స్కూళ్లలో అమ్మాయిలు చదువుల్లో ముందుంటారు. అంతేకాదు, పై చదువులకి వెళ్లే అవకాశం అధికంగా ఉండి ఎక్కువగా సంపాదిస్తారట కూడా. □

# మొదటి మూడు నెలల్లోనే..

**ప్రస్తుత కాలంలో చాలామందికి 'అమ్మ' అనే పిలుపు అంత తేలిగ్గా ఏమీ దక్కడం లేదు.** గర్భధారణ సమయంలో హైపర్‌టెన్షన్, ప్రీఎక్లాంప్సి యా(గుర్రపువాతం) లాంటి సమస్యలు తల్లీబిడ్డల ప్రాణాలకే ముప్పు తెస్తున్నాయి. చికిత్స కంటే నివారణే మేలు అన్నట్లుగా, వీటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే గర్భిణులకు శ్రీరామరక్ష అంటున్నారు పరిశోధకులు. అందుకే, మొదటి మూడు నెలల్లో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కీలకమనీ, అప్పుడే హైపర్ టెన్షివ్ డిజార్డర్లు వచ్చే



ముప్పు తగ్గుతుందనీ అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చేసిన అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందు కోసం, వాళ్లు మొదటిసారి గర్భం దాల్చిన 5వేల మంది మహిళలపై పరిశోధన చేశారు. ఆహారం, శారీరక శ్రమ, నిద్ర, డయాబెటిస్, బిపి, ఎత్తుకు తగ్గ బరువు.. లాంటి కీలక మైన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. అందుకే, ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవడా నికంటే ముందు, గర్భం ధరించగానే మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలంటున్నారు. పోషకాహారం తీసుకుంటూ, బరువును అదుపులో ఉంచు కోవాలని సూచిస్తున్నారు. ఈ దశల్లోనే జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో తల్లికీ, బిడ్డకీ ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు. □

# శ్రమించే పని తేలిగ్గా

శ్రమించే పని.. తేలిగ్గా చేసుకోగలిగే పని.. రెండింట్లో ఏది ఎంచుకుంటారు? కచ్చితంగా ఈజీగా చేసుకోగలిగిందే కదా! అయితే, మన వంటింటి పని కూడా అలా అవ్వాలంటే ఈ వస్తువు మీ ఇంట్లో ఉండాల్సిందే.





**రెండు వైపులా..** సాధారణంగా మనం రోటీ, బ్రెడ్, పాన్‌కేక్స్.. లాంటివి కాల్చేందుకు గరిటె ఉపయోగిస్తాం. కానీ, దాంతో రోటీ తిరగేసేటప్పుడు అంత సౌకర్యంగా అనిపించదు. అందుకే ఈ 'డబుల్‌సైడెడ్ స్పాచులా'నుతీసుకురండి. ఇది ఒక కాడకు రెండు గరిటెలు అమర్చినట్లుగా ఉంటుంది. దీంతో చికెన్, చేప.. లాంటివి కూడా చక్కగా ఫ్రై చేయొచ్చు. దీని అంచులు కూడా మృదువుగా ఉండడంతో పట్టుకోవడానికి తేలికగా ఉండడంతోపాటు పాత్రలకు ఎలాంటి నష్టాన్నీ కలిగించవు. కుకింగ్, ఫ్లిప్పర్, స్క్రేపర్.. ఇలా త్రీ ఇన్ వన్ పరికరంలానూ ఉపయోగపడుతుంది. □

# తేమ వాసన తగ్గించే నిమ్మ

వర్షాకాలం.. **వాతావరణంలో** తేమ పెరగడం, ఎండ తక్కువగా ఉండటం వంటి కారణాలతో ఇల్లు కాస్త ముక్క వాసన వస్తుంది. దీనికి తడి దుస్తులు కూడా తోడైతే.. మరింత ఇబ్బంది. ఇలాంటప్పుడు ఎయిర్‌ఫ్రెషనర్ వాడితే సరిపోతుంది కదా అంటారు చాలామంది. ఇవే కాదు.. సెంటెడ్ క్యాండిల్స్, పర్ఫ్యూమ్స్.. వంటివి ఇచ్చే సువాసనల సంగతేమో కానీ, ఇంట్లో గాలిని మాత్రం కలుషితం చేస్తాయట. ముఖ్యంగా బెంజీన్, ఫార్మాల్డి హైడ్, థాలేట్లు, టోలున్.. వంటి హానికార రసాయనాలెన్నింటినో ఇవి విడుదల చేస్తాయి. ఫలితంగా మహిళల్లో పునరుతనపత్తి వ్యవస్థకు నష్టం కలిగించడంతో పాటు.. పుట్టే శిశువుల్లో అనేక లోపాలకూ కారణం అవుతాయి. క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పుని తెచ్చిపెడతాయి. అందుకే, వీలైనంతవరకూ వీటిని వాడకపోవడమే మేలు. ఇవి గాలి



నాణ్యతను ఏ మాత్రం మెరుగుపరచవు. కేవలం కృత్రిమంగా సువాసనల్నే అందిస్తాయి. అలాకాకుండా ఇల్లు సహజంగా పరిమళాలు వెదజల్లాలంటే ఇంట్లోకి తాజా గాలి ప్రసరించేలా తలుపులు తెరవండి. ఇంట్లోని దుర్వాసన పోగొట్టడానికి ఓ గిన్నెలో కాస్త బేకింగ్ సోడా వేసి మూలల్లో పెట్టండి. స్నానాల గదిలోని తేమ వాసన పోవడానికి రాతి ఉప్పులో కాస్త టీట్రీ ఆయిల్ చేర్చి లోపల ఉంచండి. ఇక, నిమన, నారింజ తొక్కలు, రోజ్‌మెరీ, థైమ్, తులసి వంటి హెర్బ్స్‌ను నీళ్లల్లో వేసి మరిగిస్తే సరి. ఆ సువాసనలు ఇల్లంతా వ్యాపిస్తాయి. అంతేకాదు నచ్చిన పరిమళం గల ఎసెన్షియల్ ఆయిల్స్‌ని ఎంచుకుని డిఫ్యూజర్ లో వేసినా ఫలితం ఉంటుంది. ఇవేకాదు, పిస్‌లిల్లీ, మనీప్లాంట్, ఇంగ్లిష్‌ఐవి. వంటి ఇండోర్ మొక్కలు గాలినీ శుద్ధి చేస్తాయి. లిల్లీ, గులాబీ, సంపెంగ మల్లె.. పూలను అలంకరణ కోసం వాడినా అందంతో పాటూ హాయినీ ఇస్తాయి. □

# ఆ కుక్కర్‌తో ప్రమాదమే !

**ఏది కొనేటప్పుడైనా ఆడవాళ్లు ఏం చూస్తారు?** ఎక్కువకాలం మన్నతుందా అనే కదా! అలా అమె కుక్కర్ కొన్ని సంవత్సరాలుగా వాడుతున్నారా? అయితే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్టే అని చెబుతున్నారు నిపుణులు.



ముఖ్యంగా రీసైకిల్డ్ మెటల్‌తో చేసినవి ఎన్నో అనారోగ్యాలు తెచ్చి పెడతాయి. ఇవి ఆహారంలోకి సీసాన్ని విడుదల చేస్తాయి. ఇది దీర్ఘకాలంలో శరీరంలోకి చేరితే.. మెదడు, మూత్రపిండాలు, ఎముకలే కాదు నరాలపైనా దుష్ప్రభావాలను చూపెడుతుంది. పిల్లల్లో నేర్చుకోవడంలో ఇబ్బందులు, పెద్దవారిలో మతిమరుపు, దీర్ఘకాలిక వ్యాధులకూ కారణమవుతుంది. కాబట్టి, ఎంత బాగా పనిచేస్తున్నా పాత, గీతలుపడ్డ కుక్కర్లను వాడొద్దు. బదులుగా స్టీలు అయొనైజ్‌డ్ అల్యూమినియం కుక్కర్లను ఎంచుకుంటే మేలు. అలాగే మెటల్ వాటిల్లో ఆమ్ల గుణాలున్న అంటే టొమాటో, చింతపండు వంటివి ఉన్న ఆహారాల్ని ఈ పాత్రలో ఎక్కువ సేపు ఉంచొద్దు. కొత్తవాటిని కొనేటప్పుడూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్), ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికేషన్ ఉందా అనేది గమనించుకోండి. ప్రేమగా, అందరికీ నచ్చినవి వండటమే కాదు. ఆరోగ్యంగా అందిస్తున్నామా అన్నదీ చూసుకోవాలి. అప్పుడే మీరు, మీ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండగలరు. మరి గమనించుకోండి. పాతవి ఉంటే ఇకనైనా మార్చేయండి. □

# పార్టీకి రంగుల హంగామా ..



పుట్టినరోజులు, ఫ్రెండ్స్‌తో గెట్‌టూగెదర్..సందర్భం ఏదైనా ఆ పార్టీలో మనం అందరిలోనూ మెరిసిపోవాలని అనుకోవడం సహజమే.కానీ, అయితే, ఫ్యాషన్ నిపుణులు చెప్పే ఈ సూత్రాలు మీ కోసమే..

**నలుపు-తెలుపుల సొగసు:** సందర్భం ఏదైనా, ఎన్ని సార్లు ధరించినా కొత్తదనం కనిపించేలా చేయడంలో బ్లాక్ అండ్‌నవైట్ రంగులకు మించినవేం ఉంటాయి. అందుకే పార్టీవేర్‌గా.. మీవార్డ్‌రోబ్‌లో వీటిని తప్పక ఉంచుకోవాలి. కాలేజీ అమ్మాయిలకు లిటిల్ బ్లాక్ డ్రెస్, వైట్ జంప్‌సూట్‌లు బాగుంటాయి. వీటిమీదకు స్టేట్‌మెంట్ జ్యూయెలరీ అదిరిపోతుంది. మరీ ఆధునికంగా వేసుకోలేం అనుకుంటే బ్లాక్ అనార్కలీనో, లాంగ్ గౌన్‌నో ఎంచుకుంటే సరి. ఈ సందర్భాలకు నలుపు రంగు చీరకు నప్పుతుంది.



**సీక్విన్-గ్లిట్టర్ హంగులు :** ఏ తరహా రంగు దుస్తులు ఎంచుకున్నా, వాటిమీదకు చమక్కుమనే ఎంబ్రాయిడరీ, సీక్విన్లు డిజైన్ ఉంటే చాలు. ఎంతమందిలో ఉన్నా ప్రత్యేకంగా కనిపించొచ్చు.


**యాక్సెసరీలు:** మీ అవుట్‌ఫిట్‌ని గోల్డ్, సిల్వర్ మెటాలిక్ వెయిస్ట్ బెల్ట్, స్లింగ్ బ్యాగ్, క్లచ్‌లు మరింత అందంగా కనిపించేలా చేస్తాయి. ఇక, చెప్పుల విషయానికి వస్తే.. నలుపు, తెలుపు మాత్రమే కాదు, గ్లిట్టర్, మెటాలిక్ ఫినిషింగ్ ఉన్న ఎరుపు, గోల్డ్, న్యూడ్ కలర్ స్నీకర్స్, స్టిలెటోస్, వెడ్ రకాలు బాగుంటాయి. హైఫ్లాట్‌ఫామ్ ఫ్లిప్‌ఫ్లాప్స్, బాలేరియన్స్ కూడా మంచి ఎంపికే.





# సద్గురువును ఆశ్రయిస్తేనే..

**సన్యాసి అయినా, గృహస్థు అయినా** సద్గురువు మార్గదర్శకత్వంలోనే ఆధ్యాత్మిక పురోగతిని సాధించగలరు. అర్హత లేని గురువును ఆశ్రయిస్తే.. ఆశ్రయం పొందిన వారు, ఇచ్చివారూ కూడా భ్రష్టులవుతారు. దీనికి గురుదేవులు రామకృష్ణ పరమహంస చక్కని దృష్టాంతం చెప్పారు. వారు ఓ రోజు తాము పూజారిగా ఉన్న కోల్‌కతా దక్షినేశ్వరంలో పంచవటి దిశగా వెళ్తుండగా.. సమీపంలోని సరుగుడు తోపు నుంచి ఓ కప్ప దీనారావం వినిపించింది. ఆయన కుటీరంలో చాలా సేపు ధ్యానం చేసుకొని తిరిగి వస్తున్నప్పుడు కూడా కప్ప అలాగే అరుస్తోంది. అది ఎందుకలా దీనంగా శబ్దం చేస్తోందని పరమహంస అటుగా వెళ్లారు. చిన్న పాము కప్పను నోట చిక్కించుకుంది. పాము సన్నగా ఉండటంతో కప్పను మింగలేకపోతోంది. అలాగని వదలడంలేదు. అందుకే కప్ప అరుస్తోంది. సద్గురువు కాని వ్యక్తి చేతిలో పడిన శిష్యుల పరిస్థితి. బతకలేక, మోక్షం పొందలేక అన్నట్లు ఇలాగే ఉంటుందంటూ చెప్పారు పరమహంస, సద్గురువు లభిస్తే.. శిష్యుడి సంశయాలన్నీ తీరి, బంధాలన్నీ తొలగి ప్రశాంతత పొందుతాడు. అదే శిష్యుడు అర్హత లేని గురువును ఆశ్రయిస్తే.. శిష్యుడికి ఉన్న కష్టాలకు తోడు మరిన్ని కష్టాలు వచ్చిపడతాయి. సంశయాలు తీరకపోగా, కొత్త సందేహాలు జత చేరతాయి. అవస్థ తప్పదు. సద్గురువులు బోధ గురువులు, అర్హత లేని గురువులు బాధ గురువులు అంటూ వివరించారు పరమహంస. □



ఆధ్యాత్మికం

# పండగ ప్రత్యేకం గేవర్ !



కలమ్, గేవర్ వినడానికి మనుషుల పేర్లలా ఉన్నా.. నిజానికి ఇవి స్వీట్ల పేర్లు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో వీటిని ప్రత్యేకంగా తయారుచేస్తారు. కొన్ని దశాబ్దాల కిందట రాజస్థాన్ నుంచి వలస ఒక అతను చిక్కని పాలను మరిగించి కలమ్ తయారుచేసేవాడు. దీనికి ఎంత గిరాకీ ఉన్నా నాణ్యత విషయంలో అతను ఎప్పుడూ రాజీపడలేదు. తొంభై ఏళ్లు వచ్చినా స్వయంగా తయారుచేసేవాడు. ఆయన కొడుకు ఇప్పుడు ఇదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. ఇక గేవర్ విషయానికి వస్తే.. పండగ వచ్చిందంటే చాలు ఈ ప్రాంతంలో అందరికీ ఇదే గుర్తుకొస్తుంది. మైదా, పాలు, నెయ్యి, వనస్పతి, మిఠాయి రంగును ఉపయోగించి చిక్కని పాకంలా తయారుచేస్తారు. కాగేనూనెలో దీన్ని కొద్దికొద్దిగా పోయడంతో రంధ్రాలతో తెట్టులా తయారవుతుంది. దీని మీద చక్కెర పాకం పోసి తినడానికి సిద్ధం చేస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లే వాళ్లు కొన్న తర్వాత దీని మీద పాకం వేసుకుని తింటారు. భైంసా వాసులు ఇతర ప్రాంతాల్లోని తమ బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లినప్పుడు ఈ స్వీటును తప్పకుండా తీసుకెళతారు. □



# పిండి కలిపే సంచి

**పూరీల, చపాతీల కోసం పిండి కలుపుతుంటే చుట్టూ** పిండి పడుతుంది. చేతులకు అంటుకుని.. ఒకపట్టాన వదలదు. ఇలాంటి ఇబ్బందులను తొలగించే సాధనం అట్టా మేకర్ బ్యాగ్. ఈ సంచిలో పిండి, తగినన్ని నీళ్లు ఉంచి జిప్ పెట్టేసి రోల్ చేస్తే చపాతీ పిండి తయారై పోతుంది. గట్టు మీద పిండి పడదు, చేతులకు అంటదు. పని కూడా సులువవుతుంది. బ్యాగ్ నాణ్యమైన మెటీరియల్‌తో తయారైనందున చిరుగుతుందనే భయం ఉండదు. □




### ఫిడే గ్రాండ్ స్విస్..
# ఆధిక్యంలో వైశాలి
## అమెరికా చేతిలో ప్రజ్ఞానంద ఓటమి



**న్యూఢిల్లీ:** ఫిడే గ్రాండ్ స్విస్ 2025, మహిళల విభాగంలో వైశాలి తిరిగి ఉమ్మడి ఆధిక్యంలోకి వచ్చింది. అలాగే రౌండ్ 10లో ప్రజ్ఞానంద అవకాశాలు దెబ్బతిన్నాయి. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్‌లో జరిగిన గ్రాండ్ స్విస్ మహిళల విభా గంలో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ వైశాలి మాజీ ప్రపంచ ఛాంపియన్ ఉక్రెయిన్‌కు చెందిన మరియా ముజిచు క్‌ను ఓడించి ఉమ్మడి ఆధి క్యంలోకి దూసుకెళ్లింది. డిఫెండింగ్ ఛాంపియన్ సిసి లియన్ డిఫెన్స్‌తో తలప డింది. వైశాలి 42 ఎత్తుగడ లలో గెలిచి, ఉక్రెయిన్‌కు చెందిన ఓవర్‌నైట్ లీడర్ కాటెరినా లాగ్నోతో కలిసి 10 పాయింట్లలో 7.5 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. ఈ ఇద్దరు అగ్రగాముల తర్వాత ఇప్పుడు మాజీ మహిళా ప్రపంచ



ఛాంపియన్‌లు చైనాకు చెందిన జోంగీ టాన్ మరియు యుక్సిన్ సాంగ్ మరియు కజకిస్తాన్‌కు చెందిన బిబిసారా అస్సాబ యేవా ఏడు పాయింట్లతో ఉన్నారు. ఇక ఓపెన్ విభాగంలో ఎరిగైసి అర్జున్ చైనాకు చెందిన యు యాంగీతో డ్రాగా ఆడగా, మాజీ జాయింట్ లీడర్ నిహాల్ సరిన్ కూడా ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌ను మాత్రమే ఓడించగలిగాడు, దీంతో క్యాండిడేట్స్‌లో బెర్త్ కోసం భారత సవాలు దాదాపుగా ఆవిరైపోయింది. కాగా ఈ టోర్నమెంట్ నుండి క్యాండిడేట్స్‌లో చోటు దక్కించుకోవాలనే ఆర్ ప్రజ్ఞానంద లక్ష్యం అమెరికాకు చెందిన హాన్స్ మోక్ నీమాన్ చేతిలో ఓడిపోవడంతో ముగిసింది.



## యుఎఇ రేసు అతికా కైవసం

**న్యూఢిల్లీ:** భారత రేసింగ్‌లో 10 ఏళ్ల ప్రాడిజీ అతికా మీర్ యుఎఇ కార్టింగ్‌లో మినీమాక్స్ విభాగంలో రేసును గెలుచుకున్న మొదటి మహిళగా చరిత్ర సృష్టించింది. అనుభవజ్ఞులైన యూరోపియన్ రేస్ విజేతలతో సహా 14 మంది డ్రైవర్లతో కూడిన ఈ పోటీలో అతికా ఒంటరి మహిళ. అయినా పట్టుదలతో సోమవారం దుబాయ్ కార్ట్‌డ్రోమ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక డిఎఎమ్‌సి ఛాంపియన్‌షిప్ ఓపెనర్‌లో పోల్ పొజిషన్ నుండి కమాండింగ్ విజయాన్ని పూర్తి చేసింది. ఫైనల్స్‌లో, అతికా తన స్థానాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో సఫలమై ట్రాక్ పరిమితుల్లో అందరికంటే ముందుగా నిర్ధారించిన లక్ష్యాన్ని అధిగమించింది. ఈ విజయం ఆమె పోల్ తీసుకున్న మొట్టమొదటి మహిళగా మరియు మినీమాక్స్ విభాగంలో తుది విజయాన్ని సాధించింది. ఇది ఆమె మిడిల్ ఈస్టర్న్ కార్టింగ్ లెగ్‌కు పరిపూర్ణ ప్రారంభాన్ని సూచిస్తుంది. ఆమె అరుదైన ప్రతిభను గుర్తించి, ఫార్ములా 1 ఈ సంవత్సరం ప్రారంభంలో తన ఎఫ్1 అకాడమీ డివైడి ప్రోగ్రామ్ కోసం ఆమెను ఒప్పందం కుదుర్చుకుంది. ఇలా ఒక భారతీయ మహిళా డ్రైవర్‌కు ఇదే మొదటి అవకాశం.

# సూపర్ 4కి భారత్



**న్యూఢిల్లీ:** భారత జట్టు చేతిలో ఓడిపోయినప్పటికీ, పాకిస్తాన్ జట్టు గ్రూప్ ఏ పట్టికలో రెండవ స్థానంలో ఉంది. కానీ, ఈ ఓటమి ప్రభావం ఆ జట్టు నెట్ రన్ రేట్‌పై స్పష్టంగా కనిపిస్తుంది. ఆసియా కప్ 2025 పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఒక మ్యాచ్‌లో గెలిచింది. మెన్ ఇన్ గ్రీన్ ఒక మ్యాచ్‌లో ఓటమిని ఎదుర్కొంది. ఆరో మ్యాచ్‌లో, టీమిండియా పాకిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించి, ఆసియా కప్‌లో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఈ విజయంతో, గ్రూప్ ఏ పాయింట్ల పట్టికలో టీమిండియా బలమైన స్థానానికి చేరుకుంది. పాకిస్థాన్‌ను ఓడించడం ద్వారా టీమిండియా ఇప్పటికే సూపర్ ఫోర్ లో తన స్థానాన్ని నిర్ధారించుకుంది. అంతకుముందు, ఈ నెల 10న యూఏఈపై



## రన్ రేట్ మారిన పరిణామాలు
## ఆసియా కప్ నుంచి పాక్ ఔట్?

టీమిండియా అద్భుతమైన విజయాన్ని సాధించింది. పాకిస్థాన్‌పై ఇది వారి రెండవ విజయం. దీంతో రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో మొదటి స్థానంలో నిలిచిన భారత జట్టు నెట్ రన్ రేట్ విషయంలోనూ (+4.793) దూకుడుగా ఉంది. ఇప్పుడు టీమిండియా తదుపరి మ్యాచ్ సెప్టెంబర్ 19న ఓమన్‌తో జరుగుతుంది. ఇది కేవలం లాంఛనప్రాయ మ్యాచ్ మాత్రమే. కానీ, సూపర్ ఫోర్ కి వెళ్లే ముందు, భారత జట్టు ఇక్కడ కూడా తన బలాన్ని చూపించాలనుకుంటుంది. ఇక భారత జట్టు చేతిలో ఓడిపోయినప్పటికీ, పాకిస్తాన్ జట్టు గ్రూప్ ఏ పట్టికలో రెండవ స్థానంలో ఉంది. కానీ, ఈ ఓటమి ప్రభావం ఆ జట్టు నెట్ రన్ రేట్‌పై స్పష్టంగా కనిపిస్తుంది. ఆసియా కప్ 2025 పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఒక మ్యాచ్‌లో గెలిచింది. మెన్ ఇన్ గ్రీన్ ఒక మ్యాచ్‌లో ఓటమిని ఎదుర్కొంది. ఇప్పుడు పాకిస్తాన్ తదుపరి మ్యాచ్ సెప్టెంబర్ 17న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో జరుగుతుంది. పాకిస్తాన్ సూపర్ ఫోర్‌కు చేరుకోవాలంటే, కచ్చితంగా గెలవాల్సిందే. అదే సమయంలో, పాకిస్తాన్ ముందున్న ఇబ్బందులు మరింత కఠినంగా మారాయి. ఆసియా కప్ 2025 గ్రూప్ బీని పరిశీలిస్తే, ఇక్కడ ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఆధిపత్యం కనిపిస్తుంది. ఇప్పటివరకు ఒక మ్యాచ్ ఆడిన ఆఫ్ఘనిస్తాన్ నెట్ రన్ రేట్ ప్లస్ 4.700 ఉండగా, శ్రీలంక ఒక మ్యాచ్ లో ఒక విజయంతో రెండవ స్థానంలో ఉంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన బంగ్లాదేశ్ ఒక మ్యాచ్ గెలిచి ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. గ్రూప్ బి పట్టికలో ఇది మూడవ స్థానంలో కొనసాగుతోంది. హాంకాంగ్ రెండు ఓటములతో నాల్గవ స్థానంలో పట్టికలో దిగువన ఉంది.

### స్కేటింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో..
# ఆనంద్‌కుమార్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో ఆనంద్‌కుమార్ వెల్‌కుమార్ చారిత్రాత్మక కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. స్పీడ్ స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 500 మీటర్లు+డి స్ప్రింట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకోవడం ద్వారా ఆనంద్‌కుమార్ వెల్‌కుమార్ భారత క్రీడా చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో దేశంలో మొట్టమొదటి సీనియర్ పతక విజేతగా నిలిచాడు. చైనాలోని చెంగ్డులో జరిగిన ప్రపంచ క్రీడల్లో ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ ట్రాక్ 1000 మీటర్ల స్ప్రింట్‌లో వెల్‌కుమార్ కాంస్యం సాధించిన మరో మైలురాయి క్షణాన్ని నమోదు చేసిన కొన్ని వారాల తర్వాత ఈ ఘనత సాధించడం గమనార్హం. ఈ క్రీడల్లో ఆయన 1:22.482 సెకన్ల సమయంతో తొలి పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయ స్కేటింగ్‌లో వెల్‌కుమార్ 2021లో, జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుచుకోవడం ద్వారా గుర్తింపు పొందాడు, ఒక నెల వ్యవధిలో రెండు చారిత్రాత్మక కాంస్య పతకాలు మరియు అంతర్జాతీయ ప్రదర్శనల బలమైన రికార్డుతో, వెల్‌కుమార్ విజయం ప్రపంచ స్పీడ్ స్కేటింగ్‌లో భారతదేశం యొక్క పెరుగుతున్న ఉనికిని హైలైట్ చేస్తుంది.

### రూ.10లక్షల యుపిఐ పరిమితులు
# నేటినుంచే అమల్లోకి!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** యూపీఐ ద్వారా పెద్ద మొత్తంలో చెల్లింపులు చేసేవారికి శుభవార్త. తరచూ లావాదేవీల పరిమితి సమస్యను ఎదుర్కొనే వారికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఊరట కల్పించింది. ఎంపిక చేసిన కొన్ని కీలక రంగాల్లో రోజువారీ లావాదేవీల పరిమితిని ఏకంగా రూ.10 లక్షల వరకు పెంచిన నిర్ణ యాలు సోమవారంనుంచే అమలులోకి వచ్చాయి. గతంలో పెద్ద మొత్తంలో బీమా ప్రీమి యంలు, పెట్టుబడులు, లేదా ఇతర ఖర్చులు చెల్లించాలంటే లావాదేవీలను విభజించాల్సి రావడం లేదా చెక్కులు, బ్యాంకు



బదిలీల వంటి పాత పద్ధతులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను తొలగించి, అధిక విలువైన లావాదేవీలను డిజిటల్ బాట పట్టించేందుకే ఈ మార్పులు చేసినట్లు ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. అయితే, ఈ పెంచిన పరిమితులు కేవలం వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పి2బి) చేసే చెల్లింపులకు మాత్రమే వర్తిస్తాయి. తాజా మార్పుల ప్రకారం, క్యాపిటల్ మార్కెట్లు, బీమా ప్రీమియంల చెల్లింపుల కోసం ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. ఈ విభాగాల్లో ఒక రోజులో గరిష్టంగా రూ.10 లక్షల వరకు చెల్లించవచ్చు. అలాగే, రుణ వాయిదాలు (ఈఎంఐ), ప్రయాణ బుకింగ్‌లు, ప్రభుత్వ ఈమార్కెట్‌ప్లేస్ లావాదేవీల కోసం కూడా ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులకు ఒక్కో లావాదేవీకి రూ.5 లక్షల వరకు అవకాశం కల్పించగా, రోజువారీ పరిమితిని రూ.6 లక్షలుగా నిర్ణయించారు. నగల కొనుగోళ్లకు లావాదేవీ పరిమితిని రూ.2 లక్షలకు, రోజువారీ పరిమితిని రూ.6 లక్షలకు పెంచడం ద్వారా వినియోగదారులకు కొంత వెసులుబాటు కల్పించారు. అయితే, వ్యక్తుల మధ్య (పి2పి) రోజువారీ లావాదేవీల పరిమితిలో ఎలాంటి మార్పు చేయలేదని, అది యథాతథంగా రూ.1 లక్షగానే కొనసాగుతుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. ఈ పెంచిన పరిమితులు కేవలం ధృవీకరించబడిన వ్యాపారులకు (వెరిఫైడ్ మర్చంట్స్) చేసే చెల్లింపులకు మాత్రమే వర్తిస్తాయని, ఇది లావాదేవీల భద్రతను మరింత పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని ఫిన్‌టెక్ సంస్థలు, పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి.

# ఇకపై గడువు పొడిగింపులేదు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 15:** ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) 2024-25కుగాను దాఖలు చేసేందుకు గడువు సోమవారంతో ముగిసిందని ఆదాయపు పన్ను శాఖ స్పష్టం చేసింది. గడువు పొడిగించారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని పేర్కొంది. ఐటీఆర్ గడువు సెప్టెంబర్ 30 వరకు పెంచారు అంటూ కొంతమంది సోషల్ మీడియా వేదికలపై ప్రచారం చేస్తుండగా, ఆదాయపు పన్ను శాఖ తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ఈ విషయాన్ని ఖండించింది. జులై 31 చివరి తేదీగా ఉన్న గడువును ఇప్పటికే సెప్టెంబర్ 15 వరకు పొడిగించాం. ఇప్పుడు మరోసారి పొడిగించినట్టు వస్తున్న ప్రచారం అబద్ధం. ఐటీఆర్ దాఖలుకు సెప్టెంబర్ 15నే చివరి తేదీ. 24న7 హెల్ప్‌డెస్క్ సపోర్ట్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు సహాయంగా కాల్స్, లైవ్ చాట్స్, వెబ్ సెషన్స్ వంటి సేవలతో రౌండ్ ది క్లాక్ హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులో ఉంచినట్లు ఐటీ శాఖ వెల్లడించింది. ఐటీఆర్ దాఖలుపై సందేహాల నివృత్తికి ఇది ఉపయోగపడనుంది. దాదాపు 6 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు ఇప్పటికే ఐటీఆర్‌ను దాఖలు చేశారని ఐటీ విభాగం పేర్కొంది. వీటిలో 5.51 కోట్ల రిటర్నులు ఈవెరిఫై అయ్యాయని, ఇందులో 3.78 కోట్ల రిటర్నుల పరిశీలన పూర్తయిందని వెల్లడించింది. ఆదాయపు పన్ను శాఖ మరో ముఖ్య హెచ్చరికను చేసింది. తప్పుడు సమాచారం లేదా మోసపూరిత మినహాయింపులు చూపించి రిఫండ్ తీసుకునే ప్రయత్నాలు నేరంగా పరిగణించబడతాయని, దీనివల్ల శిక్ష, జరిమానాలు మరియు పన్ను నోటీసులు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.